www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 20-5-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume): 22 | సంచిక (Issue): 51 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'

22న అల్పపీడనం.. తుఫాన్‌గా మారే చాన్స్!

దక్షిణ భారతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం

రాష్ట్రంలో నేడూ వర్షాలు!

ఎండ తీవ్రతపై 13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు

పిడుగుపాటుకు ముగ్గురి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

3





..అయితే ఓకే!

రాష్ట్ర మంత్రివర్గ భేటీకి షరతులతో అనుమతిచ్చిన ఈసీ

- జూన్ 4లోపు చేయాల్సిన అత్యవసర అంశాలపైనే చర్చించాలి
- రుణ మాఫీ, ఉమ్మడి రాజధానిపై మాట్లాడొద్దు
- ఎన్నికల్లో భాగమైన అధికారులు పాల్గొనొద్దు
- షరతులు విధించిన కేంద్ర ఎన్నికల సంఘం
- నేడు సచివాలయంలో కేబినెట్ సమావేశం
- ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, వానాకాలం పంటల ప్రణాళికపై భేటీలో చర్చ!

హైదరాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): ఒక రోజంతా కొనసాగిన ఉత్కంఠకు తెరదించుతూ.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అనుమతిచ్చింది. అయితే, కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో జూన్ 4లోపు చేయాల్సిన అత్యవసరమైన అంశాలనే చర్చించాలని షరతు విధించింది. ముఖ్యంగా రైతు రుణ మాఫీ, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని వంటి అంశాలను భేటీలో చేపట్టకూడదని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులు సమావేశంలో పాల్గొనకూడదని స్పష్టం చేసింది. ఆదివారం ఈసీ నుంచి ఈ మేరకు సమాచారం రావడంతో.. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాబినెట్ భేటీ ఉంటుందని సీఎం శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంపై మంత్రులందరికీ సమాచారం చేరవేశారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా దీనికి హాజరుకానున్నారు. కాగా, రాష్ట్రంలో ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో.. శనివారం మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. కోడ్ ఉన్నందున అనుమతి కావాలంటూ సీఈసీకి



మిగతా 13వ పేజీలో...

అన్నారం, సుందిళ్లపై ఫోకస్

- బ్యారేజీల నుంచి ఈ సీజన్‌లో పంపింగ్‌కు నిర్ణయం!
- త్వరలో పంప్‌హౌస్‌ల పరిశీలనకు ముఖ్యమంత్రి
- బ్యారేజీల మరమ్మతు పనులు వేగవంతం

13

హెలికాప్టర్ ప్రమాదం.. ఇరాన్ అధ్యక్షుడు

రైసీ గల్లంతు

- తూర్పు అజర్‌బైజాన్‌లో కూలిన చాపర్!
- ఆనకట్ట ప్రారంభానికి వెళ్లివస్తుండగా ఘటన
- జోల్ఫా అడవుల్లో హెలికాప్టర్ మిస్సింగ్
- పర్వతాలు.. భారీ వర్షాలు.. పొగమంచుతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు
- రైసీ వెంట విదేశాంగ మంత్రి
- అమెరికా అధ్యక్షుడు బైడెన్ అత్యవసర భేటీ
- క్షేమంగా తిరిగి రావాలన్న ప్రధాని మోదీ



టెహ్రాన్, మే 19: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గల్లంతైంది. పొరుగుదేశం అజర్‌బైజాన్, ఇరాన్‌లోని తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్ సరిహద్దుల్లో ఓ డ్యామ్ ప్రారంభోత్సవానికి ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ ఆమిర్ అబ్దులాహియన్, అధికారులు, అంగరక్షకులతో కలిసి హెలికాప్టర్‌లో బయలుదేరారు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మరో రెండు హెలికాప్టర్లు కూడా ఆయన చాపర్ వెంట ఉన్నాయి. మధ్యాహ్నానికి తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని పర్వత

మిగతా 13వ పేజీలో...



డయాగ్నస్టిక్ హబ్‌లకు జబ్బు!

సిబ్బందికి 6 నెలలుగా జీతాల్లేవ్

- ఉద్యోగాలు మానేస్తున్న సిబ్బంది, వైద్యులు
- 104 సేవల నుంచి హబ్‌లకు సిబ్బంది
- వేతన సొమ్మును ఏజెన్సీలకిస్తున్న సర్కారు
- సిబ్బందికి చెల్లించకుండా తమ ఖాతాల్లోనే నెలల తరబడి ఉంచుకుంటున్న ఏజెన్సీలు
- హబ్‌లలో నిపుణులైన సిబ్బంది కొరత
- తగినంత మంది రేడియాలజిస్టులు లేక రేడియోగ్రాఫర్ల వద్దకే టెస్టుల రిపోర్టులు
- క్వాలిటీ కంట్రోల్ కూడా సరిగా లేని వైనం
- మెషీన్లు పాడైతే మరమ్మతులూ కరువు

హైదరాబాద్/మహబూబ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేదలకు వైద్య పరీక్షల భారాన్ని తగ్గించేందుకు ఏర్పాటైన తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్‌లకు జబ్బు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వీటి పనితీరు అస్తవ్యస్తంగా మారింది. వీటిలో పనిచేసేందుకు తగినంత మంది రెగ్యులర్ సిబ్బంది లేకపోవడం ఒక సమస్య అయితే, ఉన్నవారికి సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడం మరో సమస్యగా ఉంది. ప్రస్తుతం ఈ హబ్‌లలో పనిచేస్తున్న సిబ్బందికి ఐదారు నెలలుగా వేతనాలు

మిగతా 13వ పేజీలో...

కాంగ్రెస్‌లో మమత చిచ్చు..!

- కూటమిలో టీఎంసీ పాత్రపై ఖర్గే వర్సెస్ అధీర్
- అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించాల్సిందే
- లేదంటే బయటకు వెళ్లిపోవచ్చు: ఖర్గే
- పార్టీ సేవకుడిగా నా పోరాటాన్ని ఆపలేను
- మమతా బెనర్జీని సమర్థించలేను: అధీర్







కోల్‌కతా, మే 19: ఇండియా కూటమిలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యవహారం కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. దీనిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే; లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత, పశ్చిమ బెంగాల్ పీసీసీ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అధీర్ చౌదరీ వైఖరి పట్ల ఖర్గే సీరియస్ అయ్యారు. ఇండియా కూటమి విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని అల్టిమేటం జారీచేశారు. ఇష్టంలేని వారు వెళ్లిపోవచ్చని హెచ్చరించారు. టీఎంసీ విషయంలో

మిగతా 2వ పేజీలో...

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే.. 2

'సీబీఐ, ఈడీ'కి తాళాలు!: అఖిలేశ్

8 రాష్ట్రాలు.. 49 స్థానాలు

- నేడే సార్వత్రిక ఎన్నికల ఐదో దశ పోలింగ్.. రాహుల్, స్మృతి, రాజ్‌నాథ్ తదితర హేమాహేమీలు బరిలో
- ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ.. 4 కీలక రాష్ట్రాల్లోని 39 స్థానాల్లో బీజేపీకి అగ్నిపరీక్ష



ఝార్ఖండ్‌లో ఎన్నికల విధులకు హెలికాప్టర్‌లో వెళ్తున్న సిబ్బంది

న్యూఢిల్లీ, మే 19 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం మొదలై సుదీర్ఘంగా సాగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరంలో అత్యంత కీలకమైన ఐదో దశ పోలింగ్ సోమవారం జరగనుంది. మొత్తం ఏడు దశలుగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో.. అతి తక్కువ స్థానాలకు పోలింగ్ జరిగే దశ ఇదే. ఈసారి కేవలం 49 స్థానాలకే ఎన్నికలు జరగనున్నప్పటికీ.. ఆ స్థానాలు ఎనిమిది రాష్ట్రాల్లో విస్తరించడం, పలువురు హేమాహేమీలు బరిలో ఉండడం రాజకీయ

మిగతా 2వ పేజీలో...

వేలాది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారు!

- అరెస్టులతో ఆప్‌ను నాశనం చేయలేరు
- ప్రధాని మోదీకి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హెచ్చరిక
- బీజేపీ ఆఫీసు ముట్టడికి తరలివెళ్లిన ఆప్ శ్రేణులు
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు

2



రాహుల్‌ది మావోయిస్టు భాష

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఏ పారిశ్రామికవేత్త అయినా 50సార్లు ఆలోచిస్తాడు
- పారిశ్రామికవేత్తల నుంచి డబ్బు దోచేందుకే ఆ భాష
- కాంగ్రెస్, టీఎంసీ.. ఒకే నాణేనికి రెండు ముఖాలు
- ముస్లిం ఛాందసవాదుల ఒత్తిడితో సాధుసంతులపై బెంగాల్ సీఎం మమత వ్యాఖ్యలు: ప్రధాని ధ్వజం

2

యూపీలో బీజేపీకి వచ్చేది ఒక్క సీటే

కూటమి అధికారంలోకి రాగానే ఎమ్మెస్పీకి చట్టబద్ధత: రాహుల్

కన్నకూతుర్ని కడతేర్చిన తల్లిదండ్రులు

- మానసిక స్థితి బాగోలేని కుమార్తెను వదిలించుకోవాలని హత్య
- అనారోగ్యంతోనే మరణించిందని నమ్మించి అంత్యక్రియలు
- గ్రామస్థుల అనుమానంతో బయటికొచ్చిన నిజం
- నిందితుల అరెస్టు, సిరిసిల్ల జిల్లాలో ఘటన

3

స్వీపర్‌కు 2 లక్షల జీతం!

- పనిచేయకున్నా.. సంతకం పెడితే చాలు
- రూ.46 కోట్ల జీఎస్టీ కుంభకోణంలో వింత
- ఈ-బైక్ పేరుతో ఏడు బోగస్ కంపెనీలు
- డైరెక్టర్లంతా ఈ కోవకు చెందినవారే
- పైసా ఖర్చు లేకుండా.. పత్రాలతోనే బురిడీ
- దర్యాప్తులో నిగ్గుతేల్చిన సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): అతనో స్వీపర్.. ఆఫీసును శుభ్రపరచడమే పని..! కానీ పనిచేయకున్నా.. అడిగినప్పుడు సంతకాలు మాత్రం పెట్టి, నెలకు తీసుకునే జీతం రూ.2 లక్షలు..! కారణం.. జీఎస్టీ రీఫండ్ కోసం అతణ్ని డైరెక్టర్‌గా చూపించడమే..! అతనొక్కడే కాదు.. ఆఫీస్‌బాయ్, హౌస్‌కీపింగ్‌లో పనిచేసే ఒకరిద్దరిని డైరెక్టర్లుగా పెట్టడం గమనార్హం..! ఈ నెల 4న వెలుగులోకి వచ్చిన రూ.46 కోట్ల జీఎస్టీ రీఫండ్ కుంభకోణంలో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్న కొద్దీ ఇలాంటి విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కుంభకోణం వెనక ఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మ కీలక పాత్ర పోషించినట్లు సీసీఎస్ పోలీసులు నిగ్గుతేల్చారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ కంపెనీలకు ప్రభుత్వం జీఎస్టీలో 13% రాయితీ ఇస్తుండడంతో.. తాను కన్సల్టెంట్‌గా

మిగతా 12వ పేజీలో...



రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు

- తాలు, తరుగు పేరుతో 5-10 కిలోల కోత
- మద్దతు ధర ఇవ్వకపోవడంతో తీవ్ర నష్టం
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతన్నల పడిగాపులు
- అన్నదాతలను సర్కారు ఆదుకోవాలి: సంజయ్
- పదేళ్ల కరువు తీరేలా రేవంత్ పైసావసూల్: ఈటల

హైదరాబాద్/నల్లగొండటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): తాలు, తరుగు, తేమ పేరుతో క్వింటాకు 5-10 కిలోలు కోత పెడుతూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మండిపడ్డారు. కల్లాల వద్ద రైతుల కష్టాలు సర్కారుకు పట్టవా..? అని నిలదీశారు. తరుగుతో సంబంధం లేకుండా మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

మిగతా 12వ పేజీలో...

ఆ భూమి ఎవరిది?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

- సుచిత్రలోని భూ వివాదంపై..
- ఎమ్మెల్యే మల్లారెడ్డి, విప్ లక్ష్మణ్ పరస్పర సవాళ్లు
- నా వద్ద ఉన్న డాక్యుమెంట్లు..
- ఫోర్జరీ అని నిరూపిస్తే రాజీనామా చేస్తా
- లేదంటే లక్ష్మణ్ రాజీనామా చేస్తారా?: మల్లారెడ్డి
- వారం గడువిస్తాం.. ఏ సర్వే ఐనా చేయించుకో
- మా తప్పు ఉంటే క్షమాపణ చెప్పి వెళ్తాం: లక్ష్మణ్
- వివాదాస్పద భూమిపై రెవెన్యూ శాఖ సర్వే
- పోలీసుల సహకారంతో చేపట్టిన అధికారులు

14

పార్లమెంట్ భద్రత సీఐఎస్ఎఫ్ చేతికి

నేటినుంచి 3,317 మంది సిబ్బంది విధుల్లోకి

2



రోదసిలోకి గోపి తోటకూర

- తొలి భారతీయ అంతరిక్ష యాత్రికుడిగా రికార్డు
- రాకేశ్‌శర్మ తర్వాత మళ్లీ ఇప్పుడే ఘనత
- బ్లూ ఆరిజిన్ న్యూషెపర్డ్-25 విజయవంతం
- పది నిమిషాలపాటు సాగిన యాత్ర
- భూమికి 105 కి.మీ. ఎత్తుకు స్పేస్ క్యాప్సూల్

14

కోడ్ ఉల్లంఘన..

కేటీఆర్‌పై చర్యలకు ఈసీ ఆదేశం

12

పార్లమెంట్ భద్రత సీఐఎస్ఎఫ్ చేతికి

న్యూఢిల్లీ, మే 19: ఢిల్లీలోని పార్లమెంటు భద్రత బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) చేపట్టనుంది. మొత్తం 3,317 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది సోమవారం నుంచి పార్లమెంటు ఆవరణలో ఉగ్రవాద వ్యతిరేక, విధ్వంస నిరోధక భద్రత విధులు నిర్వహిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకూ సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 1,400 మందికి పైగా సిబ్బంది పార్లమెంటు భద్రతను పర్యవేక్షించారు. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్(పీడీజీ) గత శుక్రవారం తన కమాండోలను ఉపసంహరించుకుందని, డీఐజీ ర్యాంకు స్థాయి అధికారి పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని అన్ని సెక్యూరిటీ పాయింట్లను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించారని అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబరు 13న పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన ఘటన తర్వాత పాత, కొత్త పార్లమెంట్ భవనాలు, అనుబంధ నిర్మాణాల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాహుల్‌ది మావోయిస్టు భాష!

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఏ పారిశ్రామికవేత్త అయినా 50సార్లు ఆలోచిస్తాడు: మోదీ



జంషెడ్‌పూర్, పురులియా, మే 19: కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ వాడుతున్న మావోయిస్టు భాష కారణంగా.. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏ పారిశ్రామిక వేత్త అయినా ఒకటికి యాభైసార్లు ఆలోచిస్తాడని ప్రధాని మోదీ విమర్శించారు. పారిశ్రామికవేత్తల నుంచి డబ్బు దోచుకోవడానికే ఆయన ఆ భాష వాడుతున్నారని ఆరోపించారు. ముస్లిం ఛాందసవాదుల ఒత్తిడితో.. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ హిందూ సాధుసంతులపై విమర్శలు చేస్తున్నారని మోదీ మండిపడ్డారు. ఆదివారం ఆయన ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, పశ్చిమబెంగాల్‌లోని పురులియా, బిష్ణుపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఝార్ఖండ్‌లో తాము నక్సల్స్ వెన్ను విరిస్తే.. డబ్బు దోచుకునే బాధ్యతను కాంగ్రెస్, ఝార్ఖండ్ ముక్తిమోర్చా తీసుకున్నాయని దుయ్యబట్టారు. పీకల్లోతు అవినీతిలో మునిగిపోయిన ఆ రెండు పార్టీలూ దేశాభివృద్ధి కోసం ఏమీ చేయలేదని వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌లోని పురులియా, బిష్ణుపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోదీ.. రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ సంఘకు చెందిన కొందరు సాధుసన్యాసులు ఢిల్లీలోని బీజేపీ నేతల ప్రభావంతో తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ ఆ రాష్ట్ర సీఎం మమత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సేవకు, నైతికతకు పేరెన్నికగన్న ఇస్కాన్, రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ సంఘ విషయంలో టీఎంసీ హద్దులు దాటి, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని, మమత బహిరంగంగానే ఆ సంస్థలను బెదిరిస్తూ హెచ్చరికలు జారీచేస్తున్నారని ఆరోపించారు. జూన్ 4న తాము మళ్లీ అధికారపగ్గాలు చేపట్టాక.. అవినీతిపరులందరినీ శాశ్వతంగా జైలుకు పంపుతామని హెచ్చరించారు. కాంగ్రెస్, టీఎంసీ పార్టీలు అవినీతి విషయంలో ఒకే నాణేనికి రెండు ముఖాల్లాంటివని మోదీ ఎద్దేవా చేశారు. "టీఎంసీ, కాంగ్రెస్, వామపక్షాలు.. వేర్వేరు పార్టీలుగా కనిపించినా, ఆ పార్టీలు చేసిన పాపాలు ఒకటే. అందుకే ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి" అన్నారు.

మోదీకి ఓటేయొద్దన్న ప్రభుత్వ టీచరు అరెస్టు

పట్నా, మే 19: ప్రధాని నరేంద్ర మోదీకి ఓటు వేయకూడదంటూ విద్యార్థులకు చెప్పిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడ్ని అరెస్టు చేసినట్టు బిహార్ రాష్ట్ర అధికారులు తెలిపారు. ముజఫర్‌నగర్ జిల్లా కుర్నానీ సమితి అమ్రఖ్‌లోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలలో పనిచేస్తున్న హరేంద్ర రజక్‌పై ఈ చర్య తీసుకున్నట్లు చెప్పారు. ఉచిత రేషన్ పేరుతో మనుషులు తినడానికి పనికిరాని బియ్యం పంపిణీ చేస్తున్నందున మోదీకి ఓటు వేయడకూడదని ఆయన తరగతి గదిలో విద్యార్థులకు చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు డీఈఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరూ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించకూడదని, ఆ టీచరు దీన్ని ఉల్లంఘించడంతో కేసు పెట్టి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

'ఉచిత బస్సు'పై ప్రధాని వ్యాఖ్యలు బాధాకరం



బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): శక్తి గ్యారెంటీ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే వెసులుబాటు కల్పించడంతో మెట్రో ఆదాయం తగ్గిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం బాధాకరమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. సమగ్ర సమాచారం లేకుండానే ప్రధాని ఇటువంటి వ్యాఖ్యలు చేశారన్నారు. శనివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిలో మెట్రోకు రూ.130 కోట్ల ఆదాయం వచ్చిందని, ప్రయాణికుల సంఖ్య 30% పెరిగిందన్నారు. కర్ణాటకలో కేవలం బెంగళూరులో మాత్రమే మెట్రో సేవలు ఉన్నాయనీ, శక్తి గ్యారెంటీ రాష్ట్రమంతా అమలులో ఉందన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్‌పై అరెస్టు వారెంట్

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న హసన్ ఎంపీ ప్రజ్వల్‌పై బెంగళూరు నగరంలోని 42వ ఏసీఎంఎం కోర్టు శనివారం అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రజ్వల్‌పై ఇప్పటి వరకు దాఖలు చేసిన నోటీసుల గురించి కోర్టు.. సిట్ అధికారులను వివరణ కోరింది. 24 గంటల్లో లొంగిపోవాలని నోటీసు, లుక్ అవుట్ నోటీసు, బ్లూ కార్నర్ నోటీసు జారీ చేశామనీ, అయినా విచారణకు హాజరు కాలేదని సిట్ అధికారులు కోర్టుకు వివరించారు. ప్రజ్వల్‌పై నాన్‌బెయిల్ వారెంట్ జారీ చేయాలనీ, పాస్‌పోర్టును రద్దు చేయాలని కోర్టును కోరారు. అందుకు అనుగుణంగా కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది.

నాణ్యత లోపించిన పతంజలి సోం పాపిడి

» కంపెనీ అధికారి సహా ఇద్దరికి జైలుశిక్ష

న్యూఢిల్లీ, మే 19: ఉత్తరాఖండ్‌లోని పితోర్‌ఘర్‌లో నాణ్యత లేని సోం పాపిడి విక్రయిస్తున్నందుకు పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సహా మరో ఇద్దరికి పితోర్‌ఘర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శనివారం ఆరు నెలల జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. పితోర్‌ఘర్‌లోని లీలాధర్ పాఠక్ అనే వ్యాపారి దుకాణంలో విక్రయానికి ఉంచిన పతంజలి నవరత్న ఎలియాచి సోం పాపిడిలో నాణ్యత లేదని ఫిర్యాదులు రావడంతో స్థానిక ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్ 2019లో నమూనాలు సేకరించారు. వాటికి ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రయోగశాలలో పరీక్షలు జరిపి నాణ్యత లోపించినట్లు గుర్తించారు.

డ్రైనేజీ పనులు చేస్తూ మరణిస్తే రూ.30లక్షలు

న్యూఢిల్లీ, మే 19: చేతులతో డ్రైనేజీ పనులు చేస్తూ పారిశుధ్య కార్మికుడు మరణిస్తే అతని కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. 2023లో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చిందని, దీన్ని తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. వారి కుటుంబానికి తగిన పునరావాసం కూడా కల్పించాల్సి ఉంటుందని పేర్కొంది. ఢిల్లీలోని లజపత్ నగర్‌లో డ్రైనేజీ పనులు చేస్తూ 2017లో మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు రూ.30 లక్షల వంతున పరిహారం చెల్లించాలని ఆదేశించింది.



స్పెయిన్, పోర్చుగల్ దేశాల గగనతలంలోకి శనివారం అర్ధరాత్రి నీలిరంగు కాంతులను వెదజల్లుతూ ఓ భారీ ఉల్కా దూసుకువచ్చింది. రాత్రి సమయం కావడంతో ఈ ఉల్కా స్పష్టంగా కనిపించింది. ఉల్కా వెలుగు కొన్ని వందల కిలోమీటర్ల దూరం కనిపించినట్లు అక్కడి ప్రజలు తెలిపారు. అది గాల్లో దూసుకువెళ్తున్న వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అవి వైరల్ అయ్యాయి.

కాంగ్రెస్‌లో మమత చిచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

అధీర్ చౌదరి వైఖరితో అధిష్ఠానం ఏకీభవించడం లేదన్నారు. ఖర్గే ఘాటుగా హెచ్చరించినప్పటికీ అధీర్ ఏమాత్రం లెక్క చేయలేదు. మమత విషయంలో తన వైఖరి మారదని మరోసారి స్పష్టం చేశారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై తనకు నమ్మకం లేదని, ఆమె బీజేపీ వైపు వెళ్లవచ్చని కాంగ్రెస్ నేత అధీర్ చౌదరి చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందించారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది పార్టీ అధిష్ఠానమే తప్ప అధీర్ కాదని స్పష్టం చేశారు. 'ఇండియా కూటమికి బయటి నుంచి మద్దతిస్తానని మమత బెనర్జీ చెప్పారు. గతంలో కూడా ఇలాంటి సందర్భాలు ఎదురయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనూ కమ్యూనిస్టులు బయటి నుంచి మద్దతిచ్చారు' అని ఖర్గే గుర్తుచేశారు. అయితే ఇక్కడ నిర్ణయాలు తీసుకునేది అధీర్ చౌదరి కాదని.. కూటమి విషయంలో ఏదైనా కాంగ్రెస్ అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని అందరూ పాటించాల్సిందేనని, అలా చేయని వారు బయటకు వెళ్లవచ్చని ఘాటుగానే హెచ్చరించారు. ముంబైలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ.. మమత ఇండియా కూటమిలో భాగమేనని అన్నారు.

ఎవరు చెప్పినా వినను: అధీర్

ఇండియా కూటమిలో మమత పాత్రపై ఖర్గే స్పష్టమైన ప్రకటన చేసినప్పటికీ.. టీఎంసీ అధినేత్రిపై కాంగ్రెస్ నేత అధీర్ చౌదరి విమర్శలు కొనసాగించారు. ఎవరు ఏం చెప్పినా.. సీఎం మమత, ఆమె పార్టీపై విమర్శలు కొనసాగిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. తనను, కాంగ్రెస్ పార్టీని అంతం చేయాలనుకున్న మమత గురించి తాను సానుకూలంగా మాట్లాడలేనని తేల్చిచెప్పారు. 'పార్టీ సేవకుడిగా నా పోరాటాన్ని ఆపలేను. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. టీఎంసీకి వ్యతిరేకంగా నా ఈ పోరాటం సైద్ధాంతిక పోరాటం. బెంగాల్‌లో పార్టీని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలో టీఎంసీ, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయి' అని అన్నారు.

బెంగాల్‌లో ఖర్గే పోస్టర్లు ధ్వంసం

పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ చౌదరిపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడిన మరుసటి రోజే.. ఆ రాష్ట్రంలో ఖర్గే పోస్టర్లు ధ్వంసమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఎదుట ఖర్గే పోస్టర్లు, హోర్డింగులపై నల్ల రంగు పూసిన గుర్తు తెలియని వ్యక్తులు.. వాటిపై 'తృణమూల్ కాంగ్రెస్ ఏజెంట్' అని రాశారు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగి ఉండొచ్చని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేతలు, అధీర్ చౌదరి మధ్య విభేదాలు సృష్టించాలనే ఉద్దేశంతో టీఎంసీనే ఈ పని చేసి ఉంటుందని కాంగ్రెస్ నేత ఒకరు ఆరోపించారు. ప్రస్తుతం బహరంపూర్‌లో ఉన్న అధీర్ చౌదరి కూడా ఈ సంఘటనపై అసంతృప్తి వ్యక్తం చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారని పేర్కొన్నారు.



పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలో ఖర్గే ఫొటోకు నల్లరంగు పూసిన దుండగులు

'ఇండియా' అధికారంలోకి రాగానే సీబీఐ, ఈడీలకు తాళాలు!

» సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్

న్యూఢిల్లీ, మే 19: ప్రతిపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రాగానే సీబీఐ, ఈడీ కార్యాలయాలకు తాళాలు వేయాలని తాను ప్రతిపాదిస్తానని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ చెప్పారు. ఒక ఆంగ్ల పత్రిక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'సీబీఐ, ఈడీ మూతపడాల్సిందే. ఎవరైనా మోసానికి పాల్పడితే నిగ్గు తేల్చడానికి ఐటీ శాఖ ఉంది. ఇక సీబీఐ ఎందుకు? ప్రతి రాష్ట్రానికీ అవినీతి నిరోధక శాఖ ఉంది. అవసరమైతే దాన్ని ఉపయోగించుకోవచ్చు. బీజేపీ రాజకీయ ప్రత్యర్థుల పైకి మాత్రమే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా, కూల్చాలన్నా వాటిని వినియోగిస్తున్నారు. సీబీఐ, ఈడీలను ప్రయోగించి బీజేపీ ఏ విధంగా దోపిడీకి పాల్పడిందో ఎన్నికల బాండ్ల వ్యవహారం బట్టబయలు చేసింది' అని అఖిలేశ్ యాదవ్ వివరించారు.

యూపీలో బీజేపీకి ఒక్క సీటే



ప్రయాగ్‌రాజ్‌లో అభిమానులతో రాహుల్ సెల్ఫీ

ప్రయాగ్‌రాజ్(యూపీ), మే 19: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఒకే ఒక్క స్థానంలో గెలుస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అలహాబాద్ లోక్‌సభ స్థానం ఇండియా కూటమి అభ్యర్థి, కాంగ్రెస్ నేత ఉజ్వల్ రమణ్ సింగ్‌కు మద్దతుగా ప్రయాగ్‌రాజ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీతోపాటు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'మీరు ఇది విన్నారా? నరేంద్రమోదీ బీజేపీ కోసం ఉత్తరప్రదేశ్‌లో క్యోటో(వారాణసీ) సీటును మాత్రమే గెలుస్తున్నారు' అని అన్నారు. వారాణసీని జపాన్‌లోని సుందర నగరం క్యోటోలా తీర్చిదిద్దుతానని ప్రధాని మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను రాహుల్ ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. కరోనా టీకాతో ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పెట్టిన బీజేపీ ఇప్పుడు రాజ్యాంగంపై దాడి చేస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ప్రయాగ్‌రాజ్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఫూల్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో తొక్కిసలాట జరిగింది. రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ ఇద్దరు ఈ సభకు హాజరవ్వగా ఇరుపార్టీల కార్యకర్తలు వేదిక దగ్గరకు వచ్చేందుకు యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. కార్యకర్తలు, అభిమానులు ప్రశాంతంగా ఉండాలని రాహుల్, అఖిలేష్ పలుమార్లు కోరినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో చేసేది లేక ప్రసంగం చేయకుండానే ఇరువురు నేతలు సభ నుంచి వెళ్లిపోయారు. తర్వాత ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని ముంగారీకి వెళ్లిన వారికి అక్కడ కూడా ఇదే అనుభవం ఎదురైంది.



వేలాది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారు!

» అరెస్టులతో ఆప్‌ను నాశనం చేయలేరు

» ప్రధాని మోదీకి కేజ్రీవాల్ హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 19: ఒక్క కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే భరతమాత వేలాది మంది కేజ్రీవాల్‌లకు జన్మనిస్తుందని ప్రధాని మోదీని ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హెచ్చరించారు. అరెస్టుల ద్వారా ఆప్‌ను నాశనం చేయలేరని, ఆప్ ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక ఆలోచనాధార అని చెప్పారు. ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో తన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో బీజేపీ ప్రధాన కార్యాలయం ముట్టడికి కేజ్రీవాల్ శనివారం పిలుపునిచ్చారు. పార్టీ కీలక నేతలను అరెస్టు చేసి జైలుకు పంపించటం ద్వారా ఆప్‌ను నాశనం చేయాలని మోదీ కుట్ర పన్నారని, అందుకే బీజేపీ హెడ్‌ఆఫీసుకు అందరమూ వస్తామని, తమలో ఎవరినైనా అరెస్టు చేసుకోవచ్చంటూ మోదీకి సవాల్ విసిరారు. ఈ మేరకు బీజేపీ ఆఫీసుకు ఆప్ నేతలు, కార్యకర్తలతో కలిసి కేజ్రీవాల్ ఆదివారం మధ్యాహ్నం తరలివెళ్లారు. వారిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఆప్ వేగంగా ఎదగటాన్ని చూసి మోదీ తట్టుకోలేకపోతున్నారని, పార్టీని నాశనం చేయటానికి 'ఆపరేషన్ ఝాడూ (చీపురు)'ను ప్రారంభించారన్నారు. దాంట్లో భాగంగానే తనతోపాటు పార్టీ ముఖ్య నేతలను జైలుకు పంపించారని, మరింత మంది ఆప్ నాయకులను అరెస్టు చేయనున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని తీవ్రమైన సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని ఎదుర్కోవటానికి ఆప్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తారని, పార్టీ ఆఫీసును కూడా లాక్కొని రోడ్డు మీదికి ఈడుస్తారని.. వాటన్నింటికీ సిద్ధంగా ఉండాలని ఆప్ శ్రేణులకు సూచించారు. నిరసన కార్యక్రమంలో ఆప్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఢిల్లీ మంత్రులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, స్వాతిమలివాల్‌పై దాడికి సంబంధించి బిభవ్‌కుమార్‌ను ఢిల్లీలోని స్థానిక కోర్టు ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు సీఎం నివాసంలోని సీసీటీవీ డిజిటల్ వీడియో రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నారు.



కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో పెందుర్తి ప్రాంత విద్యార్థులు

మేం భారత్‌కు తిరిగి వచ్చేస్తాం!

» కిర్గిస్థాన్‌లో చిక్కుకున్న విద్యార్థుల వేడుకోలు

» చాలా భయంగా ఉంది: నల్లగొండ విద్యార్థిని

పుణె/హైదరాబాద్, పెందుర్తి, మే 19: విదేశీ విద్యార్థులే లక్ష్యంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలతో భారతీయులు వణికిపోతున్నారు. హాస్టల్ గదులు వదిలి బయటకు రావడం లేదు. అక్కడి విద్యాసంస్థలు పరీక్షలను వాయిదా వేశాయి. చాలా మంది భారత్‌కు తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యారు. 'బిష్కెక్‌లోని యూనివర్సిటీ హాస్టల్ నుంచి నన్ను, మరికొంత మంది విద్యార్థులను 30 కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు వసతి గృహానికి తరలించారు' అని తెలంగాణలోని నల్లగొండకు చెందిన ఓ విద్యార్థిని ఫోన్‌లో తెలిపారు. యూనివర్సిటీలో కొంత భద్రత ఉన్నప్పటికీ బిష్కెక్‌లో విద్వేషాలు పెరిగిపోవడంతో తీవ్ర భయాందోళనకు గురైనట్లు చెప్పారు. ఏపీ, విశాఖపట్నంలోని పెందుర్తి ప్రాంతానికి చెందిన పది మంది వైద్య విద్యార్థులు కూడా బిష్కెక్‌లో ఇరుక్కుపోయారు. ఇక, శుక్రవారం రాత్రి తాను ఉంటున్న ప్రాంతానికి 2.5 కిలోమీటర్ల దూరంలో ఓ హాస్టల్‌పై స్థానికులు దాడి చేశారని మహారాష్ట్రలోని బీడ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి వెల్లడించారు. తమ హాస్టల్‌లో లైట్లు ఆపేసి 24 గంటలు పైగా అవుతోందని మరోవిద్యార్థి చెప్పారు. చాలా మంది అల్పాహారం చేసేందుకు క్యాంటీన్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

8 రాష్ట్రాలు.. 49 స్థానాలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ, అమేఠీ నుంచి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, రాజధాని లఖ్‌నవూ నుంచి మూడోసారి బరిలోకి దిగుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, శరణ్ (బిహార్)లో బీజేపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ, హాజీపూర్‌లో రాంవిలాస్ పాసవాన్ కుమారుడు చిరాగ్ పాసవాన్ వంటివారు ఈ దశలో పోటీపడుతున్న ప్రముఖుల జాబితాలో ఉన్నారు. ఈ 49 స్థానాల్లో ఎన్డీయే, ఇండియా కూటమికి మధ్య పోటీ హోరాహోరీ సాగుతుండడంతో ఐదో దశ బీజేపీకి కీలకంగా మారింది. ముఖ్యంగా మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 39 స్థానాలు బీజేపీకి అగ్నిపరీక్షగా మారాయి. కీలక నియోజకవర్గాల వారీగా చూస్తే.. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గత ఎన్నికల్లో పోటీ చేసిన రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి ఈసారి ఆమె తనయుడు రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. రాహుల్ గతంలో పోటీ చేసిన అమేఠీ నుంచి గాంధీ కుటుంబ విధేయుడు కేఎల్ శర్మ.. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఢీకొంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ-కాంగ్రెస్ కూటమి రాజకీయంగా బలం పుంజుకున్న రీత్యా ఈ రెండు నియోజకవర్గాల్లోనే కాక ఎన్నికలు జరుగుతున్న 14 నియోజకవర్గాల్లో హోరాహోరీ పోరు జరిగే అవకాశాలున్నాయి. ఇక, మహిళా అథ్లెట్‌లపై లైంగిక అత్యాచారాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత కుస్తీ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఈసారి కైసర్‌గంజ్ నుంచి బీజేపీ టికెట్ ఇవ్వకుండా ఆయన కుమారుడిని రంగంలోకి దించింది. అయోధ్య రామమందిరం కొలువై ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నేత లల్లూ సింగ్, ఎస్పీ నేత అవధేశ్ ప్రసాద్ మధ్య పోటీ బలంగా ఉన్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. లఖ్‌నవూలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎస్పీ నేత రవిదాస్ మెహ్రోత్రా మధ్య ప్రధానంగా పోటీ ఉంది.

రాష్ట్రం	స్థానాలు
ఝార్ఖండ్	3
ఒడిశా	5
ఉత్తరప్రదేశ్	14
బిహార్	5
మహారాష్ట్ర	13
పశ్చిమబెంగాల్	7
లద్దాఖ్	1
జమ్ముకశ్మీర్	1

మరాఠా గడ్డపై...

అయిదో దశలో బీజేపీకి అత్యంత కీలకమైన మహారాష్ట్రలో 14 స్థానాల్లో కమలనాథులకు ప్రతికూల పవనాలు వీస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోనే కనీసం ఏడు స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. రెండుగా చీలిపోయిన శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలలో ఎవరిది నిజమైన పార్టీగా ప్రజలు గుర్తిస్తారో ఈ ఎన్నికలలో తేలనుంది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సహా పలువురు బీజేపీ నేతలు ఈ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. కాగా, ఈ దశలో బిహార్‌లో 5 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య.. బీజేపీ దిగ్గజం రాజీవ్ ప్రతాప్ రూడీకి గట్టి పోటీ ఇస్తున్నారు. లోక్‌జనశక్తి నేత చిరాగ్ పాసవాన్ హాజీపూర్‌లో ఎన్డీయే తరఫున పోటీ చేస్తుండగా.. ఆయన ప్రత్యర్థిగా లాలూ కుడిభుజం శివ చంద్రరామ్ బరిలో ఉన్నారు. అలాగే.. జార్ఖండ్‌లో సోమవారం ఎన్నికలు జరగనున్న హజారీబాగ్, కొడెర్మా, చత్రా సీట్లను గత ఎన్నికల్లో బీజేపీ గెలుచుకుంది. హజారీబాగ్‌లో కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించినప్పటికీ ఈసారి బీజేపీ ఆయనకు టికెట్ కేటాయించలేదు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలు జరుగుతున్న గాండే అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ సీఎం హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ జేఎంఎం నుంచి పోటీ చేస్తుండగా ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ దిలీప్ వర్మ అనే స్థానికుడిని రంగంలోకి దింపింది.

తూర్పు తీరాన..

పశ్చిమబెంగాల్‌లో అత్యంత కీలకమైన హుగ్లీ, హౌరా, ఆరాంబాగ్, సేరంపూర్, బంగాన్‌లో తృణమూల్ కాంగ్రెస్- బీజేపీ మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. ఆ రాష్ట్రంలో 57.19 శాతం పైగా పోలింగ్ బూత్‌లను సున్నితమైనవిగా ఈసీ గుర్తించడంతో అక్కడ భారీగా కేంద్ర బలగాలను దించారు. ఇటు ఒడిసాలో ఐదో దశలో పోలింగ్ జరిగే 5 స్థానాలనూ బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఈ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న నేతల్లో 13 మంది కోట్లకు పడగెత్తినవారేనని ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది.ఇక జమ్ముకశ్మీర్‌లో బారాముల్లా నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ తరఫున మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా బరిలో ఉన్నారు.

సంపదలో రాజును మించిన సునాక్ దంపతులు!

» యూకే ప్రధాని దంపతుల ఆస్తులు రూ.6,867 కోట్లు



లండన్, మే 19: బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, సతీమణి అక్షతా మూర్తి సంపదలో ఆ దేశ రాజు చార్లెస్-3ను అధిగమించారు. బ్రిటన్‌లో నివసిస్తున్న తొలి వెయ్యి మంది సంపన్నులు/కుటుంబాల నికర సంపద ఆధారంగా సండే టైమ్స్ వార్తా పత్రిక ధనవంతుల జాబితాను తాజాగా విడుదల చేసింది. గతేడాది ఇందులో 275వ స్థానంలో నిలిచిన సునాక్ దంపతులు.. ఈసారి 245వ స్థానానికి ఎగబాకారు. ఇక కింగ్ చార్లెస్ మాత్రం తాజా జాబితాలో 258వ స్థానంలో నిలవడం గమనార్హం. 2023లో సునాక్ దంపతుల సంపద 529 మిలియన్ పౌండ్లు ఉండగా.. ఏడాదిలో 651 మిలియన్ పౌండ్ల (రూ.6,867 కోట్లు)కు పెరిగింది. అదే చార్లెస్-3 సంపద 600 మిలియన్ పౌండ్ల నుంచి 610 మిలియన్ పౌండ్ల (రూ.6,435 కోట్ల)కు మాత్రమే పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో బ్రిటన్‌లోని బిలియనీర్ల ఆస్తులు కరిగిపోతున్నాయి. అయితే తండ్రి నారాయణమూర్తి భారత కంపెనీ ఇన్ఫోసిస్‌లో అక్షతా మూర్తికి అధిక షేర్లు ఉన్న నేపథ్యంలోనే వారి సంపద గణనీయంగా పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇక సంపన్నుల జాబితాలో భారత్‌కు చెందిన హిందుజా గ్రూప్‌ను పర్యవేక్షిస్తున్న గోపి హిందుజా కుటుంబం 37.2 బిలియన్ పౌండ్లతో అగ్రస్థానంలో నిలిచింది.

దళిత విద్యార్థుల అడ్మిషన్లు 44% పెరిగాయి!

న్యూఢిల్లీ, మే 19: షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల అడ్మిషన్లు 2014 నుంచి 2022వ సంవత్సరం నాటికి 44 శాతం పెరిగాయని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్(ఎన్‌సీబీసీ) వెల్లడించింది. అదే సమయంలో దళిత బాలికల అడ్మిషన్లు 51 శాతం, మైనారిటీ బాలికల అడ్మిషన్లు 42.3 శాతం, గిరిజన విద్యార్థుల అడ్మిషన్లు 65.2 శాతం, గిరిజన బాలికల అడ్మిషన్లు 80 శాతం, ఓబీసీ విద్యార్థుల అడ్మిషన్లు 45 శాతం, ఓబీసీ బాలికల అడ్మిషన్లు 49.3 శాతం పెరిగాయని తెలిపింది. ఓబీసీల రాజ్యాంగపరమైన హక్కుల పరిరక్షణకు ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలియజేస్తూ ఎన్‌సీబీసీ ఛైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్ శనివారం విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించారు. 2014-15 సంవత్సరంలో 46.1 లక్షల మంది ఎస్సీ విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చేరగా, 2021-22 సంవత్సరంలో ఆ సంఖ్య 66.2 లక్షలకు చేరిందని తెలిపారు. అలాగే, 2014-15లో 10.7 లక్షల మంది మైనారిటీ బాలికలు వివిధ విద్యాసంస్థల్లో చేరగా, 2021-22లో ఆ సంఖ్య 15.2లక్షలకు పెరిగింది. 2014-15లో 16.41 లక్షలమంది ఎస్టీ విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చేరగా, 2021-22లో వారి సంఖ్య 27.1 లక్షలకు పెరిగింది. ఇక 2021-22లో 1.63 కోట్ల మంది ఓబీసీ విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చేరారు. 2020-21 విద్యా సంవత్సరంలో సెంట్రల్ స్కూళ్లలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల 34,133 మంది ఓబీసీ పిల్లలు అడ్మిషన్లు పొందగలిగారు. అదే ఏడాది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్‌ను నవోదయ స్కూళ్లలో అమలుచేయడం వల్ల మరో 19,710 మంది, సైనిక్ స్కూళ్లలో అమలు చేయడం వల్ల మరో 1,026 మంది ఓబీసీ పిల్లలకు మేలు జరిగిందని నివేదిక తెలిపింది. కాగా, ఉన్నత విద్యలో మహిళల అడ్మిషన్లు 32 శాతం పెరిగాయి.

లోకం తీరు



దక్షిణ అండమాన్‌కు ‘నైరుతి’

» 22న అల్పపీడనం.. తుఫాన్‌గా మారే చాన్స్!

» దక్షిణాదిలో భారీ వర్షాలు కురిసే అవకాశం

విశాఖపట్నం, అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతం, మాల్దీవులు, కొమరిన్ ఏరియాలో పలు ప్రాంతాలను ఆదివారం నైరుతి రుతుపవనాలు తాకాయి. సాధారణంగా మే 22న దక్షిణ అండమాన్ సముద్ర పరిసరాలను నైరుతి రుతుపవనాలు తాకాల్సి ఉండగా, ఈ ఏడాది మూడు రోజులు ముందుగానే తాకాయని భారత వాతావరణశాఖ(ఐఎండీ) ప్రకటించింది. హిందూ మహాసముద్రం మీదుగా బంగాళాఖాతం వైపు పడమర, నైరుతి గాలులు బలంగా వీయడం, భారీగా తేమ మేఘాలు ఆవరించడం, శనివారం నుంచి నికోబార్ దీవుల్లో వర్షాలు కురవడం వంటి అంశాలను పరిగణనలో తీసుకుని నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని ఐఎండీ నిర్ధారించింది. కాగా, ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి 24వ తేదీ కల్లా మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. 24వ తేదీ తర్వాత అది మరింత బలపడి తుఫాన్‌గా మారి ఒడిశా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. కాగా, తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం, మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈనెల 23వ తేదీ వరకు దక్షిణ భారతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఈనెల 20, 21 22 తేదీలు, దక్షిణ కర్ణాటకలో 21, 22 తేదీలు, లక్షద్వీప్‌లో 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 20, 21, 22 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహే ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, దక్షిణకర్ణాటక, ఏపీ, తెలంగాణ, యానాం, సబ్-హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో వచ్చే ఏడురోజులు ఉరుములు, మెరుపులు, పిడుగులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో నేడూ వర్షాలు!

ఎండ తీవ్రతపై 13 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు

» పిడుగుపాటుకు ముగ్గురి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారానికి సంబంధించి ఎటువంటి వాతావరణ హెచ్చరికలు జారీ చేయలేదు. ఈనెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. శనివారంతో పోలిస్తే ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు కొన్ని జిల్లాల్లో 2 డిగ్రీల మేరకు పెరిగాయి. జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో అత్యధికంగా 42.6, ఆదిలాబాద్ పట్టణం, భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమ, మంగళవారాల్లో ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉందంటూ 13 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.



కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో రోడ్డు నీట మునగడంతో డివైడర్ పై నుంచి వెళ్తున్న ప్రజలు

పొద్దంతా ఎండలు.. సాయంత్రానికి వానలు !

రాష్ట్రంలో భిన్న వాతావరణం నెలకొంది. గత మూడ్రోజులుగా పొద్దంతా ఎండలు.. సాయంత్రానికి వానలు కురుస్తున్నాయి. ఆదివారం హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. హైదరాబాద్‌లో సాయంత్రం 4 గంటల తర్వాత మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా వర్షం పడింది. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాలాపూర్, మేడ్చల్, హైటెక్‌సిటీ, బండ్లగూడ, కందికల్‌గేట్, శాస్త్రిపురం, శివరాంపల్లి, లంగర్‌హౌజ్, గోల్కొండ, ఎస్సార్‌నగర్, మైత్రివనం, ఉప్పల్, నాచారంలో వర్షాలు కురిశాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆ జిల్లాలోని బషీరాబాద్, తాండూరు, మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబ్‌పేటల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మెదక్ జిల్లా అందోల్‌లో 4.7 సెం.మీ, కౌడిపల్లిలో 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగాయి. కల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంతో పాటు చాలా గ్రామాల్లో వర్షం పడింది. ఇబ్రహీంపట్నం పరిధిలో మోస్తరు వర్షం పడింది. మరోవైపు, ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. జగిత్యాల జిల్లా అదే మండలంలోని గోపాలరావుపేట ఐకేపీ సెంటర్‌లో అంబటి సందీప్ అనే రైతు తన ధాన్యంపై డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేయగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. కేంద్రానికి ధాన్యం తెచ్చి 27 రోజులైనా కొనట్లేదని సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు ముగ్గురు రైతుల దుర్మరణం



ఎంకప్ప, శ్రీనివాస్, లక్ష్మప్ప (ఫైల్)

పిడుగుపాటుతో ముగ్గురు రైతులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ రెండు వేర్వేరు ఘటనలు వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో చోటుచేసుకున్నాయి. మండలంలోని జుంటుపల్లికి చెందిన రైతులు కానింటి లక్ష్మప్ప (49), మంగలి శ్రీనివాస్ (28)వి పక్కపక్క పొలాలే.. వరికోత యంత్రంతో కోతలు కోయిస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో డ్రైవర్‌తో పాటు ఇద్దరు రైతులు వరికోత యంత్రం కింద తలదాచుకున్నారు. ఇంతలో పిడుగుపడగా.. లక్ష్మప్ప, శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బెన్నూర్‌కు చెందిన గొల్ల ఎంకప్ప (60) భార్య ఎల్లమ్మతో కలిసి తమ పొలంలో ఎరువులు చల్లుతున్నారు. ఈ క్రమంలో పిడుగుపడగా.. ఎంకప్ప మృతి చెందగా, ఎల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లిలో ఎండీ ఖాదర్‌కు చెందిన జోడెద్దులు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి.

కన్నకూతురుని కడతేర్చిన తల్లిదండ్రులు

» మానసిక స్థితి బాగోలేని కుమార్తెను వదిలించుకోవాలని హత్య

» గ్రామస్థుల అనుమానంతో బయటికొచ్చిన నిజం

» నిందితుల అరెస్టు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఘటన

సిరిసిల్ల క్రైం, మే 19: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న కూతురు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తట్టుకోలేక కన్నవాళ్లే ఆమెను హత్య చేశారు. ఆ తప్పు బయటపడకుండా ఉండాలని తమ ఒక్కగానొక్క బిడ్డ అనారోగ్యంతో మరణించిందని కూతురి అత్తింటి వారిని నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కానీ, నిజం బయటకు రావడంతో కటకటాలపాలయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం వెల్లడించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతుల ఏకైక కుమార్తె ప్రియాంక(24) ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ప్రియాంకకు ఆస్పత్రిలో చికిత్స చేయించగా కొంతవరకు నయమైంది. దీంతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం దర్గపల్లికి చెందిన పృథ్వీతో ప్రియాంకకు 2020లో పెళ్లి చేశారు. ప్రియాంక దంపతులకు ఓ కుమారుడు(13 నెలలు) ఉన్నాడు. మానసిక సమస్యలు తిరగబెట్టడంతో ప్రియాంక నెల రోజులుగా కుటుంబసభ్యులందరినీ ఇబ్బంది పెడుతుంది. అంతేకాక, పసివాడని కూడా చూడకుండా కన్నకొడుకును కొట్టి కింద పడేస్తుండేది. పృథ్వీ ఈ విషయాన్ని అత్తమామల దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రియాంకను పుట్టింటికి తీసుకెళ్లారు. ప్రియాంకకు చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులు మళ్లీ కొంత ఖర్చుపెట్టగా అప్పులు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రియాంకను వదిలించుకోవాలని భావించిన తల్లిదండ్రులు ఈనెల 14న అర్ధరాత్రి తమ ఇంట్లోనే ఉరివేసి కూతురిని హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ప్రియాంక అత్తింటికి తరలించారు. ప్రియాంక మానసిక వ్యాధితో మరణించిందని ఆమె భర్త పృథ్విని నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేయించారు. అయితే, ప్రియాంక మరణంపై నేరెళ్ల గ్రామానికి చెందిన పలువురు అనుమానాలు వ్యక్తం చేయడంతో గ్రామ కార్యదర్శి ద్వారా ఫిర్యాదు స్వీకరించిన ఎస్పీ విచారణకు ఆదేశించారు. దీంతో ప్రియాంక తల్లిదండ్రులను విచారించగా అసలు విషయం బయటపెడింది. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చేవెళ్ల, మే 19: అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ దుర్ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పలుగుట్టలో ఆదివారం జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్లగూర మహేందర్‌రెడ్డి(42) మూడు ఎకరాల్లో పూలు, కూరగాయ పంటలు సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. పంటల దిగుబడి తగ్గడం, పూలకు రేట్లు లేకపోవడంతో ఆదాయం పడిపోయింది. దాంతో అప్పులెలా తీర్చాలని మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. సాయంత్రం పొలం నుంచి వచ్చిన భార్య ఇంట్లో లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా మహేందర్ దూలానికి వేలాడుతూ కనిపించాడు.

నకిలీ ఇంటర్వ్యూలు, నియామక పత్రాలు

» రైల్వే, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట భారీ మోసం

» లక్షలు వసూలు చేసి ఉడాయిస్తున్న మోసగాళ్లు

» రైల్ నిలయం వేదికగా కార్యకలాపాలు

» సహకరిస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే ముఠాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్ల వలలో చిక్కుకుని పలువురు నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైల్ నిలయంలో పని చేస్తున్న కొంత మంది కిందిస్థాయి సిబ్బంది, అధికారులు ఈ మోసగాళ్లతో కుమ్మక్కైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మోసాలను అడ్డుకునే యంత్రాంగం లేకపోవడంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాట్సాప్ గ్రూపులు, వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల ఫోన్ నెంబర్లు సేకరించి మోసగాళ్లు వల విసరుతున్నారు. రైల్వేతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు విభాగాల్లో ఖాళీలను, బ్యాక్‌లాగ్‌లను భర్తీ చేస్తున్నారని మభ్యపెడుతున్నారు. ఆయా సంస్థల పేరిట నకిలీ లేఖలు సృష్టించి ఇంటర్వ్యూలు నిర్వహించి, హాజరైనవారికి నకిలీ నియామక పత్రాలు కూడా అందించటం విశేషం. రూ.10-15 లక్షల వరకు వసూలు చేసుకొని ఉడాయిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు సంబంధించిన నిరుద్యోగులను కూడా వీరు మోసగించినట్లు తెలుస్తోంది. రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన ముఠా సభ్యులు హైదరాబాద్ కందికల్ భట్‌జీ నగర్ ప్రాంతంలోని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.12 లక్షలకు బేరం కుదర్చుకున్నారు. అయితే, రైల్వేలో టీటీఈ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని ఆ అభ్యర్థి తెలుసుకొని వారిని నిలదీయటంతో, వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. రైల్వేలో లేదు కానీ, కావాలంటే తమిళనాడు రాష్ట్ర ఏజీ (అకౌంటెంట్ జనరల్) కార్యాలయంలో ఎల్‌డీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ముఠా సభ్యుడు అనిల్‌కుమార్ ఓ ఫేక్ లెటర్‌తో చెన్నైలో సదరు నిరుద్యోగికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాడు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉంచి ‘నియామకపత్రాన్ని’ కూడా అందించాడు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకున్నాడు. రెండు వారాల వ్యవధిలో ఉద్యోగంలో చేరడానికి మళ్లీ సమాచారం ఇస్తామని చెప్పి పంపించారు. కానీ, నెల గడిచినా సమాచారం లేకపోవడంతో బాధితుడు.. తమిళనాడు ఏజీ కార్యాలయానికి వెళ్లి చూపగా అది నకిలీదని తేలింది. అనిల్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఈ ఒక్క వ్యక్తికే పరిమితం కాలేదని, ఆదాయపన్ను శాఖలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్స్, రైల్వేలో క్లర్క్, టీటీఈ తదితర ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఈ ముఠా భారీ మొత్తంలో వసూలు చేసినట్టు సమాచారం.

ఆస్తి కోసం తాతను చంపిన మనవళ్లు

» హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో ఘటన

» పోలీసుల అదుపులో కోడలు, మనవళ్లు?

హసన్‌పర్తి, మే 19: ఆస్తి తగాదాల విషయంలో మనవళ్ల చేతిలో ఓ వృద్ధుడు హత్యకు గురైన సంఘటన ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన జల్లి సారయ్య (80) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు జల్లి రమేశ్, జల్లి అశోక్, ఒక కూతురు తిరుమల ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు అశోక్ చిన్నతనంలోనే చనిపోగా, పెద్ద కుమారుడు రమేశ్ వివాహమైన తర్వాత చనిపోయాడు. రమేశ్‌కు భార్య రమాదేవి, ముగ్గురు కుమారులు రాకేశ్, సాయికృష్ణ, శశికుమార్‌లున్నారు. రాకేశ్ వాళ్ల అమ్మమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. సాయికృష్ణ, శశికుమార్‌లు సారయ్య ఇంటి వద్దనే ఉంటూ చదువుకుంటున్నారు. అయితే తన ఆస్తిలో మనవళ్లతో పాటు తన కూతురికి కూడా వాటా ఇవ్వాలని సారయ్య నిర్ణయించాడు. ఈ విషయంలో తరుచూ గొడవలు జరుగుతుండేవి. తమకు పూర్తి ఆస్తి ఇవ్వడానికి అంగీకరించడంలేదని కోడలు రమాదేవి, మనువళ్లు సాయికృష్ణ, శశికుమార్ సారయ్యపై పగ పెంచుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సారయ్య ముఖం కడుక్కుంటుండగా వాకింగ్ స్టాండ్‌తో వారు ఆయన తలపై బలంగా కొట్టారు. తీవ్ర గాయమడంతో సారయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. దాంతో నిందితులు అక్కడి నుంచి వెంటనే పరారయ్యారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. సారయ్య కూతురు తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులు రమాదేవి, సాయికృష్ణ, శశికుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

దాసరి శిరీష జ్ఞాపికకు రచనల ఆహ్వానం

దాసరి శిరీష జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు ఎంపిక చేసిన ఒక రచనను ముద్రించి ఆ పుస్తకాలను ప్రతి ఏటా సెప్టెంబర్ 3న రచయితకు అందిస్తున్నారు. ఇందుకు మీ కథ/ కవిత్వం/ నవల/ జీవిత చరిత్ర/ ఆత్మ కథ సారాంశాన్ని జూన్ 5లోగా ఒక ఏ4 పేజీని మించకుండా dasarisireeshagnaapika2024@gmail.comకు పంపాలి. సినాప్సిస్ యూనికోడ్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో మాత్రమే ఉండాలి. ఏ ప్రక్రియకు చెందిన రచన అయినా 200 పేజీలు మించకుండా ఉండాలి. స్వీయ పరిచయంతో పాటు ఫోన్ నంబర్, చిరునామా కూడా మెయిల్ చేయాలి. కొత్త తరం రచయితలకు ప్రాధాన్యం ఉంటుంది.

అపర్ణ తోట

కాష్ఠం రగులుకుంది



నీటిలో సూర్యబింబాన్ని చూసినట్లు
రొట్టెలపై
అమ్మను చూసుకున్నాడు పసిపిల్లాడు

నీటిలో చంద్రబింబాన్ని చూసినట్లు
రొట్టెలపై
ప్రియురాలి మోమును చూసుకున్నాడొక ప్రియుడు

ఆ రెండు హృదయాలు
దొగ్గాడుతూ రొట్టెను అందుకునేలోపే
కాష్ఠం రగులుకుంది

ఇక అమ్మ లేదు, ప్రియురాలు లేదు,
రొట్టెలు రొట్టెల్లా లేవు. అంతా బూడిదే.

దుఃఖంతో, ఆకలి కేకలతో,
గాజా గుండెలు రగులుతుంటే
ఆ పసిహృదయాల పేగులు మండుతుంటే
సూర్యగోళం సైతం చిన్నబోయింది!
పేగులు పటపటమనే శబ్దానికి
ఉరుముల సత్తువ సన్నబోయింది!

దొంతం చరణ్
90002 15466

కథా సదస్సుకు ఆహ్వానం

తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, కాకినాడ, ఆంధ్ర ప్రదేశ్, జూన్ 9న నిర్వహించే ఒకరోజు కథా సదస్సులో పాల్గొనడానికి వర్తమాన తెలుగు కథకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. రిజిస్ట్రేషన్ వివరాల కోసం జి.వి.కె. వర్మ- 9866145951 నంబర్‌లో సంప్రదించాలి. అభ్యర్థులు మే 25 లోపల పది పేజీలకు వి ుంచని కొత్త, అముద్రిత కథ పిడిఎఫ్‌ను అద్దేపల్లి ప్రభు వాట్సాప్ నంబర్ 98489 30203కి, ఓపెన్ ఫైల్‌ను prabhukkd@gmail.comకు పంపాలి. సదస్సులో తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి, వాసిరెడ్డి నవీన్, అట్టాడ అప్పల నాయుడు, ఆలూరి విజయ లక్ష్మి, మహమ్మద్ ఖదీర్ బాబు, పెద్దింటి అశోక్ కుమార్, దాట్ల దేవదానం రాజు, శిఖామణి, వేంపల్లి షరీఫ్, జాన్సన్ చోరగుడి, జి. వెంకట కృష్ణల ప్రసంగాలు ఉంటాయి.

దాట్ల దేవదానం రాజు

లక్షల కాపీల కవితా సమాహారం

పాఠశాలలు కళాశాలల్లో చదివే విద్యార్థులను సాహిత్యం వైపు ఆహ్వానించేందుకు, మరో గ్రంథాలయ ఉద్యమ మహా ప్రయత్నం దిశగా విద్యార్థుల కోసం ఇప్పటివరకు ప్రముఖ కవులు రాసిన వచన కవితలను సూచించండి. మీరు రాసిన అచ్చయిన కవితలను పంపించండి. కవితలను student spoetr ybook2024@ gmail.comకు ఈమెయిల్ చేయండి. వివరాలకు: 9440995010.

పలమనేరు బాలాజీ

కొందరలాగే వెళ్ళిపోతారు



1
కొందరలాగే వెళ్ళిపోతారు
మనకిష్టమున్నా లేకున్నా
మనకేం కానట్టే వెళ్ళిపోతారు
మనలో రాత్రీపగళ్ళై పోతారు

వెళుతూ మనల్నీ వెంటబెట్టుకెళతారు
కన్నీటి ఎరుపు కమ్మిన లోగిళ్ళలోకి
గుప్పెడు మిణుగురుల్ని తోడిచ్చి
వెనక్కి పంపించేస్తారు
మిగుళ్ళమిగుళ్ళగా మనని చిందరచేసేస్తారు

2
కొందరలాగే వెళ్ళిపోతారు
ఉన్నక్షణానే లేకుండాపోయి
ఊపిరినీడను పరిచయం చేస్తారు
మళ్లెందుకో మనలోకి కాస్త కాస్తగా నడిచొస్తారు
గడ్డం కింద చేయాన్చి మనల్నే చూస్తుంటారు

కొన్ని వానల్ని, కొన్ని ఎండల్ని,
మధ్యమధ్యలో కొన్ని సంపెంగమొగ్గల్ని
వెంటేసుకుని మనతో తిరుగుతూనే ఉంటారు
కొన్ని ప్రశ్నలుగా, కొన్ని క్షమాపణలుగా,
కొన్ని పశ్చాత్తాపాలుగా
మనని మనముందే నిలేసిపోతారు

3
కొందరలాగే వెళ్ళిపోతారు
మనని మనకు కొంత అరువిచ్చిపోతారు
నలిగిపోయిన మెత్తనినవ్వులా ముడతలుపడి
నింగి నలుపునంతా దించిపోతారు
నడివేసవి మిట్టమధ్యాన్నం అడవి ఆవులింతలా
ఉడుకుడుకు నిశ్శబ్దమై పెనవేసుకుపోతారు

తిప్పేసిన పేజీల్లోంచి తిరగదోడుకున్న పాటలపంక్తులై
రాగాలు దొరకని స్వరాల్లా జాలిచూపులు చూస్తుంటారు
ఒక్కోసారి- ఇంద్రధనుస్సు కూడా ఎరుగని
సిత్రచిత్రవర్ణాల్ని పోగేసుకొచ్చి
మనం పట్టనంతటి ముఖచిత్రమైపోతుంటారు

4
కొందరలాగే వెళ్లిపోతారు
చివరికలను ఎవరు చేదేసుకున్నారో
చివరినిద్రనెవరు కప్పేశారో
పొదుగు కట్టిన పొత్తిళ్లలోంచి
ఆఖరి నిశ్వాసను గాలికెవరు రాసిచ్చేశారో
చెప్పేవారెవరూ ఉండరు

కానీ, ఏ దీపస్తంభాలకోనలో
ఏ చివరికుటీరం కౌగిళ్ళు విప్పుకుంటుందో మరి
వాళ్లు ఒక్కో ఆకాశాన్ని గెలుచుకుంటూపోతుంటారు
ఆ గుప్పెడు చెలమల్ని దాటించే దొప్పల కోసం
మనం చెట్టాపుట్టాపట్టి, మెరుపులుడిగిన జ్ఞాపకాల్ని
జీవహరితం మీంచి ఒలుచుకుంటూ పోతుంటాం

5
కొందరలాగే వెళ్ళిపోతుంటారు
ఎంతకీ ఎత్తి అవతలకు పారబోయలేని
నదిలా మనలో నిండిపోతుంటారు
ఉండుండి పంటకాలువలై సన్నగా పారుతూ
మనకాలాలకిన్ని వరికంకుల్ని కట్టిపోతుంటారు

పోతూ పోతూ వెనక్కి చూసి-
ఎంతెంత కేరింతల్లో పండినా
మనమెంత పేదలమో
ఎన్ని యుద్ధాల్ని దాటుకుంటూ ప్రవహిస్తున్నా
ఎంతటి పరాజితులమో
చెప్పే ఓ నవ్వు రువ్విపోతారు


6
కొందరలాగే వెళ్ళిపోతారు
వాళ్ళు మనమేనాడు చేతుల్లోకి తీసుకోని పుస్తకాలైనా
కొత్త ఇతిహాసాల్లో ఇమడ్చడానికి
పంచభూతాలు పల్లకీ ఎక్కించుకెళుతుంటే
మహావాక్యాల్లా, మనం పోగొట్టుకున్న
మహానిర్వచనాల్లా రాజసాలు పోతుంటారు

ఉన్నట్టుండి తెగిపోయిన సముద్రాలకు
కెరటాలను కుట్టుకుంటూ మనం..
వాళ్ళకోసం చివరిసారి పట్టినట్టే
నిత్యప్రవాహాల్ని కాచుకోవడానికి
భుజాలు పదును పెట్టుకుంటుంటాం

7
కొందరలాగే వెళ్ళిపోతారు
మన వెన్ను చుట్టూ వాడిపోయిన
మరువపుదండల్లా మిగిలిపోతారు
... ...
వాళ్ళూ జీవితాన్ని ఇష్టపడ్డవాళ్లే కనుక
తమ నీడలన్నిటినీ శుభ్రంగా చిమ్మేసి
మన వాకిళ్ళను మనకిచ్చేసిపోతారు

యార్లగడ్డ రాఘవేంద్ర రావు
77309 21820

వాక్యంతో భయాన్ని వేటాడిన హెమింగ్వే



హెమింగ్వే అమెరికన్ వాక్యానికి రూపురేఖలు మార్చేసాడు అంటారు. అర ఠావు పొడవున, మెలికలతో, విశేషణాలతో, అడుగడుక్కీ విరామచిహ్నాలతో వస్తూ ఉండిన పూర్వ వాక్యాన్ని తిరోగామిని చేసాడు, నాలుగైదు సరాసరి మాటల వాక్యాలు వ్రాసి. ఆ నేర్పుకు కారణం అతను వార్తాపత్రిక రిపోర్టర్‌గా పని చేసిన అనుభవం అన్నారు. నయం, టెలిగ్రాఫ్ ఆఫీస్‌లో చేశాడు అనలేదు. వాక్యం సరే, ఇతని కథలు కూడా మొదట చూడటానికి చాలా సరళంగా అమాయకంగా కనపడుతాయి, ప్రతీకలు అలంకారాలు నిగూఢార్థాలతో కథను పొడుపు కథ చేయడు గనక.

మరి, ఇతని అరమాటలు, పొట్టి వాక్యాలు, పొడి పొడి సంభాషణల శైలికి కారణం, ప్రయోజనం ఏమి అయి ఉంటాయి! హెమింగ్వే కథల విషయాలను చూసేటప్పుడే ఈ సందేహానికి కూడా సమాధానం కనపడుతుంది.

ఈ రచయితకు నోబెల్ బహుమతి 'ఓల్డ్ మాన్ అండ్ ది సీ' అనే నవలకు వచ్చింది. కానీ ఈయన అలవోకగా వ్రాసిన చిన్న కథలతో పాఠక లోకానికి దక్కిన సాహిత్యానందం, అందుకు అతనికి వచ్చిన విశేషమైన పేరు ముందు నోబెల్ బహుమతి చిన్నది.

హెమింగ్వే కథలకు వస్తువులు తిప్పి తిప్పి కొట్టినా రెండంటే రెండే: 'వేట', 'యుద్ధం'. అదనంగా అతనికి అంటగట్టిన వస్తువులు 'సాహసం', 'పురుషాహంకారం'. కానీ అతని సబ్జెక్టు సాహసం కాదు, స్త్రీ నిర్లక్ష్యమూ కాదు. వేట, యుద్ధం, స్త్రీ నమ్మకద్రోహం వలె తెరమీద కనిపించే ఈయన కథావస్తువు వెనక ఉన్నది- తన రకరకాల భయమే, అదే హెమింగ్వే రచనలకు ప్రేరణ.

అతని మొదటి భయం చావు గురించి, రెండవ భయం తన భయం గురించి. రెండవది చాలా పెద్దది. నిజానికి ఈ రెండింటిని కూడా ఒక భయంగా కుదించవచ్చు, పొదుపరి హెమింగ్వేకు అది నచ్చుతుంది కూడా, వాక్య శిల్పం దృష్ట్యా. తన చావు భయాన్ని తను చంపకముందే అదే తనను చంపేస్తుందేమో అనే భయం హెమింగ్వేది! అతని కథా వస్తువు, అతని జీవన్మరణ సమస్య కూడా అదే.

పలురకాల కారణాలుంటాయి రచయితలకు వ్రాయడానికి. రచన 'నిర్మలీకరణ' సాధనం అన్నాడు జాపనీస్ రచయిత నవోయ షిగా. హెమింగ్వేకు రచన ఒక రణం. ఊహ తెలిసినప్పటినుంచీ తనను ప్రత్యర్థిలా వెంటాడుతున్న 'భయం'తో సలిపిన పోరే అతని కథారచన. ఆ యుద్ధ స్వరూపాన్ని పుస్తకాలలో ఎలా చూపించాడు?

ఉన్నదున్నట్లు సమస్యను మాట్లాడేవారు వేదాంతులు. కథలను మెటఫారికల్‌గా రాసి వేదాంతాన్నో, ఆధ్యాత్మికతనో, నీతి వర్తననో, ప్రకృతి ఆరాధననో బోధించే పని హెమింగ్వే అంతస్తు ఉన్న కథకుడు చేయడు. హెమింగ్వే కథల విలక్షణత వాటి వస్తువులో కంటే అవి పాఠకుడికి చివరకు ఏ స్థితి స్వరూపాలతో అందుతున్నాయి అనేదాంట్లో ఉంది. వాస్తవంగా కథలో చెప్పదలుచుకున్న సమస్యను కాస్త ఓరగా జరిపి, ఆ సమస్య వలన చుట్టూ పాకే ప్రకంపనలు పర్యవసానాల లోంచి ఒక మేలైన శకలాన్ని ఎంచుకుని కథా విషయం చేయడం ఇతని లక్షణం. పదాలలో అక్షరాల పొదుపు, వాక్యాల నిడివిలో క్లుప్తత, కథను ఏక వాక్య సంభాషణల ద్వారా నడిపించడం అనే శైలి వెనక తనను మొత్తం కాగితం మీదకు ఒంపేసుకోవడానికి, అక్షరాలకు మొత్తం లొంగిపోవడానికి ఒప్పుకోని హెమింగ్వే పంతం ఉన్నది. కాబట్టే అతని వస్తువు, శిల్పం విడదీయలేని విధంగా కలిసి పుట్టిన కవలలు.

హెమింగ్వే కథలు 'Découpage', 'Kirigami' ఆర్ట్ లాంటివి. అటువంటి కథ కాగితం మీదకు తేవాలంటే రచయిత తన కలంతో కంటే కత్తెరతో ఎక్కువ పనిచేస్తాడు. క్లుప్తత ఉన్న కలం ఇతని ఒక పనిముట్టు అయితే, శస్త్రవైద్యుడి కత్తి వంటి కత్తెర రెండో ముఖ్య ఆయుధం. రచనను ముగించిన తర్వాత హెమింగ్వే ఒక శస్త్రవైద్యుడి అవతారం ఎత్తేవాడు. చిన్నచిన్నగా పరిష్కరించడంతో మొదలుపెట్టి, నిర్దాక్షిణ్యంగా కత్తిరించేస్తూ చివరకు పెద్ద పెద్ద కథా భాగాలనే పరిగ్రహిస్తూ, రచన ద్వారా సూచనప్రాయంగా చెప్పదల్చుకున్న అంశం మటుకే కాగితం మీద మిగిలిందాకా తక్కినదంతా తొలగిస్తూ పోయేవాడట. ఒకసారి కాదు పలుసార్లు ఈ ఆపరేషన్ జరిగేది పాపం ఆ కథకు. కానీ విుగిలిన కథ ఆరోగ్యానికి ఆ కత్తిరింపులూ తొలగింపులూ అవసరం. చాలా కథను ఆ విధంగా కత్తిరించడం మిగిలిన కథకు అదనపు మహత్వాన్ని నింపడం కోసమే. ఇది హెమింగ్వే మౌలిక రచనా వ్యాసంగ రీతి.

ఇక అతని కథాంశాల విషయానికి మళ్ళీ వస్తే లోకాభిప్రాయం ప్రకారం అవి- వేట, యుద్ధం, స్త్రీ చేసే నమ్మకద్రోహం అనుకుంటారు. నిజానికి అవి కాదు విషయాలు. అతనికి మూడు రకాల భయాలు అనుకున్నాం కదా. వాటికి సాక్ష్యం ఆత్మకథాత్మకాలైన హెమింగ్వే కథల్లో యెక్కడ ప్రముఖంగా కనపడుతున్నదో చూద్దాం.

'ఇండియన్ కాంప్' (1924) అనే కథలో నిక్, బహుశా ఆరేడేళ్ళ పిల్లవాడు. వాడి నాన్న డాక్టర్. ఆయన వృత్తిరీత్యా ఒక ట్రైబల్ వాళ్ళ గుడిసెకు వెళ్తుంటే నిక్ కూడా వెంట వెళ్తాడు. అక్కడ ఒకటే క్షణంలో ఒక స్త్రీకి పిల్లవాడు పుట్టడం, అదే గదిలో ఆ స్త్రీ భర్త అయిదు నిమిషాల క్రితం కత్తితో గొంతుకోసుకుని చచ్చిపడి ఉండటం చూస్తాడు. తిరిగి వచ్చేప్పుడు తండ్రీ కొడుకుల మధ్య సంభాషణ:

"నాన్నా, మగవాళ్ళు ఆత్మహత్య చేసుకుంటారా?"

"ప్రతి ఒకరూ కాదు"

"ఆడవాళ్ళు?"

"ఉహూ, చేసుకోరు."

కాసేపు ఆగాక,

"చచ్చిపోవడం చాలా కష్టమా నాన్నా?"

"కాదనుకుంట నిక్, చాలా సులభం. అయినా ఎప్పుడూ ఒకేలా ఉండదు."

చావుని గురించి ఆలోచన వదల్లేదు ఎప్పుడూ హెమింగ్వేని. మరీ చిన్నప్పుడు చర్చ్‌లో విన్న "ఎప్పుడైనా ఈ తాడు తెగిపోవచ్చు" అనే ప్రార్థనాగీతంలో మాటలతో చటుక్కున చావు గురించి మొదటిసారి ఎఱుక. త్వరగానే అది భయంగా మారింది. "ఆర్మీ సర్వీసెస్‌కు వెళ్ళిన కొత్తల్లో 'మనం చావం, అది వేరేవాళ్ళకు' అనే అనుకుంటాం మనకు మొదటి గాయం అయిందాకా. తర్వాత ఇంక మన వంతు ఎప్పుడో అని భయపడుతూ ఎదురు చూడటమే మన వంతు" అంటాడు. కానీ, "నేను ఎప్పటికీ చచ్చిపోను" అని చాలా దృఢంగా అనుకుంటునే ఉన్నాడు జీవితమంతా, చివరకు తుపాకి నోట్లో పేల్చుకుని చచ్చిపోయిందాకా.

చావు భయం, తన స్త్రీ తనను వదిలేస్తుందేమో అనే భయం; ఈ రెండూ మానవుడి ఆదిమ భయాలు. వాటి అంతు చూద్దామని చేసినవే హెమింగ్వే వేటలు.

'ది షార్ట్ హాపీ లైఫ్ ఆఫ్ ఫ్రాన్సిస్ మకూంబ్బర్' అనే కథలో మొదటిరోజు వేటలో పులిని చూసి భయపడినవాడు

> **పదాలలో అక్షరాల పొదుపు, వాక్యాల నిడివిలో క్లుప్తత, కథను ఏక వాక్య సంభాషణల ద్వారా నడిపించడం అనే శైలి వెనక తనను మొత్తం కాగితం మీదకు ఒంపేసుకోవడానికి, అక్షరాలకు మొత్తం లొంగిపోవడానికి ఒప్పుకోని హెమింగ్వే పంతం ఉన్నది. కాబట్టే అతని వస్తువు, శిల్పం విడదీయలేని విధంగా కలిసి పుట్టిన కవలలు.**

మరుసటి రోజు భయంకరమైన అడవి దున్నపోతుని నేరుగా కళ్ళల్లోకి చూస్తూ దాని భుజాలను చీలుస్తూ తుపాకీ పేల్చాకనే అతడి పూర్వభయాలు అన్నీ పోయాయి. అడవి జంతువు భయం; భార్య దగ్గర పరువు పోతుందని, ఆమె తనను వదిలేసిపోతుందనే భయం కూడా. స్త్రీలతో హెమింగ్వేకు చేదు అనుభవాలు ఉన్నాయి, వాళ్ళు తనని వదిలేయబోతున్నారని తెలియగానే తనే వదిలేసేవాడు వారిని.

స్త్రీ లేకపోతే ఒంటరితనపు భయం, స్త్రీ వచ్చాకా ఆమె పోతుందనో, కూడా ఉంటే తనను అణిచేస్తుందనో భయం... ఇవి మగవాడికి తప్పవు. ఆ భయాల నుంచి వచ్చే పురుష వికారాలే- భార్య సమర్థురాలైతే ద్వేషం ('స్నోస్ ఆఫ్ కిలిమంజారో' అన్న కథలో రాచరికపు జీవితం ఇచ్చిన భార్య అంటే కోపం; తనను తనుగా మిగల్చలేదని, సోమరిని చేసి తన రచనాశక్తిని చంపేసిందని), ఒకవేళ మూర్ఖురాలైతే నిర్లక్ష్యం.

హెమింగ్వే స్త్రీ ప్రస్తావనతో కథలు ఎక్కువ రాయలేదు నిజానికి.

'ఎ క్లీన్ వెల్ లైటెడ్ ప్లేస్' అన్న కథ ఒంటరి ముసలి వాడి కథ. అందులో ఎక్కడా స్త్రీ ప్రస్తావన లేదు. కానీ, లేని స్త్రీ వదిలేసిన ఖాళీ చీకటితనాన్ని ఎలా ఈదాలో తెలీక ఆ వృద్ధుడు రోజూ ఎలక్ట్రిక్ దీపాల వెలుతురులో కాస్త శుభ్రంగా ఉన్న రెస్టారెంట్‌కు వచ్చి కూచుని రాత్రి పన్నెండు దాటినా ఇంటికి పోడు.

"ఈ ముసలోడు ఎంతకూ పోడు, హోటల్ కట్టేద్దామంటే"

"ఇక్కడ ఉండే వెలుతురు, శుభ్రత కోసం వస్తాడు, ఇంకొంతసేపు కూచోని వెళ్తాడులే"

"నా పెళ్ళాం నా కోసం ఎదురు చూస్తుంటుంది, వీడికేం?"

- ఇలా విసుక్కుంటున్న పడుచు వెయిటర్‌కు అర్థం కాని బాధ అతనితో మాట్లాడుతున్న ముసలి వెయిటర్‌కు తెలుసు: శూన్యమైన ఇంట్లో ఒంటరిగా ఉండటం ఎంతో కష్టం.

తాగుతున్న ముసలాడు పోయిన వారం ఆత్మహత్య చేసుకోబోయాడు.

"కారణం?" - ముసలి వెయిటర్.

"ఏమీ లేదు!" - పడుచు వెయిటర్.

ఇలాంటి అతి మామూలు మాటల సంభాషణలు పెట్టి కథ నడిపిస్తాడు హెమింగ్వే. కానీ ఈ మామూలు మాటల్ని సామాన్యంగా అందరూ మాట్లాడే అర్థంలో ఉపయోగించాడా? ఇక్కడ పెళ్ళాం ఉన్న పడుచు వెయిటర్ అన్న "Nothing" అనే మాటకు ప్రస్తుతం ఆ సందర్భంలో అర్థం- "అతనికి ఆత్మహత్య చేసుకునేంత సమస్య ఏమీ లేదు, చాలా డబ్బులున్నవాడు, ఏం మాయరోగం!" అని. కానీ అంతేనా! ఆ మాట ఇవ్వగల మరో అర్థం ముసలి వెయిటర్‌కు తెలుసు- "ఏ అర్థమూ ఈ జీవితానికి లేదు" అని.

- అవును, ఏమీ లేదు. ఏమీ అర్థం లేదు మన ఈ ఏమీలేనితనానికి. శూన్యం నుంచి వచ్చాం. శూన్యమే మన చిరునామా. శూన్యానికే చివరకు చెందుతాం - ముసలి వెయిటర్ స్వగతం.

వృద్ధాప్యం వచ్చే కొద్దీ ఆ సంగతి మరీ తెలియవస్తుంది.

మనిషికి మరో విచారం- ఏ విధంగా జీవించినా ఈ జీవితానికి చివరకు ఏమైనా సార్థకత ఉంటుందా! మన అస్తిత్వానికి సార్థకత సరే, అర్థం ఉందా!

హెమింగ్వే అన్ని థీమ్స్ స్పృశించాడు అనవచ్చా? వేట, యుద్ధం, యుద్ధానంతర నిస్పృహ, నిర్వేదం, తనను తిరిగి కూడదీసుకునేందుకు అడవిలో ఒంటరి జీవితం, ప్రేమ, స్త్రీ, వివాహాలు, వియోగాలు, నాటి నేటి ప్రపంచం పోకడ, మనిషి ఆంతర్యం, అంతశ్శేతనం, వృద్ధాప్యం, అశక్తత, మనిషి జీవితానికి అర్థరాహిత్యం, అస్తిత్వ వేదన... చివరకు 'ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ'లో అతను పూర్తి క్రైస్తవ ఆస్తికత వైపు జరిగాడు, ఆ ప్రతీకలు బాహాటంగా చూపించాడు అని కొందరు అన్నారు. దాంతో మానవ జీవితంలో దశలవారీగా అన్ని మైలురాళ్ళనూ పేపర్ మీదకు ఎక్కించినట్లే అనవచ్చా!

'ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ'లో చేపలు పట్టే ముసలాయనకు చిక్కినట్లే చిక్కి- అతన్ని నడి సముద్రంలోకి ఈడ్చుకుపోయిన, ఆయనతో పంతంగా చివరి వరకూ పోరాడిన మార్లిన్ అనే పెద్ద సొరచేప మరేదో కాదు. అది ముసలాయన విధి. నీవా నేనా అన్నట్టు సాగిన ఆ యుద్ధంలో ముసలాయనే గెలిచాడు. కానీ చివరకు తన విధిని చూసి తనే జాలిపడ్డాడు, స్నేహితుడిగా ప్రేమించాడు, తనతో సారూప్యం చూసుకున్నాడు దానిలో.

ఎవడి విధి వాడు జాలి పడదగినది అతని దృష్టిలో. ఎవడి విధి వాడే మోసుకోవలసిన శిలువ. అదే అతను భుజాలు అరచేతులు కోసుకుపోయేలా మూడు రోజులు వీపు మీద మోసుకు ఈదినది. చివరకు దాని తల, కేవలం అస్థిపంజరం మాత్రమే తెచ్చుకోగలిగాడు వెనక్కు, కానీ ప్రశాంతంగా నిద్రపోయాడు ఆ గెలుపు తర్వాత. ప్రాణాలకు ఒడ్డి తనను భయపెడుతున్న శత్రువులతో పోరు చేయడం హెమింగ్వే జీవిత తత్వం. "the world is a fine place and worth fighting for and I hate very much to leave it".

That's his quintessential philosophy.

సాహిత్య తత్వం కూడా.

"రాయడానికి పుట్టాను, చాలా బాగా వ్రాయాలి" అనుకునే దిగాడు, రాశాడు, బహు గొప్పగా!

వేటలో వ్రాతలో కూడా సాహసి హెమింగ్వే.

కథను కూడా చివరకు అతని కథలో 'మార్లిన్' చేప లాగానే అస్థిపంజరం మాత్రం అట్టిపెట్టి మిగతాదంతా తీసిపడేసి ఇస్తాడు పాఠకులకు. ఆ బెస్త పల్లెలో మనుషుల్లాగే మనం కూడా ఆ ఎముకల ఆకృతి చూసి అసలు కథ స్వరూపాన్ని అంచనా వేసుకోగలగాలి. అతనికి దక్కవలసిన నిజమైన గౌరవం అందులోనే ఉంది.

పద్మజ సూరపరాజు
99403 44406

ఎమ్మెస్సార్ జాతీయ స్థాయి కథల పోటీ 2024

మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం నిర్వహిస్తున్న కథల పోటీకి రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం. బహుమతి పొందిన కథలతో బాటు మరికొన్ని ఎంపిక చేసిన ఉత్తమ కథలతో 'కథా ప్రపంచం 2024' పుస్తకం తెస్తాం. కమిటీ ఎంపిక చేసే సాహితీవేత్తకు మలిశెట్టి సీతారామ్ స్మారక సాహితీ పురస్కారం 2024 అందచేయబడుతుంది. కథలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. కథలను జూన్ 30 లోగా ఈమెయిల్ msreducaionalsociety@ gmail.comకు పంపాలి. వివరాలకు: 93947 82540

మలిశెట్టి శ్యాం ప్రసాద్

పల్లా జాతీయ కవితా పురస్కారం

యువసాహితి ప్రకటించిన పల్లా జాతీయ కవితా పురస్కారానికి 2024కి కంచరాన భుజంగరావు రచించిన 'నీటిగింజల పంట' కవితా సంపుటి ఎంపికైంది. జూన్ మొదటి వారంలో ప్రొద్దుటూరులో బహుమతి సత్కారం ఉంటుంది.

పల్లా కృష్ణ

రాజాం రచయితల వేదిక సమావేశం

మే 26 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో 'శ్రీపాద కథల్లో సామాజిక జీవనం' అంశంపై రాజాపు శాంతారావు ప్రసంగిస్తారు.

రాజాం రచయితల వేదిక

"కవిత్వం బతుకు సమరంలో నిలబెట్టే లంగరు"

గుల్జార్ 'ఆకుపచ్చ కవితలు' సంపుటి తర్వాత ఇప్పుడు 29 భాషల్లోంచి కవితలు అనువాదం చేసి 'ఇరుగు పొరుగు' సంకలనంగా తెచ్చారు. దీని నేపథ్యం చెప్పండి. మీరు అనువాద ప్రక్రియను ఎలా చూస్తారు?

అనువాదం అంటే కేవలం ఒక భాషలోంచి మరో బాషలోకి మాటల్ని తర్జుమా చేయడం మాత్రమే కాదు. ఆయా భాషలు, వాటిని మాట్లాడే ప్రజలు, వారి సామాజిక నేపథ్యం అన్నీ అనువాద క్రమంలో పరిగణనలోకి వస్తాయి. భిన్న భాషలు విభిన్న వ్యక్తులు వారి వ్యక్తీకరణలు అన్నీ అనువాదానికి భూమికలవుతాయి. అందుకే అనువాదం కనిపించినంత సులభమైంది కాదు. అందులో కవిత్వం మరింత క్లిష్టం. మూల రచనను అర్థం చేసుకుని ఆ కవిని, ఆయన చెప్పదలుచుకున్న విషయాన్నీ అవగతం చేసుకోవాలి. ప్రతిభాషకూ తమవైన జాతీయాలూ, పదబంధాలూ వుంటాయి, అవన్నీ పరిశీలించాల్సిన అంశాలే.

అయితే అనువాదం మూల భాషనుంచి కాకుండా ఇంగ్లీష్‌లోంచి చేసినప్పుడు కొన్ని ఇబ్బందులు వస్తాయి. నేనయితే 'ఇరుగుపొరుగు' కవితల్ని అనువదించే క్రమంలో అనుమానం వచ్చిన ప్రతిసారీ మూల రచయితల్ని మెయిల్‌లోనో ఫోన్‌లోనో సంప్రదించే ప్రయత్నం చేశాను. అలా సాధ్యమయింత మేర మూలంలోని భావం చెడకుండా చూశాను. ఉదాహరణకు ఆఘా షాహీద్ అలీని అనువదించినప్పుడు కశ్మీర్, అక్కడి స్థితి, వలసలు అన్నీ తెలుసు కనుక ఆయన హృదయాన్ని స్పృశించి తెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశాను. ఈ క్రమంలో ఇండియన్ లిటరేచర్, సచ్చిదానందన్, గుల్జార్ లాంటి వాళ్ళు కూర్చిన సంకలనాలూ ఎంతగానో ఉపయోగపడ్డాయి.




వారాల ఆనంద్ పలకరింపు

గుల్జార్‌ని 'ఆనంద్', 'పరిచయ్', 'కోశిష్' లాంటి సినిమాల కాలం నుంచి, అంటే దాదాపుగా గత 50 ఏళ్లుగా, ఫాలో అవుతున్నాను. ఆ క్రమంలో ఆయన గ్రీన్ పోయెమ్స్, నెగ్లెక్టెడ్ పోయెమ్స్, సస్పెక్టెడ్ పోయెమ్స్... ఇట్లా అన్నీ చదివాను. పచ్చదనం నాకూ చాలా ఇష్టం కనుక 'గ్రీన్ పోయెమ్స్' హిందీ లోంచి తెలుగులోకి చేశాను. ఇక 'ఇరుగు పొరుగు' విషయానికి వస్తే ఆ కవితలు దాదాపుగా మూడేళ్ళ నుంచి చేస్తున్నాను. ఇవి ప్రధానంగా ఇంగ్లీష్ లోంచి చేశాను.

మీకు సాహిత్యం పట్ల మక్కువ ఎట్ల ఏర్పడింది?

మాది కరీంనగర్‌లో మిఠాయి వ్యాపారం చేసే కుటుంబం. సాహిత్యంతో సంబంధం వున్న కుటుంబం కాదు. కానీ మా నాన్నగారికి హిందీ పాటలు, ఉర్దూ నవలలు బాగా ఇష్టంగా వుండేది. ఆ క్రమంలో ఇంట్లో బినాకా గీత్ మాలా, పురానీ



ఫిల్మోంకా గీత్ బాగా వినిపించేవి. మా ఇంటి దగ్గరే వున్న కృష్ణా బుక్ స్టాల్‌లో డిటెక్టివ్ నవలలతో నాకు చదవడం బాగా అలవాటయింది. తర్వాత కాలంలో 'శాంతినికేతన్' లాంటి నవలలు చదివాను. ఉస్మానియా యూనివర్సిటీలో చేరిన తర్వాత సాహిత్యాసక్తి బాగా పెరిగింది. ఇక కాలేజీ లైబ్రేరియన్ ఉద్యోగం కనుక పుస్తకాలే లోకం అయిపోయింది. చదవడం రాయడం కొనసాగింది.

గ్లోబలైజేషన్ నేపథ్యంలో తెలుగు భాష పరిస్థితి ఏమిటి? అనువాద ప్రభావం ఏమేరకు వుంటుంది?

ప్రపంచీకరణ మొత్తంగా ప్రపంచంలోని దేశాల మధ్య, మనుషుల మధ్య హద్దుల్నీ సరిహద్దుల్నీ చెరిపేసింది. పెరుగుతున్న సాంకేతికత దూరాల్ని చెరిపేస్తున్నది. అనేక సంస్కృతులు వేలాది భాషలు వున్న ప్రపంచంలో సమాచార ప్రసారం ముఖ్యమయింది. ముఖ్యంగా ఇంటర్నెట్‌లో ఇంగ్లీష్ ప్రధాన పాత్ర పోషిస్తున్న తరుణంలో అనేక చిన్న భాషలు ప్రభావితమవుతున్నాయి. కొన్ని భాషలు అంతరించిపోయే స్థితి ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో తెలుగు కూడా ఎంతోకొంత ప్రభావితం అవుతుంది, తప్పదు. ఇప్పటికే ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళు కాలేజీల ప్రభావం తెలుగుపై కనిపిస్తూనే వున్నది. కంప్యూటర్ నేర్చుకోవడానికి, అమెరికా వెళ్లడానికి ఇంగ్లీష్ కావాలి కనుక రానున్న తరాల్లో తెలుగు ఉపయోగం తగ్గిపోయే అవకాశం వుంది. మాతృభాషా పరిరక్షణ ఉద్యమం రావాల్సిన అవసరం కూడా వుంది. ఇక ప్రపంచీకరణ నేపథ్యంలో అనువాదం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందే అవకాశం కనిపిస్తున్నది. సాహిత్య అనువాదం మాత్రమే కాకుండా విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాలు, మీడియా, వ్యాపార రంగాల్లో అనువాద అవకాశాలు పెరిగే అవకాశం వుంది, పెరుగుతున్నాయి కూడా. సాహిత్యానువాదం అప్పుడూ ఇప్పుడూ అత్యంత ప్రధానమయింది అని నేననుకుంటాను.

'మానేరు తీరం', 'మనిషి లోపల' కవిత్వ సంపుటులతో సహా మీ మొత్తం కవిత్వంలో ప్రధానంగా మనిషి, ప్రకృతి సంబంధిత అంశాలు కనిపిస్తాయి. వీటి గురించి తెలపండి?

"నాకు కవిత్వం కేవలం కవిత్వం కాదు/ సగం శబ్దం సగం నిశబ్దం/ శబ్దమేమో బతుకు ఏడుపులోంచి ఎగిసిపడుతున్న ఎక్కిళ్ళు/ నిశబ్దమేమో బతుకు చేతగానితనం లోంచి వ్యక్తమవుతున్న మౌనం". అంతే కాదు, "కవిత్వం సంక్షోభ కాల ప్రవాహంలో నన్ను ఒడ్డుకు చేర్చే తెరచాప/ బతుకు సమరంలో నిలబెట్టే లంగరు" అని కూడా రాసుకున్నాను. కవిత్వాన్ని ఎప్పుడూ నేను కెరీర్‌గా తీసుకోలేదు. అది నా 'లైఫ్ లైన్'

మీరు కవిత్వం సినిమా రెండు కళ్ళుగా భావిస్తారు.. ఎట్లాగో వివరించండి?

సినిమా కవిత్వం రెండూ కళాత్మక వ్యక్తీకరణలే. కానీ కవిత్వం వ్యక్తిగత వ్యక్తీకరణ, సినిమా సమిష్టి కళల వ్యక్తీకరణ. అర్థవంతమయిన భావయుక్తమయిన ఆ రెంటినీ ఇష్టపడతాను. మనిషినీ సమాజాన్నీ పట్టించుకునే ఆ రెండూ నాకు ఊపిరుల్లాంటివి.

ఇంటర్వ్యూ: **కె.ఎస్.అనంతాచార్య**



అక్రమ రిజిస్ట్రేషన్లపై విజిలెన్స్

- నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం విచారణ
- జూన్ 1లోగా సబ్ రిజిస్ట్రార్ల వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు
- సర్కారు ఆదాయానికి కోట్ల రూపాయల గండి
- విజిలెన్స్ విచారణతో అక్రమార్కుల్లో గుబులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అక్రమ రిజిస్ట్రేషన్ల దందాపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విచ్చలవిడిగా నాన్ లేఅవుట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేస్తూ సర్కారు ఆదాయానికి గండిపెట్టిన సబ్ రిజిస్ట్రార్ల లీలలపై విజిలెన్స్ నిగ్గు తేల్చనుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారిగా విచారణ చేసి జూన్ 15వ తేదీలోగా నివేదికలు ఇవ్వాలని ప్రభుత్వం విజిలెన్స్ శాఖను ఆదేశించింది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు సబ్‌రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా వేలాది నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేశారు. చాలా ప్రాంతాల్లో భూమికి కనీసం నాలా పత్రం లేకున్నా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. నిబంధనలకు విరుద్ధం అని తెలిసినా విచ్చలవిడిగా అనుమతి లేని భూములకు రిజిస్ట్రేషన్లు చేసి కొందరు సబ్‌రిజిస్ట్రార్లు మామూళ్లమత్తులో పడిపోయారనే ఆరోపణలున్నాయి. తాజాగా ప్రభుత్వం నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై విజిలెన్స్ విచారణకు ఆదేశించటంతో అక్రమార్కుల్లో గుబులు రేపుతోంది.

నాన్ లేఅవుట్ ప్లాట్లపై నిషేధం

కొన్నేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల వ్యాపారం చేస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడింది. అంతేకాకుండా నాన్ లేఅవుట్ ప్లాట్లతో క్రయవిక్రయాల్లో సమస్యలు పెరిగి కోర్టులు చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇదే విధానం రాష్ట్రం మొత్తం ఉండటంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. 2020 అగస్టు 16నుంచి నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు జనగామ, మహబూబాబాద్, కొండకండ్ల, ములుగు, భూపాలపల్లి, ఖిలా వరంగల్, వరంగల్ రూరల్, నర్సంపేట, పరకాల, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట, భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీంతో వందలాది ఎకరాల్లో చేసిన నాన్ లేఅవుట్ వెంచర్లలోని వేలాది ప్లాట్లు రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందిగా మారింది.

అక్రమాలపై విజిలెన్స్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పాలనలో పారదర్శకతపై దృష్టి పెట్టింది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న క్రమంలో.. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల దందా తెరపైకి వచ్చినట్లుగా సమాచారం. దీనికి తోడు ఇటీవల మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ఏసీబీ అధికారులకు పట్టి పడిన క్రమంలో కోట్లాది రూపాయల ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. ఇంత డబ్బు ఎలా వచ్చిందని అధికారుల ఆరా తీశారు. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా అధిక మొత్తంలో అక్రమ సంపాదన ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడెక్కడ నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయనే కోణంగా ప్రాథమికంగా నిఘా వర్గాల ద్వారా ప్రభుత్వం ఆరా తీసినట్లుగా సమాచారం. ఈ క్రమంలో 2020 అగస్టు 16 నుంచి నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేసిన తరువాత అత్యధికంగా హనమకొండ, వరంగల్, జనగామ, ములుగు, మహబూబాబాద్, స్టేషన్‌ఘనపూర్ తదితర సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భారీగా నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు అయినట్లుగా ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో పాటు ఇటీవల నిజామాబాద్ జిల్లాలో నాన్ లేఅవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్ల దందా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులపై వేటు కూడా పడింది.

ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ల వారిగా 2020 నుంచి ఇప్పటి వరకు ఎన్ని నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయో..? వీటి వెనుక ఉన్న అధికారులు ఎవరు? అనే కోణంలో విచారిం చేందుకు ప్రభుత్వం విజిలెన్స్‌కు అప్పగించింది. జూన్ 15వ తేదీలోగా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను గుర్తించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం విజిలెన్స్ శాఖను ఆదేశించింది. విజిలెన్స్ విచారణలో అక్రమార్కులను గుర్తించి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వారి అదాయం ఎంత..? ప్రస్తుతం ఉన్న ఆస్తులు ఎన్ని? అని లెక్కలు కూడా తీసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అలాగే అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్లను కూడా రద్దు చేసే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది.

కాగా, ఉమ్మడి వరంల్ జిల్లాలో ఉన్న 13 సబ్ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో విజిలెన్స్ విచారణ చేపట్టనుంది. అయితే విజిలెన్స్ విచారణ నుంచి తప్పించుకునేందుకు కొందరు సబ్‌రిజిస్ట్రార్లు ముందుగానే దీర్ఘకాలిక సెలవులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది. మొత్తానికి కాసులకు కక్కుర్తి పడి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి అధికారులు, వారికి సహకరించిన వారిలో గుబులు మొదలైందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

అక్రమంగా రిజిస్ట్రేషన్ల దందా

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనధికార నాన్ లేఅవుట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆదేశాలు జారీ చేయటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. నాలుగైదు నెలలు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసిన సబ్ రిజిస్ట్రార్లు.. చివరకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఎరకు చిక్కినట్లుగా ప్రచారం జరుగుతోంది. చట్టంలోని లొసుగులను ఆధారం చేసుకుని నాన్ లేఅవుట్ ప్లాట్లను కూడా దర్జాగా రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా తెలిసింది. ఇందుకోసం కొంతమంది సబ్ రిజిస్ట్రార్లు తమ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద బినామీలను ఏర్పాటు చేసుకుని, వారితోనే బేరసాలు నిర్వహించినట్లుగా ప్రచారం ఉంది. ఒక్కొక్క ఏరియాను బట్టి గజానికి రూ.2వేల నుంచి రూ.10వేల వరకు మామూళ్లను దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ అదాయానికి భారీగా గండి పడింది. ప్రధానంగా వరంగల్ మహానగరం చుట్టూ ఉన్న వరంగల్, హనుమకొండ, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో అక్రమార్కులకు కాసుల పంట పండింది. అంతేకాకుండా కొంతమంది సబ్‌రిజిస్ట్రార్లకు తిరిగేందుకు వాహనాలు సమకూర్చటం తోపాటు విందుల కోసం హోటళ్లలో రాజభోగాలు అనుభవించేలా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాట్లు చేసేవారని ప్రచారం ఉంది. నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ల చేస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ గత సర్కారు పట్టించుకోలేదని తెలుస్తోంది.



పుష్పాలంకరణ సేవలో అమ్మవారు

భద్రకాళి శరభ శరభ

- ఘనంగా పుష్పరథ, శరభ వాహన సేవలు
- పదో రోజుకు చేరిన భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు

వరంగల్ కల్చరల్, మే 19: నగరంలోని భద్రకాళి దేవస్థానంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకలు ఆదివారం పదో రోజుకు చేరాయి. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం, చతుష్టానార్చన అనంతరం పుష్పరథ సేవపై, సాయంత్రం శరభ వాహనంపై ఊరేగించారు. ఉభయ దాతలుగా తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం, వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ లాలుకోట వెంకటాచారి, బ్రహ్మశ్రీ చొల్లేటి కృష్ణమాచారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత జాతీయ గ్రంథాలయ యోద్యమ నేత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యులు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, అలుగోజు కృష్ణమూర్తి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళల కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామోజు నాగ సోమేశ్వరాచారి, భరత్, గజ్జెల వీరన్న, సోమేశ్వరాచారి, సురేష్, జనసేన జగన్, శ్రీనివాస్, ఉమ్మడి జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు పాల్గొన్నారు.



వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న గుజ్జుల

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి

- 9 యేళ్లలో లక్షల కోట్ల నిధులను ఇచ్చింది..
- ప్రశ్నించే గొంతుక కోసం ఆశీర్వదించండి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

7

వర్షాకాలంలో నిరంతర విద్యుత్‌కు చర్యలు

- దెబ్బతిన్న పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లకు తక్షణం మరమ్మతులు
- జనవరి నుంచే ముందు జాగ్రత్తలు
- ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- 'ఆంధ్రజ్యోతి'తో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

6

ఆస్తి తగాదాలతో వృద్ధుడి హత్య

- హసన్‌పర్తిలో మనవళ్ల ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితులు?



సారయ్య మృతదేహం



సారయ్య (ఫైల్)

హసన్‌పర్తి, మే 19: ఆస్తి తగాదాల విషయంలో మనువళ్ల చేతిలో తాత హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన ఆదివారం హసన్‌పర్తిలో జరిగింది. హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ జవ్వాజీ సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన జల్లి సారయ్య (80) పక్షవాతంతో బాధపడుతున్నాడు. సారయ్యకు ఇద్దరు కుమారులు జల్లి రమేశ్, జల్లి అశోక్, ఒక కూతురు తిరుమల ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు అశోక్ చిన్నతనంలోనే మరణించాడు. పెద్దకుమారుడు రమేశ్‌కు వివాహమైన తర్వాత అతడు కూడా చనిపోయాడు. రమేశ్‌కు భార్య రమాదేవి, ముగ్గురు కుమారులు రాకేశ్, సాయికృష్ణ, శశికుమార్‌లున్నారు. రాకేశ్ వాళ్ల అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటున్నాడు. సాయికృష్ణ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శశికుమార్ పాలీటెక్నిక్ చదువుతున్నాడు. వీరు తన తాత ఇంటి వద్దనే ఉంటున్నారు. అయితే తన ఇంటి ఆస్తిలో మనవళ్లతోపాటు తన కూతురికి కూడా వాటా ఇవ్వాలని సారయ్య నిర్ణయించాడు. ఈ విషయంలో తరుచూ గొడవలు జరుగుతుండేవి. తమకు ఆస్తి ఇవ్వడంలేదని కోడలు రమాదేవి, మనువళ్లు సాయికృష్ణ, శశికుమార్ సారయ్యపై పగ పెంచుకున్నారు.

ఈ క్రమంలో ఆదివారం ఉదయం సారయ్య తన వాకింగ్ స్టాండ్‌ను పక్కన పెట్టి, కుర్చీపై కూర్చుని ముఖం కడుక్కుంటుండగా వాకింగ్ స్టాండ్‌తో వారు సారయ్య తలపై బలంగా కొట్టారు. తలకు తీవ్ర గాయంతో సారయ్య అక్కడికక్కడే మరణించాడు. నిందితులు అక్కడి నుంచి వెంటనే పరారయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఇన్స్‌పెక్టర్ జవ్వాజీ సురేష్, ఎస్సైలు అశోక్, రాజు, పోలీసు సిబ్బంది వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చుట్టు పక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నివిఎత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య జల్లి సమ్మక్క, కూతురు ల్యాగ తిరుమల ఉన్నారు. కూతురు తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాగా, జల్లి సారయ్య హత్య కేసులో నిందితులుగా అనుమానిస్తున్న జల్లి రమాదేవి, జల్లి సాయికృష్ణ, జల్లి శశికుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిని హత్య జరిగిన కోణాల్లో విచారిస్తున్నట్లు సమాచారం.

ఎట్టకేలకు 'ఇంటి దొంగల'పై కేసు


- మట్టెవాడ పోలీసుల అదుపులో ముగ్గురు బల్దియా సిబ్బంది
- ఆటోనగర్‌లో పైపుల చోరీపై చర్య
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

వరంగల్ కార్పొరేషన్, మే 19: ఎట్టకేలకు బల్దియా ఇంటి దొంగలను పోలీసులు పట్టుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'ఇంటి దొంగలపై చర్యలు లేనట్టేనా..?' అనే కథనానికి కమిషనర్ స్పందించారు. ఇటీవల బల్దియాలో వరుసగా జరుగుతున్న చోరీలపై వార్తా కథనాలు ప్రచురితం కావడంతో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో చర్చనీయాంశమైంది. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్టు తెలిసింది. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝూ ఆదేశాల మేరకు మట్టెవాడ పోలీసులు రంగంలోకి దిగారు. 23వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు ఆటోనగర్‌లో ఇటీవల పైపుల చోరీకి పాల్పడిన ముగ్గురు బల్దియా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎస్‌డీ హుస్సేన్, ఎన్.శ్రవన్‌కుమార్, కె.గణేశ్‌లను శనివారం సాయంత్రం మట్టెవాడ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారు. వారిపై ఐపీసీ సెక్షన్ 379 కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. కాగా చోరీ చేసిన పైపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న పైపుల విలువ సుమారు రూ.5వేల వరకు ఉంటుందని తెలిపారు.

కాగా, శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ఓ సూపర్‌వైజర్ స్థాయి అధికారి కేసు నమోదు కాకుండా ముగ్గురిని వదిలేయాలని పోలీసులతో బేరసారాలకు దిగినట్టు విశ్వసనీయ సమాచారం. సదరు అధికారి గురించి పోలీసులు విచారణ జరుపగా కరీంనగర్ నుంచి ఇక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నట్టు పోలీసులు తెలుసుకున్నారు. ఆ అధికారికి పోలీసులు వార్నింగ్ ఇచ్చి పంపించినట్టు తెలిసింది. ఇంకా ఈ కేసులో పోలీసులపై రాజకీయ ఒత్తిడి తెచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలసముద్రం షెడ్డు దొంగతనాలపై పోలీసులు, అధికారులు మౌనం పాటిస్తుండడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జడ్పీకి నిర్వహణ భారం

- సాధారణ ఖర్చులకే డబ్బులు లేని దుస్థితి
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు
- విద్యుత్ బిల్లులు చెల్లించలేని వైనం
- షట్టర్ల ఆదాయమే శరణ్యం



హనుమకొండ సిటీ, మే 19: హనుమకొండ జిల్లా పరిషత్ ఆర్థికంగా చితికిపోయింది. ఒకనాడు ఎంతో వైభవాన్ని కనబరిచిన జడ్పీ.. ప్రస్తుతం నిర్వీర్యమైంది. ఇందుకు గత ప్రభుత్వ నిర్ణయాలే ప్రధాన కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాల విభజన జరగడంతో జడ్పీ వ్యవస్థ ముక్కలైంది. వరంగల్‌ను ఆరు జిల్లాలుగా నాటి కేసీఆర్ ప్రభుత్వం విభజించడంతో జిల్లా పరిషత్‌లు మొక్కుబడిగా మారాయి. పరిపాలన పరంగానే కాకుండా ఆర్థికంగా నిధుల సమకూర్పు విధానం దెబ్బతినడంతో జిల్లా పరిషత్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. ఇది అభివృద్ధిపై ప్రభావాన్ని చూపాయి. అంతేకాదు.. జిల్లా పరిషత్ నిర్వహణ ఖర్చులకు సైతం సరిపోని ఆదాయం కూడా లేకుండా పోయింది. మరోవైపు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం వేతనాలు అందకుండా అయింది. ముఖ్యంగా హనుమకొండ జిల్లా పరిషత్ పరిధి అర్బన్ ప్రాంతంలోనే అధికంగా ఉండడంతో ఆదాయ వనరుల సమకూర్పు లేక పరిపాలన పరంగా ఉండి లేనట్లుగా నిలిచింది.


నిధుల లేమి..

ఒకనాడు రూ.2కోట్లకు పైగా సాధారణ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఫైనాన్స్ కమిషన్ నిధులతో పాటు ఇసుక క్వారీలు, స్టోన్ క్రషర్లు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి సెస్ రూపంలో వచ్చే నిధులు, గ్రామ పంచాయితీల నుంచి వచ్చే ఆదాయ వనరులు.. జిల్లా పరిషత్ ప్రధాన ఆదాయ మూలాలుగా ఉండేవి. అయితే జిల్లాల విభజన అనంతరం హనుమకొండ జిల్లా పరిషత్‌కు ఆదాయ మూలల సమకూర్పు మార్గాలు మూసుకుపోయాయి. ప్రధానంగా అర్బన్ పరిధిలో జడ్పీ ఉండడం ప్రధానకారణంతోపాటు ఫైనాన్స్ కమిషన్ నిధులతో పాటు మిగతా మార్గాల్లో వచ్చే ఆదాయం నిలిచింది. దీంతో హనుమకొండ జిల్లా పరిషత్ పరిపాలన కూడా స్తంభించింది. ఎలాంటి ఆదాయం లేకుండా పోవడంతో సాధారణ ఖర్చులు కూడా వెల్లదీసుకోలేని పరిస్థితి నెలకొంది.

అందని వేతనాలు

హనుమకొండ జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు స్కావెంజర్స్‌కు నెలల పాటు వేతనాలు ఇవ్వని దుస్థితి నెలకొంది. విచిత్రమేమిటంటే.. ఏ4 సైజు పేపర్ల కొనుగోలు కూడా భారంగా మారిందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఫైల్స్ నిర్వహణకు కూడా డబ్బులు లేక ఉద్యోగులు తమ జేబుల్లోంచి పెట్టుకునే పరిస్థితి నెలకొంది. ప్రింటర్లు, కంప్యూటర్లు దెబ్బతింటే రిపేర్ చేసుకోలేని పరిస్థితి. ఇంతలా ఆర్థికంగా హనుమకొండ జిల్లా పరిషత్

మిగతా 8వ పేజీలో..



రేవంత్‌రెడ్డిని కలిసిన కడియం కుటుంబం


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సభ్యులు

హనుమకొండ సిటీ, మే 19: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురు కడియం కావ్యతో పాటు ఇతర కుటుంబసభ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కూడా మర్యాద పూర్వకంగా కలిసి కాసేపు ముచ్చటించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నిక, కడియం కావ్య గెలుపు అంశాలను ఈ సందర్భంగా శ్రీహరి ముఖ్యమంత్రికి వివరించారు.









వర్షాకాలంలో నిరంతర విద్యుత్‌కు చర్యలు

- దెబ్బతిన్న పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లకు తక్షణం మరమ్మతులు
- జనవరి నుంచే అన్ని ముందు జాగ్రత్తలు
- ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- నిరంతర నిఘాకు కంట్రోల్ రూమ్
- 'ఆంధ్రజ్యోతి'తో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


సీఎండీ వరుణ్ రెడ్డి

హనుమకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలంలో నిరంతర కరెంట్ సరఫరాకు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. జనవరి నుంచే ఈ ప్రక్రియ మొదలైందన్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. అకాల వర్షాల వల్ల కొన్ని జిల్లాల్లో కొంత ఆస్తినష్టం జరిగిందని చెప్పారు. గాలివానకు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయిన చోట తక్షణం మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరాపై 'ఆంధ్రజ్యోతి'తో వరుణ్ రెడ్డి ముచ్చటించారు. ఆయన మాటల్లోనే...

హైపర్ ప్లాన్

వర్షాకాలం సాధారణంగా భారీ వర్షాలు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయి, విద్యుత్ తీగెలు తెగిపోయి కరెంట్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుంది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు 'హైపర్' పేరుతో ఒక కార్యప్రణాళికను అమలు చేయబోతున్నాము. హెచ్ అంటే అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్లో ఉండడం. ఏ అంటే అరెంజ్‌మెంట్ ఫర్ మ్యాన్ పవర్ అండ్ మెటీరియల్, ఐ అంటే ఇన్‌ఫర్మేషన్ కలెక్షన్ అండ్ ప్రాంప్ట్ ఇంటిమేషన్, పి అంటే ప్లానింగ్ ఆఫ్ మొబిలైజేషన్ ఆఫ్ మెన్ అండ్ మెటీరియల్, ఈ అంటే ఎగ్జిగ్యూటషన్ ఆఫ్ వర్క్, ఆర్ అంటే రిస్టోరేషన్ ఆఫ్ సప్లయ్.

ప్రీమాన్సూన్ ఏర్పాట్లు

వర్షాకాలం ప్రవేశించడానికి ముందే ప్రీమాన్సూన్ ఏర్పాట్లు చేపట్టాము. జనవరి నుంచే ఈ ప్రక్రియ మొదలైంది. జనవరిలో కొంత చల్లదనం కొంత ఎండ ఉంటుంది. ఇన్సులేటర్లు అయిపోతాయి. అప్పటి నుంచే సిద్ధమవుతుంటాము. ప్రీమాన్సూన్ ఇన్‌స్పెక్షన్ ఉంటుంది. ఫిబ్రవరి నుంచి మే వరకు షెడ్యూల్ ప్రకారం తనఖీలు ఉంటాయి. మొదట సబ్‌స్టేషన్లు ఎలా ఉన్నాయి. పీటీఆర్ ఎట్లా ఉన్నాయి. లైన్స్ పరిస్థితి ఏమిటి? ఇతర అనుబంధ పరికరాల పనితీరు ఎలా ఉంది? వీటన్నిటిని పర్యవేక్షించడానికి ఎంఆర్‌టీ, ఆపరేషన్, రిపేరింగ్, మెయింటెనెన్స్ తదితర విభాగాలు ఉంటాయి. వీటి సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తారు. ఇదంతా విద్యుత్ పరికాల మీద ఆధారపడి జరుగుతుంది. దీనితో పాటు అధికారులు అందుబాటులో ఉండేలా కూడా చుస్తున్నాము. వర్షాకాలంలో అన్ని విభాగాల అధికారులు హెడ్‌క్వార్టర్‌లో ఉండేలా ఆదేశాలు జారీ చేశాము.

ముంపు ప్రాంతాల గుర్తింపు

వర్షాకాలంలో వరదలతోనేపెద్ద సమస్య వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పొంగుతుంటాయి. ఫలితంగా వీటి గట్లమీద ఉండే పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోతుంటాయి. ఈ సారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా గత సంవత్సరమే వరద ముంపు ప్రాంతాలను గుర్తించాము. అక్కడ వాగులు, చెరువులను అనుకొని ఉన్నపోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లన్నిటిని గట్లపైకి తీసుకువచ్చి ఎత్తయిన సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేశాము.

అందుబాటులో సిబ్బంది

వర్షాకాలంలో దెబ్బతిన్న పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతు చేసేందుకు అవసరమైన సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతున్నాము. ఎక్కడ చిన్న అంతరాయం కలిగినా వెంటనే వెళ్లి మరమ్మతు చేసేలా చేస్తున్నాము. ప్రధానంగా రాత్రిపూట విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ముఖ్యంగా రాత్రివేళ కరెంట్ పోతే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతారు. ఇలాంటి పరిస్థితిని తప్పించేందుకు సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూస్తున్నాము. తక్షణ మరమ్మత్తులకు వర్షాకాలంలో ఎక్కువగా ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో కరెంట్ సామాగ్రిని అందుబాటులో ఉంచుతున్నాము. వ్యవసాయ సీజన్ కనుక అగ్రికల్చరల్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి మరమ్మతులు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటున్నాము. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం పెట్టుకున్న దరఖాస్తులను పరిష్కరించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాము.

అకాల వర్షాలతో..

గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల కొన్నిచోట్ల కొంత నష్టం వాటిల్లింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లో కొన్ని పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. వాటికి వెంటనే మరమ్మతులు చేశాము. వర్షం రాకడను ముందే తెలుసుకునేందుకు ముఖ్యప్రణాళికాధికారి కార్యాలయం సహకారాన్ని కూడా తీసుకుంటున్నాము. వారి నుంచి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆమేరకు ముందుగా జాగ్రత్త పడుతున్నాము.. మా అధికారులు కూడా వర్షాల రాకకు సంబంధించిన యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని తదనుగుణంగా అప్రమత్తమవుతున్నారు.

కంట్రోల్ రూం

కరెంట్ సరఫరా వ్యవస్థను నిరంతరం గమనిస్తూ ఉండేందుకు, అవసరాన్ని బట్టి సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు ఒక కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేశాము. ఇందులో ఏడీఈ, డీఈ, ఏఈ ర్యాంకు అధికారులు, ఒక ఆపరేటర్ ఉంటారు. ఈ కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తూ ఉంటుంది. కరెంట్ సరఫరా ఎలా ఉందో నిరంతరం గమనిస్తూ ఉంటారు. ఎక్కడైనా ఏ చిన్న అంతరాయం కలిగిన సంబంధిత సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేస్తారు.

వివాహం కావడం లేదని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన రాజశేఖర్

కాజీపేట, మే 19 : వివాహం కావడం లేదని ఓ వ్యక్తి పొలంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వైసుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట తిలక్‌నగర్‌కు చెందిన సింగారపు రాజశేఖర్ (30) తల్లిదండ్రులు 12 యేళ్ల కిందట, తమ్ముడు 5 యేళ్ల కిందట మరణించారు. రాజశేఖర్ ఒక్కడే ఆటోనడుపుకుంటూ తిలక్‌నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో రాజశేఖర్ తనకు పెళ్లికావడం లేదని మనస్థాపానికి గురయ్యేవాడు. తన స్నేహితులతో పాటు అక్క రాధికకు ఈ విషయాన్ని అప్పుడప్పుడు చెప్పేవాడు. కాగా, ఆదివారం కాజీపేట సోమిడి సమీపంలోని ఓ పొలంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు అక్కలు ఉన్నారు. మృతుడి అక్క రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వైసుధాకర్‌రెడ్డి తెలిపారు.





నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

వరంగల్ కార్పొరేషన్, మే 19: నగర ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పరిపాలనాపరమైన కారణాలు, లోక్‌సభ ఎన్నికల ఫలితాల కారణంగా ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలుగమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రావద్దని కమిషనర్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు బీఆర్ఎస్ ఇన్‌చార్జిల నియామకం

రాంనగర్, మే 19 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జిలను నియమించారు. వరంగల్ తూర్పు మినహా 11 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. ప్రతీ ఓటరును కలిసి సిట్టింగ్ స్థానం నిలబెట్టుకునేందుకు అందరుసమష్టిగా పనిచేయాలని కేటీఆర్‌సూచించారు.

- స్టేషన్‌ఘన్‌పూర్ - మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్
- జనగామ - ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య
- పాలకుర్తి - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చలిమెడ లక్ష్మీనరసింహరావు
- భూపాలపల్లి - మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్మన్ పుట్ట మధు
- డోర్నకల్ - మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎమ్మెల్యే అనిల్ యాదవ్
- మహబూబాబాద్ - మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జాన్సన్
- ములుగు - పార్టీ జిల్లా ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, ఎమ్మెల్యే కోవా లక్ష్మి
- పరకాల - మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.చందర్
- వరంగల్ వెస్ట్ - మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీఎమ్మెల్యే బాల్కసుమన్, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్
- నర్సంపేట - మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్
- వర్ధన్నపేట - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

విషతుల్యంతో 23 మేకలు మృత్యువాత

- సుమారు రూ.3.15 లక్షల ఆస్తి నష్టం


మృతి చెందిన మేకలు

ఐనవోలు, మే 19 : జాలు చొప్ప ఇగురు మేసిన మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన వనమాల కనపర్తి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వీటి విలువ సుమారు రూ.3.15 లక్షలు ఉంటుందని బాధితులు విచారం వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన మేకలు, గొర్రెల యాజమానులు జక్కుల అశోక్, సమ్మయ్య, ప్రశాంత్, రాకేష్, పల్ల ఐలయ్య చెందిన సుమారు 100కుపైగా మేకలు, గొర్రెల మందలను ఆదివారం గ్రామ శివారులోని రైతుల భూముల్లోకి మేతకు తీసుకెళ్లారు. యాసంగి పంటలో భాగంగా స్థానిక రైతులు సాగుచేసి కోసేసిన మాగిజొన్న, మొక్కజొన్న మొదళ్లకు ఇటీవల కురిసిన వర్షానికి పచ్చగా ఇగురు రాగా వీటిని మేకలు, గొర్రెలు మేశాయి. యాజమానులు సాయంత్రం వాటిని ఇంటికి తీసుకరాగా పొట్ట ఉబ్బి, నురుగు, రక్తం కారుతూ 21 మేకలు, 2 గొర్రెలు మృతి చెందాయి. చూస్తుండగానే ఒకదాని తరువాత ఒకటి మృత్యువాత పడడం మరికొన్ని అస్వస్థతకు గురికావడంతో కాపర్లు ఆందోళనకు గురయ్యారు.

స్థానికులు పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం అందించగా సిబ్బంది వెళ్లి బతికి ఉన్న మేకలు, గొర్రెలకు విషతుల్యం నుంచి కాపాడేందుకు ఇంజక్షన్లు ఇచ్చారు. ఒకొక్క మేక సుమారు రూ.15 వేల నుంచి 20 వేల ధర పలుకుతుందని, ఇలా ఐదుగురికి చెందిన 21 మేకలు మృతిచెందడంతో రూ.3.15 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనాకు వచ్చారు. ఈ విషయంపై పశువైద్యాధికారి వినయ్ మాట్లాడుతూ.. మొక్కజొన్న, మాగిజొన్న మొలక తినడం వలన విషతుల్యం(నాము) ఏర్పడి మృతి చెందినట్లు గుర్తించామని, పోస్టుమార్టం ద్వారా మృతికి గాల కారణాలు తెలుస్తాయన్నారు.

నేటి నుంచి టెట్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 19: ఉపాధ్యాయ అర్హత టెస్ట్ (టెట్) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో జరుగనున్న పరీక్షకు హనుమకొండ నయీంనగర్‌లోని చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ, హసన్‌పర్తి ఎర్ర గట్టు గుట్ట వద్దగల అయాన్ డిజిటల్ సెంటర్, చింతగట్టులోని నోబుల్ టెక్నాలజీస్, రామారంలోని మోక్షిత కంప్యూటర్స్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జూన్ 2 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ పరీక్ష జరుగనుంది. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు టెట్ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 15,949 మంది పరీక్ష రాయనున్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో ధృవ జూనియర్ కళాశాల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 19: ఎప్‌సెట్ ఫలితాల్లో ధృవ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాల్లో నిధిపాల్ 593 ర్యాంకు, కందగట్ల తిరుపతి 2120, తహెనియత్ ఫాతిమా 2767 ర్యాంకులు సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో చీకటి చందన 1024, కొండమడుగుల అలేఖ్య 7777 ర్యాంకు సాధించారన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లో ఉన్న ధృవ జూనియర్ కళాశాలల్లో అద్భుతమైన రీతిలో వినూత్నమైన పటిష్టమైన ప్రణాళికతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామన్నారు. అలాగే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి, అన్ని ఎంట్రన్స్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కళాశాల బృందం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఎప్‌సెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు ఆకుల సంపత్, ఆకుల సతీష్‌కుమార్‌లతో కలిసి అభినందించారు.

మెరిట్ ఆధారంగా వీసీల నియామకం చేపట్టాలి



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఇస్తారి తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 19 : రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో వీసీల నియామక ప్రక్రియను పారదర్శకంగా పరిశోధన, అకడమిక్ మెరిట్ ఆధారంగా వీసీల నియామకం చేపట్టాలని తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ మామిడాల ఇస్తారి కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో జరిగిన వీసీల నియామకాలపై హైకోర్టులో కేసులు నడుస్తున్నాయని వెంకటేశంకు వివరించినట్లు ఇస్తారి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లోని వీసీలు విద్యార్థి, టీచర్ల వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి దరఖాస్తులను తిరస్కరించాలని కోరామన్నారు. అక్రమాలకు పాల్పడిన వీసీలపై విచారణ జరపాలన్నారు. వీసీలుగా దరఖాస్తు చేసుకున్నవారి 5 సంవత్సరాల ఆడిట్ రిపోర్టు పరిశీలించి వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా మంచి అకడమిక్, పరిశోధన నైపుణ్యాలున్న వారిని మాత్రమే వీసీలుగా నియమించాలని ముఖ్య కార్యదర్శిని కోరినట్లు ఇస్తారి తెలిపారు.

కృష్ణవేణి విజయదుందుభి



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 19: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి, ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో విజయఢంకా మోగించారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, మాచవరపు కోలేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావులు తెలిపారు. ఎస్. భరత్‌తేజ 162, సీహెచ్.భరత్ వంశీ 862, కె.స్వాతి 1,260, వై.గీత 1,352, ఏ.ఇందు 4,158, ఎండీ. మోహెక్ తబస్సుమ్ 4,380, సీహెచ్. లక్ష్మి 5,788, టి. కోమలి 6,686, వై. ఉమేష్‌చంద్ర 7,021, వి. శ్రీహిత 7,045, జి. సాయి సైనిక 7,484, పి నవదీప్ 7,657, కె. హరిప్రియ 7,928, బి . మెర్సీ 8,087, టి.వర్ష 8,108, కె.ఆశ్రిత 8,967, జి.దీప్తి 9,762, వి.దేవిప్రియా 9,828, బి.గణేష్ 9,981 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రుల ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇన్‌చార్జి వంశీకృష్ణ, ఏవో నిరంజన్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మడికొండ, మే 19 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం ఏనుగల్లు గ్రామం తూర్పు తండాకు చెందిన బానోతు బాలు(58) ఆదివారం కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో ఉంటున్న కూతురి వద్దకు వచ్చాడు. భట్టుపల్లిలో అల్లుడు పనిచేస్తుండగా అక్కడి వెళ్లి కలిసి ద్విచక్ర వాహనంపై రాజీవ్ గృహకల్పకు వస్తున్నాడు. ఈ క్రమంలో భట్టుపల్లి రోడ్డుపై వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు, పోలీసులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మార్కెట్‌లో దగా.. దగా..

- తప్పుడు తూకాలతో మోసపోతున్న వినియోగదారులు
- తూనికలు కొలతల శాఖలో సిబ్బంది కొరత
- 11 మంది ఇన్‌స్పెక్టర్లకు ఉన్నది నలుగురే..
- ఐదేళ్లుగా ఇన్‌చార్జ్ డీసీయే దిక్కు
- నామమాత్రంగా తనిఖీలు
- నేడు ప్రపంచ తూనికలు కొలతల దినోత్సవం



మార్కెట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

హనుమకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : వెనుక ముందు దగా.. దగా..అన్న మహాకవి మాటలు కొందరు వ్యాపారులకు అతికినట్టు సరిపోతాయి. అధిక లాభార్జనే ధ్యేయంగా కలిగిన వ్యాపారులు వస్తువిక్రయాల్లో భారీగా మోసాలకు పాల్పడుతున్నారు. తూనికలు, కొలతల్లో పెద్ద ఎత్తున దగా చేస్తున్నారు. ఒకవైపు కల్తీ.. మరోవైపు తూకాల్లో మోసాలతో వినియోగదారుడు ఆర్థికంగా, ఆరోగ్యపరంగానూ తీవ్రంగా నష్టపోతున్నాడు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. తూనికలు కొలతల శాఖలో సిబ్బంది కొరత వల్ల పర్యవేక్షణ కొరవడింది. దీనితో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వినియోగదారులు కూడా తూనికలు కొలతల విషయంలో కనీస అవగాహన కలిగి ఉండడం లేదు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తూనికలుసరిగా చూసుకోవడం లేదు. ఇదికూడా మోసపోవడానికి కారణమవుతోంది. సోమవారం ప్రపంచ తూనికలు కొలతల దినోత్సవం. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తూనికలు, కొలతల పరిస్థితిపై కథనం.



తూనికలు కొలతలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దగా.. దగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండ్ల నుంచి కూరగాయల వరకు చికెన్, నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్.. ఇలా ప్రతీ వస్తువు విక్రయంలో వ్యాపారులు తప్పుడు తూనికలు,కొలతలో వినియోగదారులను మోసం చేస్తున్నారు. తప్పుడు తూకాల ద్వారా ఒక కిలోకు 150 నుంచి 200 గ్రాములు తగ్గించి అమ్ముతున్నారు. మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాంటాలను సైతం ట్యాంపరింగ్ చేస్తున్నారు. కళ్లకు తూకం సరిగానే కనిపిస్తున్నా వాస్తవంగా తగ్గుతోంది. తూనికలకు ప్రతీ సంవత్సరం వ్యాపారులు విధిగా సీళ్లు వేయించాలి. కానీ, వారు ఆపని చేయడంలేదు. పలుచోట్ల రాళ్లు, మొద్దు కాంటాలను వినియోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. షాపులు, వారాంతపు సంతల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

సిబ్బంది కొరత

తూనికలు కొలతల శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గత దశాబ్ద కాలంగా నియామకాలే లేవు. అనేక మంది అధికారులు, కింది స్థాయి సిబ్బంది రిటైర్ అయ్యారు. ఫలితంగా పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం జిల్లాల విభజన చేసినప్పటికీ ఆ మేరకు ప్రతీ జిల్లాకు ఒక తూనికలు కొలతల అధికారిని, ఇన్‌స్పెక్టర్లను గానీ నియమించలేదు. తూనికలు కొలతల శాఖ వరంగల్ జోన్ పరిధిలో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలు కూడా వస్తాయి. వరంగల్ జోన్ పరిధిలో తూనికలు, కొలతల శాఖకు సంబంధించి మొత్తం 11 కార్యాలయాలు ఉన్నాయి. వీటికి 11 మంది తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. కానీ, ప్రస్తుతం ఉన్నది నలుగురే. వరంగల్ జిల్లాకు ఒక్కరే తూనికలు కొలతల అధికారి ఉన్నారు. ఆయనే హనుమకొండ జిల్లాకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వరంగల్ తూనికలు కొలతల రీజినల్ డిప్యూటీ కంట్రోలర్ పోస్టు కూడా 2019 నుంచి ఖాళీగా ఉన్నది. నల్లగొండ ఆర్‌డీసీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

1,647 కేసులు నమోదు

గత సంవత్సరం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు జరిపి తప్పుడు తూకాలకు పాల్పడుతున్న వ్యాపారులను గుర్తించి మొత్తంగా 1,647 కేసులు నమోదు చేశారు. స్టాంప్ ఫీజుగా రూ.2.46కోట్లు, కాంపౌండ్ ఫీజుగా రూ.87 లక్షలు వసూలు చేశారు. సిబ్బంది కొరతవల్ల ప్రస్తుతం ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది. తనిఖీలు నిర్వహించడం కష్టమవుతుంది. అయినప్పటికీ వీలైనంత మేరకు ఆకస్మికంగా తనిఖీలు జరుపుతున్నారు.

అద్దె భవనంలో ఆఫీసు

తూనికలు కొలతల కార్యాలయానికి ఇప్పటి వరకు స్వంత భవనం లేదు. అనేక సంవత్సరాలుగా అద్దె భవనంలోనే మగ్గుతోంది. వరంగల్ జోన్ డీసీ, డీఎల్ఎంవో, ఏసీ కార్యాలయాలన్నీ ప్రస్తుతం వరంగల్ కొత్తవాడలోని అద్దె భవనంలో నడుస్తున్నాయి. గతంలో దేశాయిపేటలో ఉన్న ఈ కార్యాలయాలు ఆ తర్వాత కొత్తవాడలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం భవనంలోకి మారాయి. ఒక్క హనుమకొండ ఎల్ఎం ఆఫీసు మాత్రం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నడుస్తోంది. దీనిని బట్టే తూనికలు, కొలతల శాఖ పట్ల ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. స్టాంప్ ఫీజు, కాంపౌండ్ ఫీజు రూపంలో ఏటా కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుస్తున్న ఈ శాఖ పట్లనే ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు

వినియోగదారురుడు మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తూనికలు కొలతలు సరిగా ఉన్నాయో లేవో ముందు పరిశీలించాలి. తూకాలకు వెనుక భాగానా తూనికలు కొలతల శాఖ వేసిన ముద్రలు ఉన్నాయా.. లేవా చూడాలి. నిర్దేశిత తూకపు రాళ్లు కాకుండా బండరాళ్ల వంటివి తూకానికి వినియోగిస్తే తిరస్కరించాలి. అలాగే డిజిల్ కాంటాలపై వస్తువులను తూచేప్పుడు స్ర్కీన్‌పై జీరో చేసి ఉందా.. లేదా పరిశీలించాలి. పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్ లేదా డీజిల్ వాహనాల్లో పోయించుకునేప్పుడు జీరో నుంచి ఫిల్లింగ్ జరుగుతుందా.. లేదా అనేది గమనించాలి. బట్టల షాపుల్లో టేపులు సరిగా ఉన్నాయా.. లేవా అనేది చూడాలి. చేపలు, వీలైనంత మేరకు డిజిటల్ కాంటాలు వినియోగించే చోటనే కొనుగోళ్లు చేయాలి. ఎవరైనా తప్పుడు తూకాలు వినియోగిస్తున్నట్టు తెలిస్తే ఆ విషయాన్ని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారికి 6304982375 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

తూనికలు కొలతల పట్ల అవగాహన కల్పిస్తున్నాం

ఎస్.రాజేశ్వర్, అసిస్టెంట్ కంట్రోలర్ తూనికలు కొలతల శాఖ, వరంగల్ జోన్



తూనికలు కొలతల పట్ల వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తూనికలు, కొలతలు ఎలా ఉన్నాయి? నిర్దేశిత ప్రమాణాలకు లోబడి ఉన్నాయా.. లేవా అనేది ఎలా తెలుసుకోవాలో తెలియచేస్తున్నాం. ఒకవేళ తప్పుడు తూకాలు ఉన్నట్లయితే తమకు సమాచారం ఇచ్చినట్లయితే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌తో పాటు పెట్రోల్ బంక్‌లను సైతం తరచూ ఆకస్మిక తనిఖీలు చేసి తూనికలు, కొలతలు సరిగా ఉన్నాయా.. అని పరిశీలిస్తున్నాం. మోసాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నాం. ఇటీవల సమ్మక్క- సారలమ్మ జాతరలో కూడా తనిఖీలు జరిపాము. తూనికలు కొలతల శాఖలో సిబ్బంది కొరత ఉన్నది నిజమే. చాలా సంవత్సరాలుగా నియామకాలు లేవు.

వినియోగదారుడు అవగాహన కలిగి ఉండాలి

సాంబరాజు చక్రపాణి, లీగల్ మెట్రాలజీ రూల్స్ సవరణల కేంద్ర కమిటీ సభ్యుడు



పండ్లు, కూరగాయలు, చేపలు మొదలుకొని బంగారం వరకు అన్ని రకాల వస్తువుల కొనుగోలులో వినియోగదారులకు న్యాయం జరగాలంటే లీగల్ మెట్రాలజీ చట్టాలు, రూల్స్ గురించి అవగాహన కలిగి ఉండాలి. బట్టల షాపుల్లో కొలతల టేపులు, పెట్రోల్ పోసే పంపులు, వేబ్రిడ్జిలు, భూమి సర్వేయర్లు, ఉపయోగించే గొలుసులు, వాటర్ మీటర్లు, డాక్టర్లు ఉపయోగించే ధర్మామీటర్లు, బీపీ మిషన్లు, ఆటో, టాక్సీ మీటర్లు, బార్ షాపుల్లో పెగ్ కొలతలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే మోసాలు జరగవు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

24న విత్తన మేళా



ఉమారెడ్డి

వరంగల్ వ్యవసాయం, మే 19: రైతులకు మేలైన విత్తనాలను అందించేందుకు ఏటా నిర్వహించినట్లే 24న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు ఏడీఆర్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందడంలో విత్తనం ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ప్రస్తుతం రైతులు దుక్కులు చేసుకుని 15 రోజుల్లో ప్రారంభం కాబోతున్న రోహిణి కార్తె కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వర్షం పడగానే విత్తనాల కోసం ఇబ్బంది పడకుండా ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో భూసారాన్ని బట్టి ఏ పంట వేసుకోవాలి, పంట మార్పిడి తదితర విషయాలను రైతులు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతీ సంవత్సరం మే 24న హైదరాబాద్ రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో, అలాగే దానికి అనుబంధంగా ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్, జగిత్యాల, పాలెం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధన స్థానాలలో విత్తన మేళాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపించాలి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

రాంనగర్, మే 19 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలోని వినోద్ కుమార్ నివాసంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈసమావేశంలో న్యాయవాదులు, విద్యార్థి నేతలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, మేధావి అయిన రాకేష్‌రెడ్డికి అన్ని సంఘాల మద్దతు అవసరమన్నారు. పట్టభద్రులు సంఘటితంగా పనిచేసి రాకేష్‌రెడ్డిని భారీ మెజా రిటీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు సుధీర్‌కుమార్, నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, జనార్ధన్‌గౌడ్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, వీరేందర్, జోరిక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి

- 9 యేళ్లలో లక్షల కోట్ల నిధులను ఇచ్చింది..
- ప్రశ్నించే గొంతుక కోసం ఆశీర్వదించండి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మే 19: బీజేపీ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ 9 యేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు 10 లక్షల కోట్ల రూపాయలను కేటాయించిందని వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం హనుమకొండ భద్రకాళి బండ్‌పై బీజేపీ శ్రేణులతో కలిసి ప్రేమేందర్‌రెడ్డి వాకర్స్‌ను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇళ్లు లేని నిరుపేదలకు 4వేల ఇళ్లను మోదీ నిర్మించి ఇచ్చారన్నారు. 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యాన్ని అందిస్తూ పేదల ఆకలి తీర్చుతున్నాడని గుర్తుచేశారు. ఈ 9యేళ్లలో వరం గల్‌లో జరిగిన ప్రతీ అభివృద్ధిలో కేంద్రం వాటా ఉందన్నారు. హైద్రాబా ద్-వరంగల్ జాతీయ రహదారి సైతం కేంద్ర ప్రభుత్వం ద్వారానే నిర్మి తమైందన్నారు. 40 యేళ్లుగా బీజేపీలోనే కొనసాగుతున్నానని, తనపై నమ్మకంతో ఓటేసి గెలిపిస్తే పెద్దల సభలో గొంతెత్తి మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, పార్టీ క్రమశిక్షణాసంఘం చైర్మన్ ధర్మారావు, ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, వన్నాల శ్రీరాములు, జిల్లా నాయకులు కొండి జితేందర్‌రెడ్డి, గాడిపల్లి రాజేశ్వర్‌రావు, యువ మోర్చా అధ్యక్షుడు తీగల భరత్, ఓబీసీమోర్చా అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దొందూ దొందే..

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో ఒక్కటేనని, ప్రజల సమస్యలు పట్టించు కోకుండా కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హంటర్ రోడ్డులో పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలతో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యూపీఏ పాలనలో వరుస కుంభకోణాలతో దేశాన్ని అప్రతిష్ట పాలుచేస్తే.. భారతదేశ ముఖ చిత్రాన్ని నరేంద్రమోదీ సమూలంగా మార్చాడన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న సంకల్పంతో మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నాడన్నారు. విద్యార్థి నాయకుడి నుంచి వచ్చిన తనకు నిరుద్యోగం, ఉద్యోగస్తుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్సీగా ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించి శాసన మండలికి పంపిస్తే ప్రజా గొంతుకనవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టభద్రుల ఎన్నిక ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పశ్చిమ కో-ఆర్డినేటర్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ ప్రభారి మురళీధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు చాడ శ్రీనువాస్‌రెడ్డి, రావుల కిషన్, పులి సరోత్తంరెడ్డి, కుమారస్వామి, సత్యనారాయణ, కార్పొరేటర్ చాడ స్వాతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, మే 19 : సుదీర్ఘ చరిత్ర కలిగిన బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలుచేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి గారడీ మాటలను మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌పై ప్రజలకు కోపం ఇంకా చల్లారలేదని అన్నారు. లోక్‌సభ ఫలితాల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్ కావడం ఖాయమని ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రుల ఉపఎన్నికలో పట్టభద్రులు, మేధావులు,డాక్టర్లు, న్యాయవాదులు, నిరుద్యోగులు, విద్యావంతులు ఆలోచించి తనను ఆశీర్వదించాలని కోరారు.

ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో నిధులను మంజూరు చేసి ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. విభజన చట్టంలో లేని హామీలను అమలు చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఒక్క అవకాశాన్ని కల్పిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను మంజూరి చేయించి అభివృద్ధి చేస్తానని గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ మీట్ ది ప్రెస్ లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు గడ్డం రాజిరెడ్డి, బొక్క దయాసాగర్‌తో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ సభ్యులు?

- కోర్టులో హాజరుపర్చాలని ఎన్డీ డిమాండ్

బయ్యారం, మే 19: పోలీసులు శనివారం రాత్రి పలువురు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళసభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్డీ దళసభ్యులు రాజన్న, జీవన్, దేవ్‌రెడ్డితో పాటు మరి కొంతమంది అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళుండగా వరంగల్-కరీంనగర్ మార్గమధ్యలో హసన్‌పర్తి మండలం ఆరెపల్లి సమీపంలో వరంగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆ దళ సభ్యులు ప్రస్తుతం న్యూడెమోక్రసీ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల సరిహద్దు బయ్యారం ఏరియా దళ కమాండర్ అశోక్ దళంలో సభ్యులుగా పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే అశోక్‌ను రెండు నెలల క్రితం పోలీసులు అరెస్టు చేయగా, తప్పించుకున్న ఈ దళ సభ్యులు కొత్తగూడ, గంగారం, బయ్యారం మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లోనే తలదాచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఎన్డీ దళసభ్యులు రాజన్న, జీవన్, దేవ్‌రెడ్డితో పాటు మరికొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో పల్లెల్లో ఒక్కసారిగా అలజడి నెలకొన్నది. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో ఇటీవల నమోదైన పూసపల్లి కుట్ర కేసులో పోలీసులు ఈ దళ సభ్యుల పేర్లు చేర్చినట్లు తెలిసింది. అందులో భాగంగానే పోలీసులు పక్కా సమాచారంతో మాటుకాసి దళ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఏజెన్సీని జల్లెడ పడుతున్న పోలీసులు

స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు కొద్ది రోజులుగా ఏజన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. అనుమానాస్పద ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు ప్రతీ అణువును జల్లెడ పడుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దు గ్రామాలను లక్ష్యంగా చేసుకుంటున్న పోలీసు బలగాలు ఆయా ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఏజన్సీలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతున్నట్లు సమాచారం. స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు ఏజన్సీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండటంతో మన్యంలో జీవిస్తున్న గిరిజనులు ఉలిక్కిపడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

కూంబింగ్‌ను నిలిపివేయాలి

ఇదిలా ఉండగా పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్న దళ సభ్యులను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని, కూంబింగ్‌ను తక్షణమే నిలపాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న పేర ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. అదుపులోకి తీసుకున్న దళ సభ్యులను పోలీసులు ధ్రువీకరించకుండా చిత్రహింసలకు గురిచేస్తున్నారని, గ్రామాల్లో కూంబింగ్ నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చంద్రన్న ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న దళసభ్యులు గత నాలుగు దశాబ్దాలుగా ప్రజాస్వామిక పద్ధతిలో ప్రజల మధ్యలో నిలబడి ప్రజాపోరాటాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యం గా పోడు భూముల సాధన కోసం, తునికాకు రేట్లు పెంపుదల కోసం అవిశ్రాంతంగా పోరాడినట్లు వెల్లడించారు. అంతేకాక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కూడా ఎన్డీ పార్టీ పోరాటాలను సమ రశీలంగా నిర్వహించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కార్యవర్గం

- అధ్యక్ష, కార్యదర్శులుగా జంగా రాఘవరెడ్డి, శ్యాంప్రసాద్ నియామకం



నూతనంగా నియమితులైన ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, మే 19 : ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జంగా రాఘవరెడ్డి, తోట శ్యాంప్రసాద్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆదివారం హనుమకొండ సుబేదారి లోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జంగా రాఘవరెడ్డి ఖోఖో క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. అసోసియేషన్లు, క్రీడాకారుల సంక్షేమం, అభివృద్ధితో పాటు క్రీడలను మరింత ప్రోత్సహించాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం క్రీడాకారులను, క్రీడలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ల బాధ్యులు క్రీడల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించాలన్నారు. జిల్లాలో ఖోఖో క్రీడను అభివృద్ధి చేసి, రాష్ట్రంలో వరంగల్ జిల్లా మొదటి స్థానంలో రాణించేలాగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఖోఖో క్రీడాకారులకు త్వరలోనే తన సొంత నిధులతో మ్యాట్ అందజేస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం, ఎన్నికల ప్రక్రియలో పోటీకి ఎవరూ ముందుకు రాకపోవడంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా తీర్మానించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరీమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాథ్‌కృష్ణమూర్తి, ఎన్నికల పరిశీలకుడు జేపీ విలియమ్స్, మహబూబాబాద్ జిల్లా డీవైఎస్‌వో అనిల్‌కుమార్, అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, వివిధ జిల్లాలకు చెందిన పీఈటీలు, పీడీలు, వివిధ క్రీడల అసోసియేషన్ బాధ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడిగా జంగా రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తోట శ్యాంప్రసాద్, కోశాధికారిగా గట్టుకొప్పుల సురేష్, ఉపాధ్యక్షులుగా కత్తి కుమారస్వామి, కుసుమ సదానందం, ఎం.శ్యాంసుందర్, పి.నరేందర్‌గౌడ్, జి.మల్లయ్య, ఎస్.చందర్, ఎస్.కుమారస్వామి, సీహెచ్ రాంమూర్తి నియమితులయ్యారు. అదే విధంగా సంయుక్త కార్యదర్శులుగా ఎం.రమణ, కోటరాంబాబు, ఎ.శ్రీనివాస్, జి.సదానందం, రాజారపు రమేష్ వీరగోని స్వప్న, జి.సునీత, జి.సుదర్శన్, బొజ్జం రంజిత్, ఈసీ మెంబర్లుగా జి.లక్ష్మీనారాయణ, ఎల్.నాగరాజు, ఎడ్ల రాజు, ఈ. రాజేందర్‌లు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, మే19: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు భవానినగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్, వికాస్‌నగర్, ఎన్జీవోస్‌కాలనీ, సర్క్యూట్‌హౌస్ రోడ్డు, యాదవనగర్, క్రిష్ణకాలనీ, దుర్గాకాలనీ, గౌతమ‌నగర్‌కాలనీ, రెడిపురం, రెడ్డికాలనీ, రాయపురవాడ, లోటస్‌కాలనీ, ఆర్‌ఆర్‌గార్డెన్, మడికొండ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదన్నారు. అదే విధంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, కాకాజీకాలనీ, టైలర్‌స్ట్రీట్, 9 గంటల నుంచి 12 గంటల వరకు చైతన్యపురి కాలనీ, బ్యాంకుకాలనీ, టీచర్స్ కాలనీ ఫేస్-1, రాంపేట, తరాలపల్లి, బ్రహ్మణవాడ, ప్రశాంతి ఆస్పత్రి, నాగులవీధి, కమ్యూనిటీహాల్ ఏరియా, ఇమ్లిపుర, పింజర్లస్ట్రీట్, 9 గంటల నుంచి 11 గంటల వరకు స్నేహనగర్, రాఘవేంద్రనగర్, శ్రీనగర్ కాలనీ, కేథలిక్ చర్చి ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని డీఈ పేర్కొన్నారు.

క్యాండిల్స్ లైట్ మెమోరీ డే



క్యాండీల్స్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మే 19: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కాకతీయ మెడికల్ కాలేజీ మెయిన్‌గేట్ వద్ద ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధర్‌సింగ్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ ద్వారా మరణించిన వారి జ్ఞాపకార్థం యేటా మే 19న వారిని గుర్తు చేస్తూ ఆత్మశాంతి కోసం నివాళులర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ నరసింహారెడ్డి, సర్వోదయ, వర్డ్, మైగ్రేట్స్, వర్డ్ టక్కర్స్, ఆర్‌డీఎంఎం, మ్యారీ, విహాన్, వైఆర్‌జీకే ఎన్‌జీవోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్‌కు అభినందనలు



రియాజ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న బీసీ జాతీయ నేత రాజమొగిలి

సుబేదారి, మే 19: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ రియాజ్‌ను బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని అలీపురలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఏదునూరి రాజమొగిలి మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీసీ సంఘం నేత పి. రవితేజ, సురేష్ తదితరులు ఉన్నారు.

జడ్పీకి నిర్వహణ భారం

(5వ పేజీ తరువాయి)

దిగజారిపోయింది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులు తమ బాధ్యతలు నిర్వహించడం గగనంగా మారింది. ఈ వేసవిలో ఫ్యాన్లు పని చేయకపోవడం, కూలర్లు దెబ్బతినడంతో ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. ఫైల్స్ భద్రతకు అవసరమైన వనరులు లేకపోవడంతో మూటలు కట్టి కార్యాలయ గదుల్లో కుప్పలుగా పడవేసే దుస్థితి నెలకొంది. హనుమకొండ జిల్లా పరిషత్‌కు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని ఆర్థిక భారం ఏర్పడింది. నెలల తరబడి విద్యుత్ బిల్లులు చెల్లింపు లేకపోవడంతో గతంలో విద్యుత్ శాఖ నిలిపివేసిన దాఖలాలు కూడా ఉన్నాయి.

షట్టర్ల ఆదాయమే శరణ్యం

జిల్లా పరిషత్‌కు ప్రస్తుతం ప్రధానంగా షట్టర్ల ద్వారా వచ్చే ఆదాయమే ప్రధానంగా మారింది. జడ్పీ నిర్వహణలో ఐదు షట్టర్లు ఉన్నాయి. వీటి ద్వారా రూ.1.6లక్షలు అద్దె రూపంలో వస్తుంది. స్కావెంజర్లు, స్వీపర్లు, ఎలక్ట్రిషియన్ల వేతనాలకు ఈ ఆదాయం సరిపోవడం లేదు. విద్యుత్ బిల్లులే రూ.50వేల వరకు వస్తున్నాయి. ఇక మిగిలిన సాధారణ ఖర్చులు ఉండనే ఉంటాయి. ఈ క్రమంలో సమకూర్చు ఆదాయం కంటే వ్యయం అధికంగా ఉండడంతో హనుమకొండ జిల్లా పరిషత్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీని ప్రభావం ముఖ్యంగా గ్రామాల్లో అభివృద్ధి పనులను కుంటుపడేస్తున్నాయి.

అభివృద్ధికి నోచుకోని కూరగాయల మార్కెట్

నయీంనగర్‌లో రెండు దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న షెడ్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

పట్టించుకోని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

నయీంనగర్, మే 18: గ్రేటర్ 6వ డివిజన్ నయీంనగర్‌లో 23 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ ఖాళీగా ఉండి నిరుపయోగంగా మారింది. నయీంనగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు తాజా కూరగాయలను అందించాలనే లక్ష్యంతో కార్పొరేషన్ వారు నయీంనగర్ ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో ఈ కూరగాయల మార్కెట్‌ను దాదాపు 60 షెడ్లతో ఏర్పాటు చేశారు. సమగ్ర చిన్నతరహా పట్టణాభివృద్ధి పథకం కింద ఏర్పాటు చేసిన ఈ మార్కెట్‌ను 2001వ సంవత్సరం మార్చి 29న అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ప్రారంభించారు. ఏడాది పాటు కొనసాగిన ఈ మార్కెట్‌కు వినియోగదారులు రావడం తగ్గడంతో వ్యాపారులు మార్కెట్‌లోని తమ దుకాణాలను నిర్వహించడం మానేశారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ మార్కెట్ షెడ్లు దాదాపు రెండు దశాబ్దాల కాలం నుంచి నిరుపయోగంగానే ఉంటున్నాయి. ప్రస్తుతం ఈ మార్కెట్‌లో ఈ-సేవా కేంద్రం, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, పాడి వనరుల సేకరణ కేంద్రం మాత్రమే కొనసాగుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

నయీంనగర్ కూరగాయల మార్కెట్ కోసం నిర్మించిన ఈ షెడ్లు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో ఈప్రాంతంలో మందుబాబులు తాగి చిందేస్తూ స్థానిక నివాస గృహాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాక ఈ ప్రాంతంలో ఆకతాయిలు పేకాట ఆడుతున్నారని, పంచాయితీలు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



2001లో ప్రారంభించిన శిలాఫలకం

పట్టించుకోని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

నయీంనగర్ కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా ఉన్నప్పటికీ దాదాపు రెండు దశాబ్దాల కాలం పాటు మార్కెట్ షెడ్ల వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రాత్రివేళల్లో నయీంనగర్ కూరగాయల మార్కెట్‌లోని ఖాళీ షెడ్లలో ఆకతాయిలు తప్పతాగి గొడవలు చేస్తున్నారని, పోలీసులు ఈ మార్కెట్ వైపు ప్రతీరోజు పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా మహానగర పాలక సంస్థ అధికారులతో పాటు స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి నయీంనగర్ కూరగాయల మార్కెట్‌కు మరమ్మత్తులు చేసి పునఃప్రారంభించి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్ లోపల ఖాళీగా ఉన్న షెడ్లు

బీఆర్‌ఎస్ నుంచి సీపీఎంలోకి భారీగా చేరికలు



బీఆర్‌ఎస్ నుంచి సీపీఎంలోకి చేరిన కార్యకర్తలు

వరంగల్ కార్పొరేషన్, మే 19: హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సీపీఎం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. సీపీఎం పార్టీలోకి కారు ఉపేందర్, బొట్ల కుమారస్వామి, రామంచ సారంగపాణితోపాటు న్యూశాయంపేట, జ్యోతిబసునగర్, పెద్దమ్మగడ్డకు చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు సీపీఎం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సీపీఎం పార్టీ నుంచి గతంలో బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటి సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావులు పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 200 కుటుంబాలు సీపీఎంలో చేరినట్టు జిల్లా నాయకులు వెల్లడించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అధ్యక్షతన పుచ్చలపెల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నాగయ్య, సుదర్శన్ సంయుక్తంగా మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం పూర్తిగా పేద ప్రజలకు అంకితం చేశాడని అన్నారు. ఇలాంటి మహా నేత వర్ధంతి రోజును పురస్కరించుకుని ఇతర పార్టీలకు వెళ్లిన వారు సొంత గూటికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, చుక్కయ్య, వీరన్న, వెంకట్, మంద సంపత్, నిచ్చల్ దీప పాల్గొన్నారు.

అనిశ్రితరెడ్డి నృత్యవసంతం పురస్కారం



నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ బెంగుళూర్‌లో అవార్డు అందుకుంటున్న అనిశ్రితరెడ్డి

వరంగల్ కల్చరల్, మే 19: రెండు రోజులపాటు బెంగుళూర్‌లో నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ నృత్యవసంతం ఘనంగా జరిగింది. ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ వసంత కిరణ్ కూచిపూడి, భరత నాట్యం, నృత్య వసంతం కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డుల ప్రదానం చేశారు. వరంగల్‌కు చెందిన ది టెంపుల్ డ్యాన్స్ విద్యార్థి అనిశ్రిత రెడ్డి కుందూర్ కూచిపూడి సీనియర్ కేటగిరిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ అవార్డును బెంగుళూరులో పద్మభూషణ్ అలార్‌మెల్ వలీ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో మంజు భార్గవి, కాట్రగడ్డ హిమాన్షి, డాక్టర్ వసంత కిరణ్ పాల్గొన్నారు.

డీటీడీవో అవినీతిపై చర్యలు తీసుకోవాలి

న్యూశాయంపేట, మే 19: గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ప్రేమకళ అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీని ఆదివారం హైదరాబాద్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ.. హనుమకొండ, జనగామ జిల్లాల అధికారి అయిన ప్రేమకళ గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టుపట్టించారన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తూ హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రతీ నెల హనుమకొండ, జనగామ జిల్లాల్లో హాస్టల్ డైట్ బిల్లుల్లో 20 శాతం కమీషన్ తీసుకుని పిల్లల హాజరుశాతం వందశాతం వేసుకోండని తనకు అనుకూలంగా ఉన్న వార్డెన్లకు చెపుతూ కోట్ల రూపాయలను అక్రమార్గంగా సంపాదించారని ఆయన అన్నారు. ప్రేమకళపై ఏసీబీ విజిలెన్స్ విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన వారిలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వాసు నాయక్, రాష్ట్ర నాయకులు మూడావత్ నరసింహానాయక్, నూనావత్ హనుమనాయక్, దరావత్ భాషానాయక్‌లు ఉన్నారు.



ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

వర్షం వస్తే ఆగమే..

రహదారులు, డ్రెయినేజీలు అస్తవ్యస్తం

అవస్థలు పడుతున్న జనం

మురుగు కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పట్టించుకోని సంబంధిత అధికారులు

బాలసముద్రం, మే 19: హనుమకొండలో వర్షం కురిస్తే చాలు.. రహదారులు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల డ్రెయినేజీలు, నీటి పైపులైన్ల కోసం తవ్వి పనులు పూర్తి చేయలేదు. రోడ్లు అస్తవ్యస్తంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో వర్షం కురిస్తే బాలసముద్రంలోని శ్రీనివాసకాలనీ, అడ్వకేట్స్ కాలనీ, జితేందర్ సింగ్ కాలనీ, కూరగాయల మార్కెట్ పరిధిలో కాలువలు మట్టితో నిండిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద రావడంతో దిగువ ప్రాంతాల్లో నీళ్లు భారీగా నిలిచి ఇళ్లల్లోకి వస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో వరద ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రణాళికలు సీజన్‌కు ముందు చేపట్టి మురుగు కాలువలలో మట్టిని, ప్లాస్టిక్ వ్యర్థాలను పూడికమట్టిని తొలగించి అవసరమైన చోట నూతనంగా డ్రెయినేజీలు నిర్మిస్తే వర్షం నీరు వరద కాలువల్లో నుంచి వరద పోయో విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బాలసముద్రం పరిధిలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ

డ్రెయినేజీలో పూడిక మట్టిని తొలగించాలి



డ్రెయినేజీ కాలువలో పూడికమట్టిని తొలగించాలి. ఎక్కడపడితే అక్కడ పైపులైన్‌లు లీకై నీరు వృథాగా రోడ్డుపై పారుతున్నా పట్టించుకునేవారు లేరు. ఏకశిలా పార్కు సమీపంలో మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. సంబంధిత అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టాలి.

\- డి.విజయ్‌కుమార్, వ్యాపారి

రోడ్డుపైనే మురుగు నీరు



నగరంలోని కాలువల్లో పూడిక మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి అస్తవ్యస్తంగా మారాయి. కొద్ది వర్షానికే రోడ్డుపై మురుగు నీరు నిలిచి ఇబ్బందులకు గురువుతున్నాం. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

\- ఎస్.వెంకటేశ్వర్‌రావు రిటైర్డ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



సీపీఎంలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న లింగయ్య

ఐనవోలు, మే 19: పుచ్చళ్లపల్లి సుందరయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ముల్కలగూడెం, వెంకటాపురం, ఐనవోలు, గర్మిళ్ళపల్లి, ఒంటిమామిడిపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఆయా గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు గ్రామస్థాయి నాయకులు సీపీఎం పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీ మండల కమిటీ సభ్యుడు కొంకాల నారాయణరెడ్డి అధ్యక్షతన ఒంటిమామిడిపల్లిలో జరిగిన వర్ధంతి సభలో మండల కార్యదర్శి మాట్లాడుతూ.. దక్షిణభారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణాల్లో ఒకరైన పుచ్చళ్లపల్లి సుందరయ్య జీవితం మొత్తం పేదలు, కష్టజీవుల రాజ్యంకోసం కొనసాగిందన్నారు. చిన్ననాటి నుంచే భూస్వామ్య వ్యవస్థ, కులవివక్షకు వ్యతిరేకంగా అందరిని ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గుండెకారి బాబురావు, గబ్బెట రామ్‌కుమార్, నాగరాజు, వరికల్ గోపాల్‌రావు, చిన్న మహేందర్, మాడిగే మానస, ఎల్లమ్మ, బుచ్చమ్మలు పాల్గొనగా మాదాసి ప్రభాకర్, మడిగే నాగరాజు, సుధాకర్‌గౌడ్, గుంశావలి, ఏసిరెడ్డి రాజిరెడ్డి, వెంకటాద్రి కుటుంబాలు సీపీఎం పార్టీలో చేరినట్లు ప్రకటించారు.

తెలుగు బుక్ ఆఫ్ పురస్కార్ అందుకున్న వీరస్వామి

ఖిలావరంగల్, మే 19: తెలుగు బుక్ ఆఫ్ పురస్కార్ అవార్డును 80ఏళ్ల డాక్టర్ అంకతి వీరస్వామి ఆదివారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని మౌలాలీలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతపట్ల ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ వేలు ఆనందచారి, డాక్టర్ ఎన్.గోపాలకృష్ణలు అవార్డును అందజేశారు.

21 మాస్టర్స్ డిగ్రీలు కలిగిన వీరస్వామి, సామాజిక సంస్కర్త, బుర్రకథ, రేడియో, దూరదర్శన్ ఆర్టిస్టుగా బహుముఖ ప్రతి భ కనబర్చారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గురుస్వామి, బి.శివకుమార్, డాక్టర్ టీవి అశోక్ పాల్గొన్నారు.

బైక్‌తో పరార్.. గుంటూరులో ప్రత్యక్షం?

మట్టెవాడ, మే 10: నగరంలో చోరీకి గురైన ద్విచక్రవాహనం గుంటూరు జిల్లాలో ఆంధ్రా పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ ములుగు రోడ్‌లోని యమహా షోరూమ్‌లో హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు రూ.1.50 లక్షలు విలువైన బైక్ కొనుగోలు చేశాడు. బైక్ సర్వీసింగ్ కోసం 9న షోరూమ్‌కు రాగా, అదే సమయంలో నిందితుడు యువకుడితో పరిచయం పెంచుకొని మాయ మాటలతో నమ్మించాడు. బైక్ నడిపి చూస్తాను.. ఫొటో తీయండి.. అని సిమ్ లేని తన మొబైల్ ఇచ్చి బైక్‌తో పరారయ్యాడు. దీంతో 10న బాధితుడు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడు గుంటూరు నగరంలోని ఓ ప్రాం తంలో బైక్‌ను వదిలివెళ్లినట్టు పోలీసులు సమాచారం అందుకుని ఆదివారం పోలీసు బృందం గుంటూరుకు వెళ్లినట్టు తెలిసింది. కాగా, నిందితుడి పైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలు పోలీసుస్టేషన్లలో బైక్ చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. కాగా, బైక్‌తోపాటు నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

న్యూడెమోక్రసీ నాయకులను కోర్టులో హాజరుపర్చాలి

ఖిలావరంగల్, మే 19: పోలీసుల అదుపులో ఉన్న న్యూడెమోక్రసీ నాయకులను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని సీపీఐ-ఎంఎల్, న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. శనివారం రాత్రి వరంగల్ శివారులోని ఆరెపల్లి వద్ద పోలీసులు న్యూడెమోక్రసీ దళ కమాండర్ ఆబర్ల రాజన్న, జీవన్‌లతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిపై ఏమైనా కేసులు ఉంటే వెంటనే వారిని కోర్టులో హాజరుపర్చాలన్నారు. విప్లవోద్యమంపై కొంతకాలంగా ప్రచ్ఛన్న నిర్బంధం కొనసాగుతుందన్నారు.

నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు

• నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

• పట్టించుకోని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు

హసన్‌పర్తి, మే 19: బహిరంగ మలవిసర్జన లేకుండా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వాటి వినియోగం లేక ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. హసన్‌పర్తి మండలంలో 15 గ్రామాలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో ఇంటింటికి మరుగుదొడ్డిని నిర్మించుకున్నారు. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించుకున్నారు. దీంతో హసన్‌పర్తి మండలాన్ని మల విసర్జన రహిత మండలంగా జిల్లా అధికారులు ప్రకటించారు. కానీ గ్రామాల్లో శుభ, అశుభ కార్యాలు, పండుగలు, సంతల నిర్వహణ, గ్రామ దేవతల పండుగల నిర్వహణ జరిగినప్పుడు ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు మలవిసర్జన కోసం ఇబ్బందులు పడుతుంటారని ప్రభుత్వం ఆలోచించింది.

డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్) నిధులతో ప్రతీ గ్రామంలో గ్రామ పొలిమేరల్లో, గ్రామ శివారులో సామాజిక మరుగుదొడ్లను నిర్మించడానికి శ్రీకారం చుట్టింది. 15 గ్రామాలకు గాను, 13 గ్రామాల్లో రూ 1.75 లక్షలతో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. వాటి నిర్వహణను ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించారు. డీఎంఎఫ్‌టీ ఇచ్చిన నిధులు సరిపోక కొన్ని గ్రామాలు తమ సొంత నిధులను కలిపి నిర్మించుకున్నాయి. వాటికి నీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్లను అమర్చారు. కానీ కొత్తగా ఏర్పడిన రెండు గ్రామాలైన హరిశ్చంద్ర నాయక్ తండా, కొత్తపల్లి గ్రామాల్లో మాత్రం మరుగుదొడ్లను ఇంకా నిర్మించలేదు.

నెరవేరని లక్ష్యం

ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం 13 గ్రామాల్లో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నేడు నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణను గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడంతో ఉపయోగంలో లేక పోవడంతో అవి శిథిలమవుతున్నాయి. వాటిలో ఎలుకలు, పంది కొక్కులు, పాములు స్వైరవిహారం చేస్తున్నాయి. కొన్నింటికి తలుపులు కూడా బిగించలేదు. దీంతో బాటసారులు వాటిని వినియోగించుకోవాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే వినియోగంలోకి వస్తాయని గ్రామస్తులు తెలిపారు.



గంటూర్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్డి

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం • 20 మే 2024

సెలబ్ ఫిట్



బొద్దుగుమ్మ

ఒకే ఒక్క చాన్స్ కోసం పరితపించలేదు. 'వెండితెర'పై వెలిగిపోవాలనీ కలలు కనలేదు. విదేశాల్లో చదివి... ఉద్యోగం కోసం ముంబయి వచ్చి... అనుకోకుండా నటి అయింది పరిణీతి చోప్రా. కెరీర్ ఆరంభంలో దూసుకుపోయినా... ఆ తరువాత అపజయాలు ఎదురైనా... ఆమె ఆత్మవిశ్వాసం చెక్కు చెదరలేదు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని ముందుకు సాగే మనోధైర్యం ఇచ్చింది... యోగా, సమతుల ఆహారం అంటుంది పరిణీతి.

విదేశీ విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువు, మార్కెటింగ్ విభాగంలో కొలువు... సినిమా రంగం అనేది అసలు పరిణీతి చోప్రా ఆలోచనల్లోనే లేదు. కెరీర్‌లో భాగంగా అందివచ్చిన అవకాశాన్ని ఆమె సద్వినియోగం చేసుకుంది. హరియాణా అంబాలాలో పుట్టి పెరిగిన పరిణీతి తండ్రి పవన్ చోప్రా వ్యాపారి. తల్లి రీనా గృహిణి. ప్రముఖ నటులు ప్రియాంకా చోప్రా, మీరా చోప్రా, మనారా చోప్రా ఆమె కజిన్స్. అంబాలా 'జీసస్ అండ్ మేరీ కాన్వెంట్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన పరిణీతి చదువులో ముందుండేది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ కావాలని కలలు కన్న ఆమె... 17 ఏళ్ల వయసులో బ్రిటన్ వెళ్లింది. అక్కడి 'మాంచెస్టర్ బిజినెస్ స్కూల్'లో బిజినెస్, ఫైనాన్స్, ఎకనామిక్స్‌లో ట్రిపుల్ ఆనర్స్ డిగ్రీ పొందింది. కొత్తగా వర్సిటీకి వచ్చిన విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు తీసుకొనేది. చదువుకొంటూనే... 'మాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్'లో కేటరింగ్ విభాగం హెడ్‌గా పార్ట్ టైమ్ ఉద్యోగం చేసింది. పరిణీతి మంచి గాయని కూడా. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. సంగీతంలో బీఏ ఆనర్స్ పూర్తి చేసింది. చిన్నతనంలో ప్రియాంకా చోప్రాతో కలిసి పలు వేదికలపై నాటకాలు వేసేది. ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది.

అనుకోని ప్రయాణం...

ఆర్థికమాంద్యం దెబ్బకు 2009లో భారత్‌కు తిరిగి వచ్చిన పరిణీతి... తన నివాసాన్ని ముంబయికి మార్చింది. అక్కడి 'యష్‌రాజ్ ఫిలిమ్స్' (వైఆర్‌ఎఫ్) ప్రొడక్షన్ కంపెనీలో పబ్లిక్ రిలేషన్ కన్సల్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించింది. అదే ఆమె కెరీర్‌ను అనూహ్య మలుపు తిప్పింది. "నేను చదువుకున్నదానికి, నాకున్న సినీ పరిజ్ఞానానికి ఈ ఉద్యోగం సరిగ్గా సరిపోతుందని అనుకున్నా. అయితే 2010లో విడుదలైన 'బ్యాండ్ బాజా బారాత్' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు నాకు బలంగా అనిపించిందేమిటంటే... నటించాలని. ఎప్పుడైతే నటి కావాలన్న ఆకాంక్ష మొదలైందో... ఇక నేను ఆ ఉద్యోగంలో ఉండలేకపోయాను. వైఆర్‌ఎఫ్ క్యాస్టింగ్ డైరెక్టర్‌ను కలిసి విషయం చెబితే... తను సరదాగా డమ్మీ ఆడిషన్ ఒకటి చేయమన్నారు. 'జబ్ వుయ్ మెట్'లో ఓ చిన్న బిట్ చేశాను. దాని గురించి మరిచిపోయాను. తరువాత ఆ వీడియో వైఆర్‌ఎఫ్ అధినేత ఆదిత్య చోప్రా చూసి నాకు కబురు పంపారు. ఆయనకు అది బాగా నచ్చిందట. అంతే... ఒకేసారి మూడు చిత్రాలకు సైన్ చేశాను. అలా నా సినీ కెరీర్ ప్రారంభమవడానికి పరిస్థితులు వాటంతట అవే కలిసివచ్చాయి" అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న పరిణీతి తొలి చిత్రం 'లేడీస్ వర్సెస్ రికీ బహల్'. రణ్‌వీర్‌సింగ్, అనుష్కా శర్మ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా 2011లో విడుదలైంది. అందులో పరిణీతి నటనకు 'ఫిలిమ్‌ఫేర్'తో పాటు పలు అవార్డులు దక్కాయి.

పాత్ర కోసం ఎందాకైనా...

అర్జున్‌కపూర్ తొలి చిత్రం 'ఇషక్‌జాదే'తో కమర్షియల్ హిట్ మాత్రమే కాదు... జాతీయ అవార్డు కూడా అందుకుంది పరిణీతి చోప్రా. కెరీర్ ఆరభంలో హిట్స్ స్వాగతం పలికినా... ఆ తరువాత వరుస ఫ్లాప్‌లు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అయితే ఆమె కుంగిపోలేదు. తనవైపు నుంచి ఎలాంటి లోపం లేకుండా ప్రతి పాత్రకూ వంద శాతం శ్రమిస్తుంది. సినిమాల్లోకి వచ్చేముందు 86 కిలోల బరువున్న ఈ భామ... 28 కిలోలు తగ్గింది. గత ఏడాది రాజకీయ నాయకుడు రాఘవ్ చద్దాను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె... ఈ మధ్య ఓటీటీలో విడుదలైన 'అమర్‌సింగ్ చంకీలా'లో అమర్‌జీత్ పాత్ర కోసం పదిహేను కిలోల బరువు పెరిగింది. మరో ప్రాజెక్ట్ కోసం తిరిగి బరువు తగ్గే పనిలో నిమగ్నమైంది. తన వెయిట్‌లాస్ స్టోరీని ఇన్‌స్టాలో పంచుకుంది. ఈ వీడియో ఎంతోమంది యువతకు స్ఫూర్తినిచ్చింది.

వర్కవుట్ ఇలా...

పరిణీతి చోప్రా నిత్య వ్యాయామాలు కాస్త భిన్నంగా ఉంటాయి. కళరిపయట్టు వంటి మార్షల్ ఆర్ట్స్‌ను తన ఫిట్‌నెస్‌లో చేర్చింది. కళరియపట్టు కోసం ప్రత్యేక శిక్షణ కూడా తీసుకుంది. జిమ్‌లో కసరత్తులు చేస్తూనే... డ్యాన్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, ముఖ్యంగా యోగాకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇండోర్, అవుట్‌డోర్ ఎక్సర్‌సైజ్‌లు కలగలిపి ఉంటాయి. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు వీధుల్లో నడవడం, స్కూబా డైవింగ్‌లు చేయడం... ఏదో రకంగా శరీరానికి తగిన వ్యాయామం అందేలా చూసుకొంటుంది. జీరో సైజుల్లాంటి పేర్లతో బక్కపల్చగా కనిపించడంకంటే... బొద్దుగా అయినా ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యం అంటుంది. అదే దారిలో నడుస్తోంది.

- జిమ్‌కు వెళితే కార్డియో కోసం అరగంట ట్రెడ్‌మిల్. శారీరక దృఢత్వం కోసం వెయిట్‌లిఫ్టింగ్.
- దీంతోపాటు కళరిపయట్టు సాధన. 'ఇలాంటి కొత్త కొత్త కళల అభ్యాసం వల్ల శరీరం బ్యాలెన్స్‌డ్‌గా ఉంటుంది. క్రమంతప్పని వ్యాయామంవల్ల రక్తప్రసరణ మెరుగయ్యి, చర్మానికి ప్రాణవాయువును ఇస్తుంది. తద్వారా చర్మం కాంతిమంతంగా తయారవుతుంది' అనేది పరిణీతి మాట.
- ఉదయం లేదా సాయంత్రం యోగా తప్పనిసరి. 'ఇది అద్భుతమైన వ్యాయామం. యోగా సాధనతో శరీరానికి కావల్సిన శక్తి వస్తుంది. నాజూకైన ఆకృతి సొంతమవుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. చేసే పనిపై ఏకాగ్రత కుదురుతుంది. మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. ఒక్క మ్యాట్ ఉంటే చాలు... ప్రపంచంలో ఎక్కడైనా... ఏ సమయంలో అయినా చేసుకోదగిన వ్యాయామం యోగా' అంటుంది పరిణీతి.
- కొన్ని రోజులు జిమ్‌కు విరామం ఇచ్చి పార్కుల వంటి అవుట్‌డోర్స్‌లో వాకింగ్ చేయడంవల్ల మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంటుందని, శరీరానికి కూడా ఉపశమనం లభిస్తుందని అంటుంది పరిణీతి. రోజు జిమ్‌కు వెళ్లి, శ్రమించాలన్న నియమం ఏదీ లేదని అంటుంది. అలా విరామం ఇచ్చినప్పుడు ఆమె ఎక్కువగా బ్రిస్క్ వాక్ చేస్తుంది.
- తరచూ చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకొని వర్కవుట్ చేస్తే బోర్ కొట్టకుండా ఉంటుందని, ఇష్టమైన క్రీడను ఫిట్‌నెస్ మెనూలో చేర్చుకొంటే ఉత్సాహం రెట్టింపు అవుతుందనేది ఈ స్టార్ ఆచరించి చెబుతున్న ఫిట్‌నెస్ పాఠం.

ఇదీ మెనూ...

'అమర్‌సింగ్ చంకీలా' కోసం పదిహేను కిలోలు పెరిగే క్రమంలో నచ్చిన వెరైటీలన్నీ తినేసింది పరిణీతి. ఇప్పుడు బరువు తగ్గే క్రమంలో ఆహారం విషయంలో ఎన్నో నియమాలు పెట్టుకుంది. మొదటగా తనకు ఇష్టమైన పిజ్జాతో పాటు ఇతర జంక్‌ఫుడ్స్‌ను పూర్తిగా మానేసింది. పోషకాలు పుష్కలంగా ఉన్న, ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే మెనూలో చేర్చింది.

- ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో బటర్‌తో బ్రౌన్ బ్రెడ్, రెండు ఎగ్‌వైట్స్, గ్లాసుడు పాలు లేదా పండ్ల రసం.
- మధ్యాహ్నం లంచ్‌కు పప్పుతో బ్రౌన్ రైస్, రోటీ, ఆకుకూరల వంటకం, సలాడ్.
- రాత్రి రోటీ, పప్పు లేదా పప్పు దినుసులతో చేసిన వంటకం. నిద్రపోవడానికి రెండు గంటల ముందే డిన్నర్ ముగుస్తుంది.



పాఠాలే కాదు... అవసరాలూ తెలుసు..

"ఆరోగ్యవంతమైన సమాజం అంటే అదెక్కడినుంచో రాదు. మన చుట్టుపక్కల ఉన్న వారందరూ ఆరోగ్యంతో ఉంటేనే అది సాకారమవుతుంది" అంటారు రాఖీ గంగ్వార్. స్కూల్ టీచర్ అయిన ఆమె... గ్రామీణ మహిళల్లో ఋతుక్రమ పరిశుభ్రత కోసం మూడేళ్ళ క్రితం ప్యాడ్ బ్యాంక్ ప్రారంభించారు. తన సేవలను యాభై అయిదు గ్రామాల్లో ఇరవై వేలమందికి పైగా విస్తరించారు.

"మహిళల్లో ఋతుక్రమ సమస్యలు చాలా సున్నితమైన అంశం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వాటి గురించి ఇతరులతో మాట్లాడడం అపరాధంగా భావిస్తూ ఉంటారు. ఈ పరిస్థితి మారాలనేది నా తపన. అందుకే నాకు చేతనైనది చేస్తున్నాను" అని చెబుతారు 35 ఏళ్ళ రాఖీ గంగ్వార్. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లా బౌరియాలో... ప్రాథమిక పాఠశాల టీచర్. ఎప్పుడు సెలవు వచ్చినా... గ్రామీణ ప్రాంతాలకు వెళ్తారు. అక్కడ మహిళలతో సమావేశమవుతారు. ఋతుక్రమ ఆరోగ్యం గురించి, పరిశుభ్రత గురించి వివరిస్తారు.



అది ప్రమాదమని వారికి తెలీదు...

"విద్యార్థిగా ఉన్నప్పటి నుంచీ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని" అంటున్న రాఖీ... ఒక దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టారు. చిన్న వయసులోనే తండ్రి మరణించడంతో తల్లి, చెల్లెళ్ళకు ఆమే ఆధారమయ్యారు. "చదువంటే నాకు ప్రాణం. ప్రతి క్లాస్‌లోనూ ఫస్టే... కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా బాగా చదువుకోవాలనేది నా సంకల్పం. అందుకోసం కుట్లు, అల్లికలు, వస్త్రాలమీద పెయింటింగ్స్ ... ఇలా ఎన్నో పనులు చేశాను" అని ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్నో కష్టాలు పడుతూనే ఎంబిఎ, ఎంఎ చదివారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి, ప్రభుత్వ టీచర్‌గా చేరారు. బడికి వచ్చే బాలికలు తరచూ అనారోగ్యానికి గురికావడం ఆమెను కలవరపరచింది. వారిలో చాలా సమస్యలకు కారణం... ఋతుక్రమ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమేనని ఆమె గ్రహించారు. "మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు అందరు



మహిళలు ఆ సమయంలో వస్త్రాలను ఉపయోగిస్తూ ఉంటారు. కానీ వాటిని శానిటైజ్ చేయకపోతే ప్రమాదమని వారికి తెలీదు. సరైన ప్యాడ్స్ ఉపయోగించడం గురించి, ఋతుక్రమ ఆరోగ్యం గురించి ప్రచారం చెయ్యడం అవసరమనిపించింది" అని ఆమె వివరించారు. మొదట... తన విద్యార్థుల తల్లులతో, గ్రామంలోని మహిళలతో ఆమె ఒక సర్వే జరిపారు. "చాలామంది ఆ విషయం మాట్లాడడానికి ఇష్టపడలేదు. శానిటరీ ప్యాడ్స్ వారికి అందుబాటులో లేవు. ఎక్కువమందిని ఒక చోటికి చేర్చి చర్చిస్తే... వారిలో బెరకు పోతుందని నిర్ణయించుకున్నాను" అని చెప్పారు రాఖీ.

కాస్త కష్టమే, కానీ...

తొలి ప్రయత్నంగా... దాదాపు యాభై మంది మహిళలతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఋతుక్రమ సమయంలో పరిశుభ్రత లేకపోతే... ఆరోగ్యానికి ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించారు. తమ బడిలోనే శానిటరీ 'ప్యాడ్ బ్యాంక్' ఏర్పాటు చేసి... గ్రామంలోని మహిళలందరికీ అవి ఉచితంగా అందేలా చూశారు. ఆమె చేపట్టిన కార్యక్రమాలు పక్క గ్రామాల మహిళలనూ ఆకర్షించాయి. వారి కోరిక మేరకు అక్కడా ఆమె ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం 55 గ్రామాల్లో 20 వేల మందికి పైగా మహిళలకు, బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నారు. ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వైద్యులు, కౌన్సెలర్లు, వాలంటీర్లతో బృందాలను ఏర్పాటు చేశారు. వారు గ్రామాల్లో మహిళలకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. "చాలాకాలం సొంత డబ్బులతోనే ఇవన్నీ చేశాను. నా భర్త, కుటుంబం కూడా అండగా నిలిచారు. ఆ తరువాత... నేను చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకొని... గోరఖ్‌పూర్‌కు చెందిన శానిటరీ ప్యాడ్ తయారీ సంస్థ సాయం చెయ్యడానికి ముందుకు వచ్చింది. గ్రామాల్లో కొందరు విరాళాలు కూడా ఇస్తున్నారు. స్కూలు పనులు, ఇంటి పనులు, ప్రచారం, గ్రామాల్లోని వాలంటీర్లతో సమన్వయం... ఇవన్నీ చూసుకోవడం కాస్త కష్టమే. కానీ ఈ పనుల్లో నాకు ఎంతో సంతోషం, సంతృప్తి లభిస్తున్నాయి. మా ప్యాడ్ బ్యాంక్ సేవలను మరిన్ని గ్రామాల్లోని మహిళలకు అందించాలనే ప్రేరణ కలిగిస్తున్నాయి" అంటారు రాఖీ.

వైరల్

ఆమెకు ఆకాశమే హద్దు

జీవితమంటేనే నిత్య పోరాటం. సమస్యలు, సవాళ్లు అందులో భాగం. ఇది రాధాకుమారికి చిన్నప్పుడే అర్థమైంది. ఆమెది బిహార్ రాజధాని పట్నా. పుట్టుకతోనే పోలియో మహమ్మారి రాధాకుమారి జీవితాన్ని చక్రాల కుర్చీకే పరిమితం చేసింది. అయినా ఆమె తన వైకల్యాన్ని సాకుగా చూపి ఇంట్లోనే కూర్చోవాలని అనుకోలేదు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆశావహ దృక్పథంతో ముందడుగు వేయడం అలవాటు చేసుకున్నారు.



పోలియో తన జీవితాన్ని శాశించకూడదని నిర్ణయించుకున్నారు. పట్టుదలతో ప్రయత్నించి ఫుడ్ డెలివరీ యాప్ 'జొమాటో'లో ఉద్యోగం సంపాదించుకున్నారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి ఫుడ్ డెలివరీ చేస్తున్నారు. అందరిలా నడవలేకపోతున్నందుకు రాధాకుమారి ఎన్నడూ బాధపడలేదు. చక్రాల కుర్చీని కేవలం తన పనులు తాను చేసుకోవడానికే కాకుండా... తన కాళ్లపై తాను నిలబడడానికి ఒక ఆధారంగా మలుచుకున్నారు. 'జానో జంక్షన్' అనే యూట్యూబ్ చానల్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె వీడియోను పోస్ట్ చేశారు. అందులో రాధాకుమారి తన కథను అందరితో పంచుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో లక్షల మందిని కదిలించింది. చూసినవారు ఆమెను అభినందనలతో ముంచెత్తుతున్నారు. చేసే పనిపట్ల ఆమె అంకితభావానికి, చెదరని ఆత్మావిశ్వాసానికి సెల్యూట్ కొడుతున్నారు. 'మీ నుంచి మాకు స్ఫూర్తి కావాలి' అంటూ రాధాకుమారిని కొనియాడారు.

'మీ పనులన్నీ మీరే చేసుకొంటున్నారు. సాధారణ వ్యక్తులతో పోటీపడి మరీ ఉద్యోగం చేస్తున్నారు. ఇవన్నీ ఎలా సాధ్యం' అని అడిగితే... 'జీవితం అనేది ఉంటే... దాంతోపాటే సమస్యలూ ఉంటాయి' అంటూ చిరునవ్వుతో సమాధానమిస్తారు రాధా కుమారి.

ఆమె అద్భుతమైన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కూడా. ఈ ఏడాది జంషెడ్‌పూర్‌లో జరిగిన 'జాతీయ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్'లో బిహార్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 'తద్వారా నాలాంటి వికలాంగులకు ప్రేరణగా నిలవాలన్నదే నా కోరిక' అంటారు రాధాకుమారి.

నవ్య | చిత్రజ్యోతి

అందరి మన్ననలు అందుకుంటాడు

పాపులర్ కమెడియన్ గెటప్ శ్రీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ నెల 24న 'రాజుయాదవ్' విడుదలవుతోంది. సినిమా



ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం గెటప్ శ్రీను మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రబృందానికి శుభాకాంక్షలు అందజేస్తూ ఓ వీడియోను షేర్ చేశారు.

"ఈతరం కామెడీ నటుల్లో నాకు బాగా ఇష్టమైన నటుడు గెటప్ శ్రీను. ఈ సినిమా ట్రైలర్ చాలా బావుంది. శ్రీనుని చూస్తుంటే నాకు కామెడీ హీరో చలం గుర్తుకువస్తారు. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను. అలాగే తన నటనతో గెటప్ శ్రీను కూడా అందరి మన్ననలు అందుకుంటాడు" అని పేర్కొన్నారు.

సూపర్ స్టార్ బుజ్జి



ప్రభాస్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏ.డీ'. జూన్ 27న విడుదలవుతున్న ఈ మూవీ కోసం చిత్ర బృందం ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. ఇటీవలే ప్రభాస్ "డార్లింగ్స్ మీ జీవితాల్లోకి ఒక కొత్త వ్యక్తి రాబోతున్నాడు" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సస్పెన్స్‌ను మరింత పెంచుతూ ప్రభాస్ తర్వాత పోస్టులో "నా బుజ్జిని పరిచయం చేసేందుకు ఎదురుచూస్తున్నా" అని అభిమానుల్లో మరింత ఆసక్తిని క్రియేట్ చేశారు. శనివారం చిత్ర బృందం ఈ సస్పెన్స్‌ను తెరదించుతూ "ఫ్రం స్క్రాచ్ ఎపిసోడ్-4 బిల్డింగ్ ఏ సూపర్ స్టార్ బుజ్జి' పేరుతో ఓ వీడియో రిలీజ్ చేసింది. ఈ వీడియోలో ఓ చిన్న రోబోను అందరూ బుజ్జి అని పిలుస్తుంటారు. బుజ్జి పాత్రకు కీర్తి సురేశ్ వాయిస్ అందించడం విశేషం. ఇందులో బుజ్జి బ్రెయిన్ రోబోలో ఉండగా, బాడీ మాత్రం ఓ కారులో ఉంటుంది. ఆ కారునే ఈ వీడియోలో తయారు చేస్తుంటారు. బుజ్జి తనకు బాడీ లేదని బాధపడుతూ ఉంటే.. బుజ్జి బాడీని ప్రభాస్ రివీల్ చేసేటప్పుడు వీడియో ముగుస్తుంది. ఈ బుజ్జి రోబో గురించి మరిన్ని విశేషాలని మే 22న తెలియజేస్తామని చిత్ర బృందం ప్రకటించింది. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తుండగా అశ్వనీ దత్ నిర్మిస్తున్నారు.

జూలైలో వస్తున్న భారతీయుడు 2

'విక్రమ్' సినిమా తర్వాత కమల్‌హాసన్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్ర దర్శకుడు శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. జూలై 12న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు కమల్ హాసన్ ఆదివారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. జూన్ 1న ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించనున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎ.శ్రీకర ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవివర్మన్, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.




సూపర్ ఎలివేషన్స్‌తో 'ఫియర్'



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కోసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' అక్టోబర్ 10న విడుదలవుతోంది. సోమవారం తారక్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'ఫియర్' పేరుతో రిలీజైన ఈ రాప్ సాంగ్ ఎన్టీఆర్ పాత్రకు సూపర్ ఎలివేషన్స్ ఇచ్చింది. అద్భుతమైన విజువల్స్, పవర్‌ఫుల్ లిరిక్స్‌తో సాగిన ఈ సాంగ్ సినిమాపై మరిన్ని అంచనాలు పెంచేసింది. రామజోగయ్యశాస్త్రి ఈ పాటను రచించగా, అనిరుధ్ రవిచందర్ పాటకు మ్యూజిక్ అందించి, ఆలపించారు.


సంక్రాంతికి సిద్ధం

అజిత్‌కుమార్ కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీస్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం యూనిట్ ఈ చిత్రం నుంచి అజిత్ పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడంతో పాటు రిలీజ్‌డేట్‌ను ప్రకటించింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఫస్ట్‌లుక్‌లో మూడు డిఫరెంట్ వేరియేషన్స్‌లో అజిత్ మేకోవర్ అదిరిపోయింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అభినందన్ రామానుజం.



అంతరంగాన్ని ఆవిష్కరించేలా...

దివంగత సినీ గేయ రచయిత, సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళిగా రూపొందిన కార్యక్రమం 'నా ఉచ్వాసం కవనం'. సిరివెన్నెల పాటల అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ టీవీ షో పరిచయ కార్యక్రమం ఇటీవలే హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు కృష్ణవంశీ ఈ కార్యక్రమం టీజర్‌ను ఆవిష్కరించారు. సీతారామశాస్త్రిగారి మాట, పాట అందరికీ చేరాలని మేము చేసిన చిన్న ప్రయత్నమే ఈ కార్యక్రమం అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీరామ్ చెరువు చెప్పారు. ఈ కార్యక్రమంతో శాస్త్రిగారి మాట, పాట విస్తృతంగా ప్రేక్షకుల చెంతకు చేరాలని సీనియర్ జర్నలిస్ట్ ప్రభు ఆకాంక్షించారు.



టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశం 1980 తరవాత ప్రత్యేకించి 1990 తరవాత సుస్థిరమైన అధికవృద్ధి రేటును నమోదు చేసింది. 2000 సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఈ రేటు మరింత ఎక్కువగా నమోదైంది. కొన్నిసార్లు అది 8 శాతాన్ని కూడా దాటింది. అయితే 2008 తరవాత ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల అది క్రమేణా తగ్గి కొవిడ్ కాలంలో పూర్తిగా కుంగిపోయింది. ఇప్పుడు మరలా కోలుకుని అతి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సగటున ఆరు శాతం వార్షిక వృద్ధిని భారత ఆర్థికవ్యవస్థ నమోదు చేయడం విశేషం.

రాబోయే 15 సంవత్సరాలు భారత ఆర్థికవ్యవస్థ సగటున 5 నుంచి 6 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇటీవల భారతప్రభుత్వ అంచనాల ప్రకారం భారత ఆర్థికవ్యవస్థ 2022లో 7.3శాతం, 2023లో 7.2 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసింది. 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి గల దేశంగా అవతరించగలదనే అంచనాలు ఉన్నాయి. 1990 తరవాత భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా ప్రపంచీకరణ పొందింది. 1984లో భారత స్థూల దేశీయోత్పత్తిలో వస్తుసేవల ఎగుమతుల విలువ 6.3 శాతం ఉండగా, 2022లో 22 శాతానికి చేరింది. అధిక ఆర్థికవృద్ధి రేటు నిరపేక్ష పేదరికాన్ని తగ్గించి, జీవన ప్రమాణాలను పెంచిందని చెబుతున్న మానవాభివృద్ధి సూచికలోనూ, తలసరి ఆదాయంలోనూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2024 ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం జి.20 దేశాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల దేశంగా భారత్ ఉంది. ఉదాహరణకు భారత ప్రజల తలసరి ఆదాయం కొనుగోలు శక్తి ఆధారిత స్థూల జాతీయాదాయం ప్రకారం 8,210 డాలర్లు కాగా అమెరికా ప్రజల తలసరి ఆదాయం 77,530 డాలర్లు. చైనా తలసరి ఆదాయం 21,250 డాలర్లు. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ప్రజల తలసరి ఆదాయం 2601 డాలర్లు, కొనుగోలు శక్తి ఆధారిత విలువ ప్రకారం 9,073 డాలర్లు.

ఇండియన్ ఎకానమీ



ఇండియా శ్రామిక మార్కెట్

ఈవిధంగా ఆర్థికవ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నా, ప్రపంచ అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ముందు స్థానానికి ఎగబాకుతున్నా మానవాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటానికి పెరుగుతున్న వృద్ధి ఆర్థికవ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని విప్లవాత్మకంగా మార్చకపోవడమే కాకుండా, సేవలరంగ మూలధన ఆధారిత వృద్ధిగా ఉండి ఉపాధి అవకాశాలను తగినంతగా సృష్టించడంలో విఫలమవడమే కారణం.

ఉపాధి నిర్మాణ స్వరూపాన్ని మార్చలేని అధిక ఆర్థికవృద్ధిరేటు

పైన తెలిపిన అధిక ఆర్థికవృద్ధి రేటు ఉపాధి నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో విఫలమైంది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి శాతం చాలా తక్కువ రేటుతో స్థిరంగా తగ్గగా, సేవలరంగంపై ఆధారపడిన వారి శాతం తక్కువ రేటుతో స్థిరంగా పెరిగింది. పారిశ్రామికరంగంపై ఆధారపడిన వారి శాతం దాదాపు స్థిరంగా ఉంది. 2000లో వ్యవసాయరంగం మీద ఆధారపడిన వారు 60 శాతం ఉండగా, 2019లో 42 శాతం ఉన్నారు. అదేకాలంలో సేవలరంగంపై ఆధారపడినవారు 23 శాతం నుంచి 32 శాతానికి పెరగ్గా, వస్తు తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్)లో 12 నుంచి 14 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ఇదేకాలంలో క్రమబద్ధమైన(రెగ్యులర్) ఉపాధి పొందుతున్న వారి శాతం 2000 సంవత్సరంలో 14 శాతం ఉండగా 2019 నాటికి 21 శాతంగా, సంఘటితరంగంలో పనిచేస్తున్న వారి శాతం 2000లో 12 శాతం ఉండగా, 2019లో 18 శాతంగా ఉంది. అయితే మొత్తం కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు(సంఘటిత - అసంఘటిత రంగంలో గల అసంఘటిత కార్మికులు)గా ఉండటం గమనార్హం. అంతేకాకుండా మొత్తం ఆదాయంలో కార్మికుల ఆదాయ శాతం 2019లో కూడా 2000 సంవత్సరం కంటే ముందరి స్థాయిలోనే ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక పేర్కొంది.



తక్కువస్థాయి-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలతో ఇండియా శ్రామిక మార్కెట్

ఇండియా ఆర్థిక వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నా, ఇండియా అతిపెద్ద ఆర్థికవ్యవస్థ సరసన చేరుతున్నా ఇండియా శ్రామిక మార్కెట్ మాత్రం తక్కువ-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలను కలిగి ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక తెలిపింది. కింది లక్షణాలను ఉదాహరణగా పేర్కొన్నది.

1. అభివృద్ధి చెందిన దేశాలు ఆరంభంలో పారిశ్రామికరంగం వృద్ధిలో ప్రధానంగా అభివృద్ధి చెందగా, ఇండియా మాత్రం సేవలరంగం సహాయంతో అధిక వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన జనాభా క్రమంగా తగ్గి అది పారిశ్రామిక రంగంలో కాకుండా సేవలరంగంలో ఉపాధి పొందుతున్నది. అయితే స్థూల దేశీయోత్పత్తిలో సేవలరంగం వాటా 55 శాతం ఉండగా, ఉపాధిలో మాత్రం దీని వాటా 23 శాతంగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 14 శాతం ఉండగా, వస్తువుల తయారీరంగం(మాన్యుఫ్యాక్చరింగ్) వాటా 18 శాతంగానే ఉంది.
2. రెండు - మూడు శాతం ఉన్న బహిరంగ నిరుద్యోగం 2019 నాటికి 5.8 శాతానికి చేరడం.
3. కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండటం. సంఘటితరంగంలో కూడా పెద్ద మొత్తంలో అసంఘటిత కార్మికుల నిష్పత్తి ఉండటం. మొత్తం కార్మికుల్లో 50 శాతం స్వయంఉపాధి పొందుతున్న వారు ఉండటం.
4. లింగపరంగా, ప్రాంతాల వారీగా, వృత్తులవారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, స్థానికత ఆధారంగా ఉపాధి అవకాశాల్లో, వేతనాల్లో పరిమితులు ఉండటం.
5. 2022లో మహిళా శ్రామికుల భాగస్వామ్యం రేటు కేవలం 25 శాతంగా ఉండటం. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా శ్రామిక భాగస్వామ్యం ఉన్న ప్రపంచ దేశాల సరసన భారతదేశం ఉంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే




నాణేనికి బొమ్మ బొరుసు ఉన్నట్లుగానే ప్రతీదానికి లాభనష్టాలు ఉంటున్నాయి. ఒకవైపు పర్యాటక రంగం అద్భుతమైన రంగంగా విస్తరించి అపార ఉపాధి అవకాశాలను కల్పిస్తుండగా, అతి పర్యాటకం కారణంగా పర్యావరణానికి అపార నష్టం కలుగుతోంది. ప్రపంచీకరణ తరవాత చాలా దేశాల్లో ప్రజల ఆర్థిక స్థోమత పెరిగింది. పాశ్చాత్య వినియోగ, వినోద సంస్కృతి కూడా మధ్యతరగతి ప్రజల వరకూ విస్తరించింది. విహార యాత్రలు, తీర్థయాత్రలు పెరిగి పర్యాటకరంగం విస్తరించింది. తద్వారా పర్యాటకరంగంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఆతిథ్య, రవాణా రంగాల్లో అపార అవకాశాలను సృష్టించగల పర్యాటక రంగాన్ని సన్‌రైజ్ సెక్టార్(వేగంగా అభివృద్ధి చెందే అవకాశమున్న రంగం)గా ప్రభుత్వాలు గుర్తించాయి. పర్యాటక వీసా నిబంధనలను సులభతరం చేయడం, ప్రత్యేకంగా ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి వినూత్న కార్యక్రమాలు, పథకాలు చేపట్టడం లాంటి చర్యలు తీసుకున్నాయి. అంతేస్థాయిలో దీనికి ప్రతికూల చర్యలు జరుగుతున్నాయి.

సుస్థిర పర్యాటకం మేలు

సోషల్ మీడియా రాకతో ప్రపంచం ఒక కుగ్రామం అయింది. వింతలు, విశేషాలు, ప్రకృతి సోయగాలు ప్రతీ ఒక్కరి కళ్ల ముందుకు వచ్చి పర్యాటకంపై ఆసక్తిని పెంచాయి. దీనితో స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకరంగం విస్తరించి, చాలా దేశాల జీడీపీ(జాతీయాదాయం)లో ఒక గణనీయమైన వాటాను అందిస్తోంది. మాల్దీవులు, సీషెల్స్, జమైకా, ఫిజి వంటి దేశాలైతే చాలావరకు టూరిజంపైనే ఆధారపడ్డాయి. వాటి జాతీయాదాయంలో దాదాపు సగభాగం పర్యాటకరంగం, దాని అనుబంధ రంగాల నుంచే ఈ దేశాలకు చేకూరుతోంది. భారతదేశ జీడీపీలో కూడా పర్యాటకరంగం 6.8% వాటాను సమకూరుస్తూ 194 బిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఉంది. 40 మిలియన్ల(నాలుగు కోట్ల) ఉపాధి అవకాశాలను అందిస్తోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే పర్యాటకరంగం 2023లో ప్రపంచ జీడీపీలో 9.1% వాటా సమకూర్చింది. ఈ సంవత్సరం కొత్తగా 27 మిలియన్ల(2.7 కోట్ల) ఉపాధి అవకాశాలు కల్పించింది. ప్రపంచ పర్యాటకరంగం ఏటా 3.7% చొప్పున పెరగనుందని వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ అంచనా. ఇది మరిన్ని ఉపాధి అవకాశాలను, ఆదాయాన్ని ప్రపంచ దేశాలకు చేకూర్చనుంది.

సమస్యలు



ఆదాయం, ఉద్యోగ కల్పనల మాట అటుంచితే పర్యాటకరంగం అనేక సమస్యలను మూటగట్టుకొని వస్తోంది. ఇముడ్చుకోలేని స్థాయిలో పర్యాటకలు వస్తున్న కారణంగా ఆయా ప్రాంతాలు ఓవర్ టూరిజం(పర్యాటక ఒత్తిడి)కి గురవుతున్నాయి. ఉదాహరణకు భారతదేశంలోని లడఖ్, ఇటలీలోని వెనీస్ వంటి పర్యాటక ప్రాంతాలు అక్కడ ఉన్న స్థానిక జనాభా కన్నా, అనేకరెట్లు పర్యాటకులు వచ్చి చేరడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. తాగునీరు, పారిశుధ్యం, రవాణా, ఆహార పదార్థాలు, విద్యుత్, నివాస ప్రదేశాల వంటి వాటిపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. దాంతో స్థానికులకు కనీస అవసరాల కొరత ఏర్పడుతోంది. డిమాండ్ కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి స్థానికుల జీవన వ్యయాలు భారీగా పెరిగిపోతున్నాయి. సప్లయ్ చైన్‌లు పటిష్ఠంగా లేని కొండ ప్రాంతాలు, దీవుల ప్రాంతాలు వంటి ప్రదేశాల్లో ఈ దుస్థితి మరింతగా స్థానికులను వేధిస్తోంది. అంతేకాక పర్యాటకం కారణంగా స్థానికులకు వ్యవసాయ భూముల కొరత ఏర్పడి వారి జీవన విధానాలు, సాంప్రదాయక విజ్ఞానం నశిస్తోంది.

ప్రమాదంలో పర్యావరణం

వాతావరణ, భౌగోళిక సున్నితత్వం గల ప్రాంతాల్లో పర్యాటకం పెరగడం వల్ల మౌలిక సదుపాయాల విస్తరణ(రోడ్లు, హోటళ్లు, విద్యుత్, భవన నిర్మాణాలు మొదలైనవి)తో అక్కడి పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతోంది. ఉదాహరణకు ఉత్తరాఖండ్‌లో ఇటీవల మౌలిక సదుపాయాల విస్తరణ వల్ల అక్కడి సున్నితమైన అమరిక గల భూమి పొరలపై ఒత్తిడి ఏర్పడి భూమి కుంగిపోతుండటం, హిమాలయ ప్రాంతాల్లో పెరిగిన పర్యాటక ఒత్తిడి, కాలుష్యం కారణంగా హిమనీనదాలు వేగంగా కరిగిపోతుండటం, అకస్మాత్తుగా కుంభవృష్టి సంభవించడం వంటి అనేక విపత్తులను ఇటీవల చూశాం. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర హిల్‌స్టేషన్లలో వరదలు తరచుగా సంభవిస్తున్నాయి. అంతేకాక ఈ పర్యాటక తాకిడి వల్ల ప్రసిద్ధ పర్యాటక క్షేత్రాల్లోని కట్టడాల మనుగడకు ప్రమాదం ఏర్పడుతోంది. స్థానిక ప్రజల సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జీవన శైలులపై పాశ్చాత్య ప్రభావం పడుతోంది. దాంతో వారు విలక్షణతను కోల్పోతున్నారు. పర్యాటక తాకిడి వల్ల వ్యర్థాల నిర్వహణ కూడా కష్టమవుతోంది. నదులు, అడవులు, పర్యాటక ప్రాంతాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. లఢాక్ వంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి.

రివేంజ్ టూరిజం

రవాణా సాధనాలు, వ్యక్తిగత వాహనాల రద్దీ కారణంగా ఈ ప్రాంతాల్లో వాయు కాలుష్యం మిన్నంటుతోంది. వెరసి అతి పర్యాటకం ఆయా పర్యాటక ప్రాంతాల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది. కొవిడ్ కాలంలో గృహాలకే పరిమితమైన ప్రజలు, కొవిడ్ అనంతరం 'రివేంజ్ టూరిజం' ధోరణిలో మరింతగా యాత్రలకు ఆసక్తి చూపడంతో పర్యాటక రద్దీ మరింత పెరిగింది. వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచ పర్యాటకుల సంఖ్య రెండు బిలియన్లు(రెండువందల కోట్లు)కు చేరవచ్చని అంచనా.

అయితే పర్యాటక ప్రాంతాలు, వాటి విస్తీర్ణం మాత్రం ఇంచువిఇంచు అవే ఉంటాయి. కాబట్టి పర్యాటక వాతావరణ కాలుష్యం ఆ ప్రాంతాల మనుగడకు మరింత ముప్పును ఏర్పరిచే అవకాశం ఉండటంతో ప్రస్తుతం సుస్థిర పర్యాటక నినాదం మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

సుస్థిర పర్యాటకం అంటే 'సందర్శకుల, పర్యాటకరంగ, పర్యావరణ, స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత, భవిష్యత్తు, ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రభావాలతో బేరీజు వేస్తూ సంయమనం పాటించే విధానం అని యునైటెడ్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ నిర్వచించింది.

ఈ చర్యలు అవసరం

ప్రస్తుత ఓవర్ టూరిజం వల్ల సమస్యలను, స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసనను ఎదుర్కొంటున్న అనేక యురోపియన్ దేశాలు, జపాన్, భూటాన్ ఈ సుస్థిర పర్యాటక విధానాల దిశగా పయనిస్తున్నాయి. వెనీస్, భూటాన్ విదేశీ పర్యాటకుల నుంచి తమ ప్రాంతాల పరిరక్షణ నిమిత్తం పర్యాటక రుసుము వసూలు చేస్తుండగా, ఆమ్‌స్టర్‌డామ్‌లో క్రూయిజ్ షిప్‌లను నిషేధించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక గ్రీస్‌లోని పర్యాటక ప్రదేశాల్లోకి రోజూ నిర్ణీత సంఖ్యలో మాత్రమే పర్యాటకులను అనుమతిస్తున్నారు.

ఇక జపాన్ ఓవర్ టూరిజాన్ని అరికట్టడానికి పర్యాటక ప్రాంతాలను విస్తరిస్తోంది. పర్యాటక ఆకర్షక ప్రాంతాలను కొత్తగా అభివృద్ధి చేస్తోంది. మౌంట్‌ఫూజీకి ఉన్న అద్భుతమైన వ్యూ పాయింట్ కారణంగా దాని పర్వతపాద ప్రాంతంలో ఒక చిన్న రిసార్ట్ విలేజ్‌లో పెరిగిన ఓవర్ టూరిజాన్ని అరికట్టడానికి మౌంట్ ఫూజీ వ్యూను భగ్నం చేసేలా ఒక ఎత్తయిన గోడను నిర్మిస్తోంది. మౌంట్ ఫూజీని చూడాలనుకున్న వారికి ఇతర ప్రాంతాల నుంచి చూసే అవకాశాలను కల్పిస్తోంది. భారీగా పర్యాటక రుసుములూ వసూలు చేస్తోంది. జపాన్. బాలీ ప్రాంతంలో విదేశీ పర్యాటకుల కారణంగా భగ్నమవుతున్న సంస్కృతిని పరిరక్షించడానికి, పర్యాటక పుణ్యక్షేత్రాల పవిత్రతను కాపాడటానికి ఆయా ప్రాంతాల్లో వస్త్రధారణ, పవిత్రస్థలాల్లో వ్యవహరించాల్సిన తీరులపై ఇండోనేషియా ప్రత్యేక ఆంక్షలు విధించింది.

అంతేకాక అనేక యురోపియన్ పర్యాటక ప్రాంతాల్లో కొత్తగా హోటళ్ల నిర్మాణం, సెల్ఫీల కోసం ఎక్కువ సమయం ఒక ప్రాంతంలో ఆగడం, టూరిస్ట్‌లు వ్యక్తిగత వాహనాలను వినియోగించడంపై నిషేధాలున్నాయి. భారీస్థాయిలో జరిమానాలూ విధిస్తున్నారు. అయితే ఇప్పటికే సిమ్లా, జోషీమఠ్ వంటి ప్రాంతాల్లో తీవ్ర పర్యాటకపరమైన నష్టాన్ని చవిచూసినా భారతదేశంలో నిర్దిష్టమైన సుస్థిర పర్యాటక ప్రణాళికలు పట్టాలకెక్కలేదు. కేవలం వివిధ ప్రాంతాల్లో గనులు, టన్నెల్స్ తవ్వకాలు, భారీ ప్రాజెక్టుల నిర్మాణం వంటి వాటిపై నిషేధాలు విధించారు. వినిస్ట్రీ ఆఫ్ టూరిజం ఒక దార్శనిక ప్రచార కార్యక్రమమైన 'నేషనల్ స్ట్రాటజీ ఫర్ సస్టెయినబుల్ టూరిజం అండ్ రెస్పాన్సిబుల్ ట్రావెలర్ కాంపెయిన్'ను ప్రజల్లో, పర్యాటకుల్లో అవగాహన పెంచే నిమిత్తం ప్రారంభించింది. పర్యావరణ సుస్థిరత పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం, ఆర్థిక సుస్థిరతను నెలకొల్పడం, సాంఘిక - సాంస్కృతిక సుస్థిరత, సుస్థిర పర్యాటక రంగానికి సంబంధించి కెపాసిటీ బిల్డింగ్, గుర్తింపునిచ్చే స్కీమ్‌ను ఆరంభించడం ఈ ప్రచార కార్యక్రమంలో ముఖ్య అంశాలుగా ఉన్నాయి.

అయితే భారతదేశంలో పర్యాటకరంగాన్ని పెంపొందించడానికి ఇంక్రెడిబుల్ ఇండియా, అతిథి దేవో భవ వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వం.. పర్యాటకరంగ సుస్థిరతకు, పర్యావరణ పరిరక్షణకు సుస్థిర పర్యాటకపరమైన పాలసీలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ దిశగా విధివిధానాల రూపకల్పనలో కొన్ని మార్గదర్శక ప్రమాణాలు అనుసరించాల్సి ఉంది.

మార్గదర్శకాలు

1. **ఒక ప్రాంత క్యారియింగ్ కెపాసిటీ నిర్ధారణ:** అనగా ఒక ప్రాంతం ఎంతమందికి ఆవాసయోగ్యంగా ఉంటుంది, అక్కడి వనరులు ఎంతమంది అవసరాలను తీర్చడానికి సరిపోతాయి, ఆ ప్రాంత చారిత్రక నిర్మాణాలు, భౌగోళిక-పర్యావరణపరమైన పరిస్థితులకు భంగం కాకుండా ఎంతమంది పర్యాటకులను అనుమతించగలం అన్న విషయాలపై కచ్చితమైన పరిశోధన జరిపి ప్రభుత్వాలు ఒక నిర్ధారణకు రావాలి.
2. **సుస్థిరతా బేరీజు(సస్టెయినబుల్ అకౌంటింగ్):** అనగా ఒక ప్రాంతంలోకి సందర్శకులను అనుమతించడం ద్వారా ఆ ప్రాంత పర్యావరణం, వనరులపరంగా, మౌలిక సదుపాయాల ఏర్పాటుపరంగా జరిగిన నష్టం/వ్యయంతో ఆ పర్యాటకుల ద్వారా సమకూరిన ఆదాయాన్ని బేరీజు వేయడం. ఎంత స్థానిక ప్రజలకు దక్కిందో అంచనా వేయడం. ఇది ఆ ప్రాంత లాభనష్టాలపరంగా మాత్రమే బేరీజు వేయాలి. టూరిస్ట్ ఆపరేటర్లు, హోటల్స్ నిర్వాహకుల లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఆదాయ వ్యయాలను లెక్కించరాదు.
3. **బాధ్యతాయుత పర్యాటకం:** పర్యాటకులకు వ్యర్థాల పారబోత, సందర్శనీయ స్థలాల్లో వ్యవహరించాల్సిన తీరుతెన్నులు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగం తదితర అంశాలపై కచ్చితమైన నియమ నిబంధనలు ఏర్పాటుచేయాలి. అపరాధ రుసుములు పటిష్ఠంగా వసూలు చేయాలి. అదేవిధంగా స్థానిక ఆతిథ్యరంగ, రవాణరంగ నిర్వాహకులు సుస్థిర ప్రమాణాలు పాటించేలా, నిర్వహణ ప్రమాణాలపరంగా ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా కచ్చితంగా పటిష్ఠ ఆంక్షలు ఉండాలి. సుస్థిర పర్యాటక గుర్తింపులు జారీచేసి వాటిని పొందడం తప్పనిసరి చేయాలి.
4. **స్థానిక ప్రజల భాగస్వామ్యం:** పర్యాటక ప్రదేశాల నిర్వహణ, అభివృద్ధి, ఆ ప్రాంతాల్లో నియమ నిబంధనల అమలుపరంగా స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంపొందించాలి. తద్వారా తమ ఆచార వ్యవహారాలు, వనరుల పరిరక్షణకు స్థానిక ప్రజల తోడ్పాటు అందుతుంది.

ఈవిధమైన చర్యలు తీసుకున్నప్పుడే భారత్ 2047 నాటికి ఒక ట్రిలియన్ టూరిజం ఎకానమీని సాధించనుందన్న అంచనాల బాటో పయనించి, ఎదురవనున్న సవాళ్లను అధిగమించి, పర్యాటకరంగం పర్యావరణ హననానికి కాక, దేశ అభివృద్ధి సుస్థిర కోవలో సాగిపోవడానికి సహకరిస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-4

కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్

ఇప్పటివరకు ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో అనేక పద్ధతులను, నెంబర్ కోడింగ్‌కు సంబంధించిన వివిధ పద్ధతులను గత సంచికల్లో తెలుసుకున్నాం. ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో మిగిలిన వివిధ రకాల మోడల్స్‌ను పరిశీలిద్దాం.

డిజిట్ కోడ్

డిజిట్ కోడ్: దీనిలో ఒక పట్టిక, దాని కింద కొన్ని నియమాలు ఇస్తారు. పట్టికలో అంకెలు, వాటి కింద ఆంగ్ల అక్షరాలు ఉంటాయి. ఇచ్చిన నియమాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని తదనుగుణంగా ఈ కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది.

డిజిట్	2	5	7	8	9	4	6	3	1
లెటర్ కోడ్	M	R	T	B	W	K	D	N	J

నియమాలు:

1. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో I అనే అక్షరం రాయాలి.
2. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో Y అనే అక్షరం రాయాలి. పై నియమాలు, పట్టిక ఆధారంగా కింది సంఖ్యలకు సరైన కోడ్ అక్షరాలు తెలపండి.

1. 726395కు కోడ్‌ను తెలపండి?
ఎ) IMDNWI బి) YDMNWY
సి) TMDNWR డి) IMDNWR

2. 263847కు కోడ్ తెలపండి?
ఎ) IDNBKI బి) YDNBKY
సి) IDNBKY డి) MDNBKT

3. 591248కు కోడ్‌ను తెలపండి?
ఎ) IWJMKB బి) RWJMKY
సి) YWJMKY డి) RWJMKB

4. 615824కు కోడ్‌ను తెలపండి?
ఎ) IJRBMI బి) IJRBMY
సి) YJRBMY డి) DJRBMK

5. 831796కు కోడ్‌ను తెలపండి?
ఎ) INJTWR బి) BNJTWR
సి) YNJTWY డి) YNJYWY

సమాధానాలు వివరణలతో:

1. **సమాధానం:** (ఎ)
వివరణ: ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు. కాబట్టి మొదటి నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో I రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
7 2 6 3 9 5
I M D N W I కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.

2. **సమాధానం:** (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె సరి అంకె. చివరి అంకె బేసి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
2 6 3 8 4 7
M D N B K T కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

3. **సమాధానం:** (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె బేసి అంకె, చివరి అంకె సరి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
5 9 1 2 4 8
R W J M K B కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

4. **సమాధానం:** (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
6 1 5 8 2 4
Y J R B M Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

5. **సమాధానం:** (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు. కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
8 3 1 7 9 6
Y N J T W Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.



ప్రతిక్షేపణ పద్ధతి

ఈ విధానానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని వస్తువులను మరొక రకమైన వస్తువులుగాను, కొన్ని రంగులను మరొక రంగులుగాను, కొన్ని వాహనాలను మరొక వాహనాలుగాను, పరిగణించే విధంగా కోడ్ ఇస్తారు. తదుపరి ఒక ప్రశ్న ఇస్తారు. ఆ ప్రశ్నకు ముందుగా సరైన సమాధానాన్ని (ఒరిజినల్ ఆన్సర్) అనుకొని దానికి ఏది కోడ్ చేశారో ఆ కోడ్‌ని సమాధానంగా చెప్పాల్సి ఉంటుంది.

1. ఒక కోడ్ భాషలో CARను TRACTOR గాను, TRACTORను BUS గాను, BUSను AUTO గాను, AUTOను VAN గాను పిలుస్తారు. అయితే పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ఏవిఁటి?
ఎ) BUS బి) CAR సి) TRACTOR డి) VAN
సమాధానం: (ఎ)
వివరణ: సాధారణంగా పొలం దున్నడానికి ఉపయోగించే వాహనం ట్రాక్టర్ (ఇది ఒరిజినల్ ఆన్సర్). కాని ఇక్కడ TRACTORను BUSగా పిలవడం జరిగింది. అనగా దీని అర్థం TRACTORను BUSగా కోడ్ చేయడం జరిగింది. కాబట్టి సమాధానం BUS అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో rainను roadగాను, roadను riverగాను, riverను seaగాను, seaను skyగాను, skyను cloudగాను పిలుస్తారు. అయితే విమానాలు ఎక్కడ ఎగురుతాయి?
ఎ) sea బి) cloud సి) road డి) river
సమాధానం: (బి)
వివరణ: విమానాలు ఎల్లప్పుడూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే ఒరిజినల్ ఆన్సర్ ఆకాశం ఇచ్చిన ప్రశ్నలో ఆకాశాన్ని Cloudగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం Cloud అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో ఎరుపును ఆకుపచ్చగాను, ఆకుపచ్చను నలుపుగాను, నలుపును పసుపుగాను, పసుపును తెలుపుగాను, తెలుపును ఎరుపుగాను పిలుస్తారు? అయితే పాల రంగు ఏమిటి?
ఎ) నలుపు బి) పసుపు సి) ఎరుపు డి) ఆకుపచ్చ
సమాధానం: (సి)
వివరణ: సాధారణంగా పాల రంగు తెలుపు. (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో తెలుపు రంగును ఎరుపుగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం ఎరుపు అవుతుంది.

4. ఒక కోడ్ భాషలో earను eyeగాను, eyeను handను, handను mouthగాను, mouthను tongueగాను, tongueను elbowగాను పిలుస్తారు? అయితే మనం ఏదైనా విషయానికి సంబంధించి వినడానికై ఉపయోగించే జ్ఞానేంద్రియం ఏది?
ఎ) eye బి) tongue సి) hand డి) mouth
సమాధానం: (ఎ)
వివరణ: మానవులు వినడానికి ఉపయోగించే జ్ఞానేంద్రియం చెవి (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో చెవిను కన్నుగా పేర్కొన్నారు. కాబట్టి సమాధానం eye అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ



విజేత సాత్విక్ జోడీ

థాయ్‌లాండ్ ఓపెన్

బ్యాంకాక్: భారత స్టార్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టికి పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఆత్మవిశ్వాసాన్ని పెంచే విజయం దక్కింది. థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో ఈ జోడీ టైటిల్ అందుకుంది. ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ సాత్విక్/చిరాగ్ ద్వయం 21-15, 21-15తో చెన్ బో/లియుయి (చైనా) జంటను చిత్తు చేసి విజేతగా నిలిచింది. భారత జోడీకిది తొమ్మిదో వరల్డ్ టూర్ డబుల్స్ టైటిల్‌కాగా..థాయ్‌లాండ్‌లో రెండోది. 2019లో సాత్విక్/చిరాగ్ ఇక్కడ చాంపియన్‌గా నిలిచారు. తొలి గేమ్ ఆరంభంనుంచే దూకుడును ప్రదర్శించిన సాత్విక్‌జోడీ 5-1 ఆధిక్యంలో నిలిచింది.. కానీ వరుసగా నాలుగు పాయింట్లు సాధించిన ప్రత్యర్థి జోడీ పుంజుకుంది. 7-7 వద్ద 39 షాట్ల భారీ ర్యాలీలో చైనా జంట పాయింట్ రాబట్టడంతోపాటు 10-7తో ముందంజ వేసింది. కానీ చిరాగ్ బుల్లెట్లలాంటి షాట్లతో భారత జోడీ 10-10 స్కోరు సమం చేసినా..విరామానికి మాత్రం చైనా జంట స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. విరామం తర్వాత జోరు చూపిన భారత జోడీ మొదటి గేమ్‌ను కైవసం చేసుకుంది.. రెండో గేమ్‌లోనూ అదరగొట్టిన సాత్విక్/చిరాగ్ 8-3తో ముందంజ వేశారు. సాత్విక్ దూకుడుతో 15-11తో భారత జంట మరింత ఆధిక్యంలోకి దూసుకు పోయింది. కానీ చైనా జోడీ 14-15తో మ్యాచ్‌లో కొచ్చే ప్రయత్నం చేసినా..సాత్విక్/చిరాగ్ వారికి అవకాశం ఇవ్వకుండా గేమ్‌ను, మ్యాచ్‌ను చేజిక్కించుకుంది.

ప్లేఆఫ్స్ పోరు ఇలా..

ఐపీఎల్‌లో లీగ్ దశ ఆదివారంతో ముగిసింది. అలాగే ప్లేఆఫ్స్ జట్లు కూడా ఖరారయ్యాయి. 20 పాయింట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్ అగ్రస్థానం దక్కించుకోగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ 17 పాయింట్లతో మెరుగైన రన్‌రేట్‌తో రెండో స్థానంలో నిలిచింది. అటు రాజస్థాన్ మ్యాచ్ వర్షంతో రద్దయింది. దీంతో ఆ జట్టు (17 పాయింట్లు) హైదరాబాద్‌కంటే తక్కువ రన్‌రేట్ కారణంగా మూడో స్థానానికి పరిమితమైంది. ఇక బెంగళూరు ఆఖర్లో ఉంది. ఈ స్థానాలను బట్టి మంగళవారం క్వాలిఫయర్ 1లో కేకేఆర్-సన్‌రైజర్స్ మధ్య అహ్మదాబాద్‌లో మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిచిన జట్టు నేరుగా 26న జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. కానీ ఓడిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది. ఇదే మైదానంలో బుధవారం జరిగే ఎలిమినేటర్‌లో ఆర్‌సీబీ-రాజస్థాన్ తలపడతాయి. ఇక్కడ ఓడిన జట్టు ఇంటిముఖం పట్టాల్సిందే. ఈ మ్యాచ్ విజేత శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో ఆడాల్సిఉంటుంది. ఇందులో ఆ జట్టుకు క్వాలిఫయర్1లో ఓడిన టీమ్ ప్రత్యర్థిగా ఉంటుంది. ఫైనల్‌కు వెళ్లే రెండో జట్టేదో ఈ మ్యాచ్‌తో తేలిపోతుంది. క్వాలిఫయర్2, ఫైనల్ చెన్నైలో జరుగుతాయి.

షెడ్యూల్

మే 21	క్వాలిఫయర్ 1	కోల్‌కతా X సన్‌రైజర్స్	అహ్మదాబాద్
మే 22	ఎలిమినేటర్	బెంగళూరు X రాజస్థాన్	అహ్మదాబాద్
మే 24	క్వాలిఫయర్ 2	-----	చెన్నై


క్వాలిఫయర్ 1 పోరులో..


ఎలిమినేటర్‌లో..

రాయల్స్‌కు వరుణుడి షాక్



- కోల్‌కతాతో మ్యాచ్ రద్దు
- టాప్-2లో చాన్స్ మిస్
- ఆర్‌సీబీతో ఎలిమినేటర్‌కు సిద్ధం

గువాహటి: ఐపీఎల్‌లో చివరి లీగ్ మ్యాచ్ వర్షార్పణమైంది. దీంతో రెండో స్థానంపై ఆశలు పెట్టుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు నిరాశే ఎదురైంది. ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో ఆలస్యంగా టాస్ వేసినా.. ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. ఇతర జట్లకన్నా చాలా ముందుగానే 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న శాంసన్ సేన ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి టాప్-2 స్థానం గల్లంతు చేసుకుంది. తాజా మ్యాచ్‌లోనైనా విజయం సాధిస్తే ఆ అవకాశం ఉన్నప్పటికీ వరుణుడు కరుణించలేదు. దీంతో ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకుంది. అలాగే మొత్తం 17 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్‌లో ఆర్‌సీబీతో ఆడేందుకు సిద్ధమైంది. ఇక ఆదివారం రాత్రి ఏడు గంటలకు చిరుజల్లులతో ఆరంభమైన వర్షం కుండపోతగా మారింది. దీంతో ఆటగాళ్లంతా డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. అటు మైదానాన్ని పూర్తిగా కవర్లతో కప్పి ఉంచారు. రాత్రి 8.30కి కాస్త తగ్గినా కాసేపటికే తిరిగి కొనసాగింది. చివరకు రాత్రి 10 గంటలకు పూర్తిగా ఆగిపోవడంతో కవర్లను తొలగించారు. పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు మ్యాచ్‌ను ఏడు ఓవర్లకు కుదించి రాత్రి 10.30కి టాస్ కూడా వేశారు. అటు కోల్‌కతా ఫీల్డింగ్ ఎంచుకుంది. ఆ వెంటనే తిరిగి భారీ వర్షం కురవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహం చెందారు. ఐదు ఓవర్ల మ్యాచ్ కూడా వీలు కాకపోవడంతో చేసేదేమీ లేక అంపైర్లు సైతం మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తూ ఇరు జట్లకు చెరో పాయింట్‌ను కేటాయించారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	14	9	3	2	20	1.428
హైదరాబాద్	14	8	5	1	17	0.414
రాజస్థాన్	14	8	5	1	17	0.273
బెంగళూరు	14	7	7	0	14	0.459
చెన్నై	14	7	7	0	14	0.392
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లఖ్‌నవూ	14	7	7	0	14	-0.667
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	14	5	9	0	10	-0.353
ముంబై	14	4	10	0	8	-0.318

వద్దని చెప్పినా వినరా?

బ్రాడ్‌కాస్టర్‌పై రోహిత్ ఆగ్రహం

న్యూఢిల్లీ: క్రికెటర్ల గోప్యతను ఐపీఎల్ బ్రాడ్‌కాస్టర్ ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇటీవల కేకేఆర్‌తో మ్యాచ్‌కు ముందు తను అభిషేక్ నాయర్‌తో కలిసి మాట్లాడిన ఓ వీడియో నెట్టింట్లో వైరల్ అయ్యింది. అందులో ముంబై కెప్టెన్సీపై అతడు తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడట. 'క్రికెటర్ల జీవితాలకు గోప్యత లేకుండా పోయింది. శిక్షణ లేదా మ్యాచ్ సమయంలో మా సహచరులు, స్నేహితులతో మాట్లాడే ప్రతీ మాటను కెమెరాలు నేరుగా రికార్డు చేస్తూ ప్రసారం కూడా చేస్తున్నాయి. అలాగే మా సంభాషణను రికార్డు చేయవద్దని స్టార్‌స్పోర్ట్స్‌ను కోరినా వినకుండా ప్రసారం కూడా చేశారు. వారికి ఎప్పుడూ ఎక్స్‌క్లూజివ్ దృశ్యాలు మాత్రమే కావాల'ని రోహిత్ ఎక్స్‌లో ఘాటుగా స్పందించాడు.

ఏ ముగించారు

సన్‌రైజర్స్‌కు రెండో స్థానం ● పంజాబ్ చిత్తు


అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 66)

హైదరాబాద్: లీగ్ దశను సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 66) ధనాధన్ అర్ధ శతకంతో సన్‌రైజర్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 214/5 స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ (71), రొసో (49), అథర్వ తైడ్ (46), జితేష్ శర్మ (32 నాటౌట్) రాణించారు. నటరాజన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం సన్‌రైజర్స్ 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. క్లాసెన్ (42), నితీష్ కుమార్ (37) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అర్ష్‌దీప్ సింగ్, హర్షల్ పటేల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ మొత్తం 17 పాయింట్లు సాధించింది.

హెడ్ గోల్డెన్ డక్‌గా..: ఛేదనలో ఇన్నింగ్స్ తొలి బంతికే హెడ్ (0)ను అర్ష్‌దీప్ అద్భుతమైన బంతికి డకౌట్‌చేశాడు. తర్వాత అభిషేక్..వన్‌డౌన్‌లో వచ్చిన రాహుల్ త్రిపాఠి (33)తో కలసి రెండో వికెట్‌కు 72, నితీష్‌తో కలసి 57 రన్స్ జోడించాడు. 129/2 స్కోరు వద్ద అభిషేక్‌ను శశాంక్ అవుట్ చేశాడు. ఈ దశలో క్లాసెన్ ధాటిగా ఆడాడు. కానీ, చివరి 11 బంతుల్లో 7 పరుగులు కావాల్సి ఉండగా.. క్లాసెన్‌ను హర్‌ప్రీత్ అవుట్ చేశాడు. సన్వీర్ (6 నాటౌట్) 5 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపు గీత దాటించాడు.

టాపార్డర్ జోరు..: అథర్వ, ప్రభ్‌సిమ్రన్ అదిరే ఆరంభాన్నివ్వడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పంజాబ్ పవర్‌ప్లేలో 61/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే, 10వ ఓవర్‌లో అథర్వను క్యాచవుట్ చేసిన నటరాజన్.. తొలి వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. అనంతరం రొసోతో కలసి ప్రభ్‌సిమ్రన్ రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. ప్రభ్‌సిమ్రన్‌ను 15వ ఓవర్‌లో వియస్కాంత్ వెనక్కిపంపాడు. ఈ దశలో సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి జోరుకు కళ్లెం వేశారు. శశాంక్ (2) రనౌట్ కాగా.. రొసోను కమిన్స్ పెవిలియన్ చేర్చాడు. అయితే, చివరి ఓవర్‌లో నితీష్ బౌలింగ్‌లో 19 పరుగులు పిండుకొన్న జితేష్.. టీమ్ స్కోరును 210 దాటించాడు.

పంజాబ్: అథర్వ (సి) సన్వీర్ (బి) నటరాజన్ 46, ప్రభ్‌సిమ్రన్ (సి) క్లాసెన్ (బి) వియస్కాంత్ 71, రొసో (సి) సమద్ (బి) కమిన్స్ 49, శశాంక్ (రనౌట్/నితీష్) 2, జితేష్ (నాటౌట్) 32, అశుతోష్ (సి) సన్వీర్ (బి) నటరాజన్ 2, శివమ్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 214/5; వికెట్ల పతనం:** 1-97, 2-151, 3-174, 4-181, 5-187; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-36-0, కమిన్స్ 4-0-36-1, నటరాజన్ 4-0-33-2, వియస్కాంత్ 4-0-37-1, షాబాజ్ 1-0-13-0, నితీష్ 3-0-54-0.

సన్‌రైజర్స్: హెడ్ (బి) అర్ష్‌దీప్ 0, అభిషేక్ (సి) శివమ్ (బి) శశాంక్ 66, త్రిపాఠి (సి) అర్ష్‌దీప్ (బి) హర్షల్ 33, నితీష్ (సి) శివమ్ (బి) హర్షల్ 37, క్లాసెన్ (బి) హర్‌ప్రీత్ 42, షాబాజ్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 3, సమద్ (నాటౌట్) 11, సన్వీర్ సింగ్ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 19.1 ఓవర్లలో 215/6; వికెట్ల పతనం:** 1-0, 2-72, 3-129, 4-176, 5-197, 6-208; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-2, రిషి ధవన్ 3-0-35-0, హర్షల్ 4-0-49-2, చాహర్ 4-0-43-0, హర్‌ప్రీత్ 3-0-36-1, శశాంక్ 1-0-5-1, అథర్వ 0.1-0-4-0.


రైజర్స్ సారథి కమిన్స్

అదంతా దేవుడి ప్రణాళిక



బెంగళూరు: ఐపీఎల్‌లో బెంగళూరు జట్టు కేవలం ఒక్క శాతం అవకాశం నుంచి ఓ అద్భుతంలా టాప్-4లో నిలిచింది. అందుకే ఇదంతా దైవకృపగా విరాట్ భావిస్తున్నాడు. 'మా జట్టు పురోగతిపై భగవంతుడికి ఓ ప్రణాళిక ఉన్నట్టుంది. నిజాయతీగా మన పని చేసుకుంటూ వెళ్తే ఫలితం వస్తుంది. ఇప్పుడు మా కష్టానికి ప్రతిఫలం దక్కింది' అని విరాట్ తెలిపాడు. ఇక ధోనీ సిక్సర్‌తోనే తాము గెలిచినట్టు దినేశ్ కార్తీక్ వెల్లడించాడు. చివరి ఓవర్‌లో అతడి సిక్సర్ స్టేడియం రూఫ్‌పై పడడంతో అంపైర్లు కొత్త బంతి ఇచ్చారని, అది పొడిగా ఉండడంతో చక్కటి గ్రిప్ దొరికిందని వివరించాడు.

బిజినెస్

పీఎస్‌బీల వ్యాపారం అదుర్స్

అగ్రస్థానంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) తమ వ్యాపారాన్ని (డిపాజిట్ల సేకరణ+రుణ వితరణ) గణనీయంగా పెంచుకున్నాయి. ఈ విషయంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) 15.94 శాతం వృద్ధి రేటుతో మిగిలిన బ్యాంకుల కంటే ముందుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 13.12 శాతం వృద్ధి రేటుతో రెండో స్థానంలో ఉంది. వృద్ధి రేటులో ముందున్నా డిపాజిట్లు, అడ్వాన్స్‌లపరంగా చూస్తే ఎస్‌బీఐ-బీఓఎం మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. 2023-24లో బీఓఎంతో పోలిస్తే ఎస్‌బీఐ వ్యాపారం 16.7 రెట్లు ఎక్కువ. ఎస్‌బీఐ మొత్తం బిజినెస్ 2023-24లో రూ.79,52,784 కోట్లు ఉంటే బీఓఎం బిజినెస్ రూ.4,74,411 కోట్లు మాత్రమే.

డిపాజిట్ల సేకరణ పరంగా: డిపాజిట్ల సమీకరణ వృద్ధి రేటు పరంగా చూసినా బీఓఎం 15.66 శాతం వృద్ధి రేటుతో అగ్రస్థానంలో ఉంది. 11.07 శాతంతో ఎస్‌బీఐ రెండో స్థానంలో, 11.05 శాతంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) మూడో స్థానంలో, 10.98 శాతం వృద్ధి రేటుతో కెనరా బ్యాంక్ నాలుగో స్థానంలో నిలిచాయి. డిపాజిట్ల సమీకరణ పరంగా చూస్తే గత ఆర్థిక సంవత్సరం ఈ నాలుగు పీఎస్‌బీలు మాత్రమే రెండంకెల వృద్ధి రేటు నమోదు చేశాయి.

నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు

సోమవారం ముంబైలో లోక్‌సభ ఎన్నికల కారణంగా స్టాక్ మార్కెట్లకు సెలవు ప్రకటించారు. కమోడిటీ, బులియన్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం నుంచి స్టాక్ మార్కెట్లతో పాటు ఇతర మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

- సామ్‌సంగ్.. దేశీయ మార్కెట్లోకి మూడు కొత్త రిఫ్రిజిరేటర్లను తీసుకువచ్చింది. సామ్‌సంగ్ నెక్స్ట్ జెనరేషన్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో రూపొందించిన ఇన్వర్టర్ కంప్రెసర్స్‌తో ఈ రిఫ్రిజిరేటర్లను రూపొందించింది. ఏఐ ఇన్వర్టర్‌తో కూడిన కొత్త రిఫ్రిజిరేటర్లు విద్యుత్ వ్యయాలను గణనీయంగా తగ్గిస్తాయని సామ్‌సంగ్ పేర్కొంది. వీటి ధరలు రూ.1,72,900 నుంచి రూ.3,55,000 వరకు ఉన్నాయి.
- కన్స్యూమర్ ఉత్పత్తుల విభాగంలోని స్టార్టప్స్ కోసం నాలుగో సీజన్ ప్రొపెల్‌ను అమెజాన్ ఇండియా ప్రారంభించింది. కనీసం 50 స్టార్టప్స్‌కు ఈ నాలుగో సీజన్ ద్వారా తోడ్పాటునందించాలని అమెజాన్ భావిస్తోంది. ఈ స్టార్టప్స్ రూపొందించిన ఉత్పత్తుల తయారీకి అవసరమైన సహాయ సహకారాలతో పాటు ఎగుమతులు చేపట్టేందుకు అమెజాన్ తోడ్పాటును అందించనుంది.
- బీఎస్‌హెచ్ హోమ్ అప్లయెన్సెస్ (బాష్).. మార్కెట్లోకి మేడిన్ ఇండియా సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్స్‌ను విడుదల చేసింది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా జర్మన్ స్టాండర్డ్స్‌కు లోబడి వీటిని తయారీ చేసింది.

పీఎస్‌యూల ఏటీఎఫ్ పైప్‌లైన్లపై రిలయన్స్ కన్ను

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) దేశీయ మార్కెట్లో తన విమాన ఇంధన (ఏటీఎఫ్) సామ్రాజ్యాన్ని విస్తరించాలని యోచిస్తోంది. ఇందుకోసం దేశంలోని విమానాశ్రయాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీలకు ఉన్న పైప్‌లైన్లు, స్టోరేజీ ట్యాంకులను ఉపయోగించుకోవాలని చూస్తోంది. ఇందుకు అనుమతించాలని పెట్రోలియం, నేచరల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ)కు లేఖ రాసింది. దేశీయ విమానాశ్రయాల్లో ఏటీఎఫ్ గిరాకీ ఏటా రెండెంకెల్లో వృద్ధి చెందుతోంది. దీంతో రిలయన్స్ ఈ దిశగా పావులు కదుపుతోందని భావిస్తున్నారు.

బైజూస్‌కి రజనీష్, పాయ్ గుడ్‌బై

న్యూఢిల్లీ: ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. కంపెనీ సలహా మండలి సభ్యత్వానికి ఎస్‌బీఐ మాజీ చైర్మన్ రజనీష్ కుమార్, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌ఓ మోహన్‌దాస్ పాయ్ గుడ్‌బై చెప్పారు. బైజూస్ మాతృ సంస్థ థింక్ అండ్ లెర్న్ వ్యవస్థాపకుడు రవీంద్రన్ బైజూస్‌తో చర్చించాకే వీరిద్దరూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ముందుగా నిర్ణయించిన విధంగా ఏడాది సమయం పూర్తయినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వీరిద్దరూ తెలిపారు. అయితే బైజూస్‌కు ఎప్పుడైనా తమ సలహాలు, సూచనలు కావాల్సి వస్తే, ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు.

4 నెలల్లో రూ.1.3 లక్షల కోట్ల పెట్టుబడులు

స్టాక్ మార్కెట్‌పై ఎంఎఫ్‌ల ఆసక్తి



న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్ భవిష్యత్‌పై మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అత్యంత నమ్మకంతో ఉన్నాయి. ఈ నమ్మకంతోనే ఈ సంస్థలు ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 16 వరకు దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.1.3 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాయి. ఇదే సమయంలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మన మార్కెట్ నుంచి రూ.25,000 కోట్లకుపైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. అంతర్జాతీయ ఆటుపోట్లు, వడ్డీ రేట్ల తగ్గింపుపై అనిశ్చితి, లాభాల స్వీకరణతో ఎఫ్‌పీఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుంటే, ఇదే సమయంలో ఎంఎఫ్‌లు, బీమా సంస్థల వంటి దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు, రిటైల్ మదుపరులు పెద్దమొత్తంలో దేశీయ స్టాక్ మార్కెట్లో మదుపు చేయడం విశేషం.

కారణాలు..

- మిగతా పెట్టుబడులతో పోలిస్తే ఈక్విటీలపై అధిక లాభాలు
- కొన్ని ఆటుపోట్లు ఎదురైనా మార్కెట్ వెంటనే కోలుకోవడం
- సిప్‌ల రూపంలో పెద్ద మొత్తంలో వచ్చిపడుతున్న పెట్టుబడులు
- స్థిరంగా పెరుగుతున్న జీడీపీ వృద్ధి రేటు
- 2023-24 ద్రవ్య లోటు ఐదేళ్ల కనిష్ఠ స్థాయికి తగ్గటం

టాటా మోటార్స్ రూ.43,000 కోట్ల పెట్టుబడులు

కొత్త ఉత్పత్తులు, టెక్నాలజీల కోసమే..
TATA MOTORS

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో టాటా మోటార్స్ గ్రూప్ రూ.43,000 కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. కొత్త ఉత్పత్తులు, టెక్నాలజీల కోసం ఈ మొత్తాలను వెచ్చించనుంది. ఈ పెట్టుబడుల్లో సింహభాగం బ్రిటిష్ విభాగమైన జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్‌ఆర్)లో పెట్టే అవకాశం ఉందని టాటా మోటార్స్ సీఎఫ్‌ఓ పీబీ బాలాజీ వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జేఎల్‌ఆర్‌లో రూ.30,000 కోట్లు, టాటా మోటార్స్‌లో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ తొలుత తెలిపింది. అయితే ఈ ఏడాది మార్చి ముగిసే నాటికి నిర్దేశిత లక్ష్యాలను మించి జేఎల్‌ఆర్‌లో రూ.33,000 కోట్లు, టాటా మోటార్స్‌లో రూ.8,200 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు బాలాజీ తెలిపారు. దీంతో గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.41,200 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లయిందని ఆయన పేర్కొన్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జేఎల్‌ఆర్‌లో రూ.35,000 కోట్లు, టాటా మోటార్స్‌లో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా కొత్త ఉత్పత్తుల అభివృద్ధి కోసం ఈ పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 2025-26లో రేంజ్ రోవర్ బీఈవీ సహా కొన్ని పాత కార్ల స్థానంలో బ్రాండ్ న్యూ వాహనాలను తీసుకురానున్నట్లు బాలాజీ చెప్పారు. అలాగే ఈ ఏడాది డిఫెండర్ ఓక్టాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ 'లాభాల' రికార్డ్

సిబ్బందికి 8 నెలల జీతం బోనస్



న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యుత్తమ విమానయాన సంస్థల్లో ఒకటిగా చెప్పబడే సింగపూర్ ఎయిర్‌లైన్స్ గత ఆర్థిక సంవత్సరం (2023-24) రికార్డు స్థాయిలో 198 కోట్ల డాలర్ల (సుమారు రూ.16,503 కోట్లు) లాభాలు ఆర్జించింది. దీంతో ఉద్యోగులకు ఎనిమిది నెలల జీతం బోనస్‌గా చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ఒక విమానయాన సంస్థ ఉద్యోగులకు ఇంత పెద్ద మొత్తం బోనస్‌గా చెల్లించాలని నిర్ణయించడం ఇదే మొదటిసారి. కొవిడ్ భయాలు పోయి చైనా, జపాన్, హాంకాంగ్, తైవాన్‌లకు విమాన ప్రయాణం ఊపందుకోవడం గత ఆర్థిక సంవత్సరం సింగపూర్ ఎయిర్‌లైన్స్ లాభాలకు బాగా కలిసొచ్చింది. 'మా ఉద్యోగుల అంకిత భావం వల్లే కొవిడ్ ఉపద్రవాన్ని తట్టుకుని మేము మరింత బలోపేతంగా ఎదిగాము' అని సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీఈఓ గో చూన్ చెప్పారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మాత్రం పరిస్థితులు అంత బాగుండకపోవచ్చన్నారు.

22,800 ఎగువన బుల్లిష్

(మే 21-24 తేదీల మధ్య వారానికి)


దా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,520-21,821 పాయింట్ల మధ్యన కదలాడి అంతకు ముందు వారంతో పోల్చితే 1.99 శాతం లాభంతో 22,503 పాయింట్ల వద్ద క్లోజైంది. ఈ వారాంతంలో నిఫ్టీ 23,800 ఎగువన క్లోజయితే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 22,800
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,200
నిరోధ స్థాయిలు: 22,700, 22,380, 22,900 (22,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,300, 22,200, 22,100 (22,400 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ



హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550

దజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	గోదావరి	154
వరంగల్	150	విజయవాడ	154
కరీంనగర్	150	గుంటూరు	154
మహబూబ్‌నగర్	152	ఒంగోలు	154
కర్నూలు	152	చిత్తూరు	160
విశాఖపట్నం	146		

ఫార్మా కంపెనీలకు 'రీకాల్' కష్టాలు

పట్టు బిగిస్తున్న అమెరికా ఎఫ్‌డీఏ.. డాక్టర్ రెడ్డీస్, అరబిందో, సన్ ఫార్మాకు నిరాశ

న్యూఢిల్లీ: భారత ఫార్మా కంపెనీలపై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) పట్టు బిగిస్తోంది. ఔషధాల తయారీ లేదా నాణ్యతలో ఏ మాత్రం తేడా కనిపించినా కొరడా ఝుళిపిస్తోంది. ఈ కారణంతోనే గత నెలలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా, సన్ ఫార్మా, ఎఫ్‌డీసీ కంపెనీలు అమెరికాకు ఎగుమతి చేసిన ఔషధాల్లో కొన్నిటిని వెనక్కి (రీకాల్) తీసుకోవాల్సి వచ్చింది. అమెరికా ఎఫ్‌డీఏ తన తాజా ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలో ఈ విషయం వెల్లడించింది. కంపెనీల వారీగా రీకాల్ చేసిన ఔషధాల వివరాలు ఇలా ఉన్నాయి.

డాక్టర్ రెడ్డీస్: న్యూజెర్సీ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఇంక్ అమెరికాలో జవిగ్టర్ (సప్రోప్టెరిన్ డైహైడ్రోక్లోరైడ్) పౌడర్ ఫర్ ఓరల్ సొల్యూషన్ (100 ఎంజీ) పేరుతో మార్కెట్ చేస్తున్న ఔషధం అంత శక్తివంతంగా లేదని ఎఫ్‌డీఏ తేల్చింది. ఈ ఔషధాన్ని పిల్లలు, పెద్దల రక్తంలో ఫినైల్ అలానైన్‌ని నియంత్రించేందుకు ఉపయోగిస్తారు. ఎఫ్‌డీఏ చర్యతో డాక్టర్ రెడ్డీస్ గత నెల 8న క్లాస్-1 రీకాల్ కింద 20,000 కార్టన్‌ల ఈ ఔషధాన్ని వెనక్కి తీసుకుంది.

సన్ ఫార్మా: అమెరికా ఎఫ్‌డీఏ ప్రభావం సన్ ఫార్మాపైనా పడింది. సరైన నాణ్యతా ప్రమాణాలు లేవనే కారణంతో ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ ట్రీట్‌మెంట్‌కు ఉపయోగించే అంఫోటెరిసిన్ బి లిపోసమ్ అనే ఇంజెక్షన్లకు సంబంధించి 11,016 వయల్స్‌ను వెనక్కి తీసుకుంది.

అరబిందో ఫార్మా: అరబిందో ఫార్మా తయారు చేసే క్లోరాజెపాటె డిపోటాషియం టాబ్లెట్స్‌పైనా ఎఫ్‌డీఏ వేటు పడింది. 3.75, 7.5 ఎంజీ డోసుల్లో లభించే ఈ టాబ్లెట్లను మానసిక రుగ్మతల చికిత్సలో ఉపయోగిస్తారు. ఎఫ్‌డీఏ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కంపెనీ ఈ టాబ్లెట్లతో కూడిన దాదాపు 13,605 బాటిల్స్‌ను వెనక్కి తీసుకుంది.

22,600 వద్ద నిరోధం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గతవారం నెగటివ్ జోన్‌లో ప్రారంభమై ప్రధాన మద్దతు స్థాయిలైన 22,000 దిగువకు వెళ్లింది. అనంతరం బలమైన రికవరీ సాధించి చివరకు 450 పాయింట్ల లాభంతో వీక్లీ గరిష్ఠ స్థాయిల్లో క్లోజైంది. కనిష్ఠ స్థాయిల నుంచి పుంజుకోవటంతో సత్వర డౌన్‌ట్రెండ్ నుంచి నిఫ్టీ బయటపడింది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ గతవారం ఇటీవలి గరిష్ఠ, స్వల్పకాలిక నిరోధ స్థాయిలకు చేరువలో పటిష్ఠంగా ముగిసింది. నిఫ్టీ గడిచిన మూడు నెలలుగా గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలైన 22,700-21,700 మధ్యన కదలాడుతూ వస్తోంది. గతవారం మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిల్లో క్లోజయ్యాయి. మార్కెట్ తదుపరి దిశను తీసుకునే ముందు ప్రస్తుత నిరోధ స్థాయిలైన 22,600 వద్ద కన్సాలిడేట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదేనీ పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 22,600 ఎగువన తదుపరి నిరోధ స్థాయిలుంటాయి. ఇది ఈ నెల 6న ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఇక్కడ నిలదొక్కుకుంటేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 22,800. ఇది ఈ నెల 3న ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఈ గరిష్ఠ స్థాయిల వద్ద నిలదొక్కుకుంటే అనంతరం 23,000 వద్ద ప్రధాన నిరోధ స్థాయిలు ఉంటాయి.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదేనీ బలహీనతను సూచిస్తే తదుపరి మద్దతు స్థాయి 22,300. ఇది గత వారం ఏర్పడిన కనిష్ఠ స్థాయి. ఒకవేళ ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే తదుపరి మద్దతు స్థాయిలు 22,000 దిగువన ఉంటాయి. అయితే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిశీలిస్తే ఈ స్థాయిల వద్ద పరీక్షను ఎదుర్కొనే అవకాశం కనిపించటం లేదు.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ కనిష్ఠ స్థాయిలైన 47,000 నుంచి రికవరీ సాధించి 780 పాయింట్ల లాభంతో 48,200 వద్ద క్లోజైంది. ఈ వారం మరింత రికవరీ సాధిస్తే 48,700 ఎగువన తదుపరి నిరోధ స్థాయిలుంటాయి. ఇది ఈ ఏడాది ఏప్రిల్ 26న ఏర్పడిన స్థాయి. మరో ప్రధాన నిరోధం 49,000. అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ బలహీనతను సూచిస్తే తదుపరి మద్దతు స్థాయి 47,700. ఇక్కడ నిలదొక్కుకోవటంలో విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది.

ప్యాటర్న్: మార్కెట్ గత వారం 100 రోజుల డీఎంఏ ఎగువన రికవరీ సాధించింది. వీక్లీ చార్టుల ప్రకారం చూస్తే 22,600 వద్ద డబుల్ టాప్ ప్యాటర్న్ ఏర్పడింది. తదుపరి పాజిటివ్ ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాల్సి ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మూడో ట్రేడింగ్ రోజైన గురువారం రివర్సల్ ఉండే అవకాశాలున్నాయి.

మంగళ వారం స్థాయిలు	
నిరోధం	22,600, 22,645
మద్దతు	22, 460, 22, 400

www.sundartrends.in

యాదాద్రిలో వాహనాల కిటకిట

కొండపైన 2,000, కింద 1500కు పైగా వాహనాల పార్కింగ్.. లక్ష్మీనృసింహుని దర్శనానికి పోటెత్తిన జనం

60వేల మందికి పైగా భక్తుల రాక.. స్వామి వారి ఖజానాకు రూ.85,33,262 .. నేటి నుంచి జయంత్యుత్సవాలు

భువనగిరి అర్బన్, మే 19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం పరిసరాల్లో ఆదివారం ఎక్కడ చూసినా వాహనాలే కనిపించాయి. వారాంతపు సెలవు రోజు, వేసవి సెలవులు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. చాలా మంది భక్తులు తమ సొంతవాహనాల్లో తరలివచ్చారు. దీంతో యాదగిరిగుట్ట కొండ మీద, కొండ కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో కిటకిటలాడాయి. సుమారు రెండు వేల వాహనాలు కొండ మీదకు వెళ్లాయి. కొండ మీదకు వెళ్లే వాహనం ఒక్కో దానికి రూ.500 టికెట్ తీసుకుంటారు. ఈ టికెట్ల రూపంలోనే రూ.10 లక్షల ఆదాయం సమకూరింది. ఇక, కొండ కింది పార్కింగ్ ప్రదేశంలో సుమారు 1500 వాహనాలు నిలిపి ఉంచారు. ఆదివారం యాదగిరిగుట్టలో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆలయ అధికారుల లెక్కల ప్రకారం 60వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి రెండు గంటలు పట్టింది. క్యూలైన్లలో సరైన సదుపాయాలు లేక భక్తులు అవస్థలు పడ్డారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బ్రేక్(4గంటల నుంచి ఐదు గంటల వరకు) దర్శనాన్ని రద్దు చేశారు. సాయంత్రం 15 నిమిషాల పాటు కురిసిన వర్షం వల్ల భక్తులు మరింత ఇబ్బంది పడ్డారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.85,33,262 నిత్య ఆదాయంగా సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఇక, సోమవారం నుంచి లక్ష్మీనృసింహస్వామివారి జయంత్యుత్సవాలు ప్రారంభంకానున్నాయి.



ప్రధానాలయం క్యూలైన్లలో భక్తుల రద్దీ

హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్‌జామ్

బీబీనగర్: యాదగిరిగుట్ట, భువనగిరి స్వర్ణ దేవాలయాల సందర్శనకు ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో హైదరాబాద్-బీబీనగర్ జాతీయ రహదారి 163 రద్దీగా మారింది. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు ఆదివారం రాత్రి కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ జామ్‌లో వాహనదారులు గంటసేపు పైగా అవస్థ పడ్డారు.



యాదగిరిగుట్ట కొండ కింద నిలిపి ఉంచిన వాహనాలు



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులు

శ్రీశైలంలో భక్తజన సందోహం

- రద్దీగా మారిన ఆలయ ప్రధాన వీధులు
- ట్రాఫిక్ జామ్‌తో భక్తులకు ఇబ్బందులు

శ్రీశైలం, మే 19: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రధాన వీధులన్నీ రద్దీగా మారాయి. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు కిక్కిరిసి కనిపించాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం నుంచే భక్తులు బారులు దీరారు. కల్యాణ కట్టలో స్వామివారికి తలనీలాలు సమర్పించి పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, తాగునీరు అందజేశారు. దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు దర్శనం, ఆర్జిత సేవ క్యూలైన్లు, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. వేసవి సెలవులు, పైగా ఆదివారం.. దీంతో భక్తులు వేలాది వాహనాల్లో రావడంతో క్షేత్ర పరిధిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దేవస్థానం టోల్‌గేట్ సర్కిల్ వద్ద అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. టోల్‌గేట్ వద్ద నుంచి వచ్చిన వాహనాలను రింగ్ రోడ్డు వైపు మళ్లించాల్సి ఉంది. మరో వైపు రింగ్ రోడ్డు రెండో దారి నుంచి బయటకు తిరిగి వెళ్లే వాహనాలు కూడా టోల్‌గేట్ సమీపంలోనే నిలిచిపోయాయి. వచ్చి పోయే వాహనాలన్నీ ఒకే చోటకు చేరే సరికి ట్రాఫిక్ సమస్య నెలకొంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో దేవస్థానం సెక్యూరిటీ, హోంగార్డు సిబ్బందికి విఫలమయ్యారు.

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో వేడెక్కిన రాజకీయం

- క్యాంపునకు వెళ్తున్న మేయర్ వర్గాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు.. ఖండించిన హరీశ్‌రావు

పీర్జాదిగూడ, హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో బలనిరూపణకు సంబంధించి మేయర్ క్యాంపు రాజకీయాలకు తెర తీశారు. దీన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించడంతో ఆదివారం రాత్రి హైడ్రామా చోటు చేసుకుంది. పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకటరెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీనికి సంబంధించి కలెక్టర్ జూన్ 5న మేయర్‌ను బల నిరూపణకు ఆదేశించారు. దాంతో మేయర్ వెంకట్‌రెడ్డి తన అనుకూల కార్పొరేటర్లను వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు ఔటర్ రింగ్ రోడ్డుపై వారి వాహనాలను వెంబడించి వారిని ఎయిర్‌పోర్ట్‌కు పోకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఔటర్‌పై ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో మేయర్ వర్గం ఘట్‌కేసర్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ దిగి తిరిగి పీర్జాదిగూడ చేరుకున్నారు. ఈ ఘటనపై మేయర్ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తనను పదవి నుంచి దించేందుకు కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. తమను కిడ్నాప్ చేసేందుకు పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రయత్నించారన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో జరిగిన ఘటనను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్పొరేటర్లపై బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, మేయర్ జక్క వెంకట్‌రెడ్డికి పోలీస్ రక్షణ కల్పించాలని రాచకొండ కమిషనర్, డీజీపీని ఆయన ట్విటర్ వేదికగా కోరారు. ఇలాంటి దాడులను చూస్తూ ఊరుకోమని హరీశ్‌రావు హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసి బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతానికి పెంచాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 40 బీసీ సంఘాలు, విద్యార్థి ప్రజాసంఘాల సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 29 నుంచి 50 శాతానికి పెంచాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి బీసీ గురుకుల కాలేజీల్లో సీట్ల భర్తీ

బాలికలకు 9,841, బాలురకు 8,635 సీట్లు: కార్యదర్శి సైదులు

హైదరాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల సోమవారం నుంచి 30వ తేదీ వరకు సీట్ల భర్తీ ప్రక్రియను నిర్వహించనున్నట్లు కార్యదర్శి బడుగుల సైదులు (ఐఎఫ్ఎస్) తెలిపారు. జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఏప్రిల్ 28న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆదివారం విడుదల చేశామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థులంతా వెబ్‌సైట్‌లో ఉంచిన ఫలితాలను చూసుకుని, మెరిట్ సాధించిన విద్యార్థులు తమకు కేటాయించిన కాలేజీల్లో నిర్ణీత గడువులోపు రిపోర్టు చేయాలని సూచించారు. కాగా జూనియర్ కాలేజీల్లో బాలికలకు 9,841, బాలురకు 8,635 సీట్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన హితవు పలికారు.

నేడు ఈసెట్ ఫలితాలు

హైదరాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): ఈసెట్ ఫలితాలను సోమవారం విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను వెల్లడించనున్నారు.

వరికొయ్యల మరణ శాసనం

కొయ్యల దహనం అన్నదాతల ప్రాణాల మీదకు.. వరంగల్, నిజామాబాద్‌లో ఇద్దరు రైతుల మృతి

- పంజాబ్, హరియాణాలో వాతావరణ కాలుష్యం
- మన రాష్ట్రానికీ పాకిన పంట వ్యర్థాల దహనం
- ఈ పద్ధతిలో సూక్ష్మజీవులు మృతితో భూమికి చేటు

- ఈ నెల 9న వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన అల్లంనేని పాపారావు (65) తన చేలో మొక్కజొన్న కొయ్యల దహనానికి అగ్గిపుల్ల గీయగా మంటలు చెలరేగాయి. ఎండల తీవ్రతతో మరింత పెట్రేగాయి. వాటి ధాటికి పాపారావు సజీవ దహనమయ్యాడు.
- ఈ నెల మూడో తేదీన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పెద్ద వాల్గోట్‌లో కిషన్ వరి కొయ్యలకు నిప్పంటించాడు. 45 డిగ్రీలకు పైగా ఎండ, కొయ్యలు ఎండి ఉండడంతో మంటలు ఎగశాయి. కిషన్ వాటిని తప్పించుకోలేక సజీవ దహనమయ్యారు.



సూర్యాపేటజిల్లా రాజునాయక్ తండాలో వరి కొయ్య కాళ్లకు నిప్పుపెట్టిన రైతులు (ఫైల్)

ఎండిన కొయ్యలు దహనం చేయబోయి ఈ నెలలోనే ఇద్దరు రైతులు అగ్నికి ఆహుతయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇలా చేయొద్దంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన జారీ చేశారు. అధికారులు గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. అయినా చాలామంది రైతులు ఆగడం లేదు. రాష్ట్రంలో కొన్నేళ్ల కిందటి వరకు వరి కోతలను మనుషులే కోసేవారు. ఇప్పుడు హార్వెస్టర్లను వాడుతున్నారు. కొద్ది రోజులకు కొయ్య కాళ్లను దహనం చేస్తున్నారు. కాగా, పంట వ్యర్థాల దహనం విధానం.. సాగులో యంత్రాలను బాగా వినియోగించే పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఉంటుంది. అక్కడ కొయ్యలు అడుగు నుంచి రెండు అడుగుల ఎత్తులో మిగులుతాయి. వీటిని తొలగించడంలో కూలీ ఖర్చులకు తోడు సమయం పడుతుంది. దీంతోనే నిప్పు పెడుతుంటారు. ఈ మంటల పొగ ఢిల్లీకి కూడా వ్యాపించి కాలుష్య సమస్య సృష్టిస్తోంది. కొయ్యలకు నిప్పంటించే క్రమంలో రైతులు చనిపోవడంతో పాటు పక్క చేలు కూడా కాలిపోతున్నాయి. పొగతో వాతావరణం కలుషితం అవుతోంది. మంటల తీవ్రతకు నేల గట్టిపడి దెబ్బతింటోంది. కాగా, గడ్డి, భూమిలో చాలా పోషకాలు ఉంటాయని, కొయ్యల దహనంతో అవన్నీ కోల్పోతామని వ్యవసాయ నిపుణులు జీవీ రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చు లేకుండా మరో పంటకు వెళ్లాలనే

పొలంలో హార్వెస్టర్ వదిలిన కొయ్యలను తొలగించాలంటే ఎకరానికి 10-12 మంది కూలీలు కావాలి. దీనికంటే పంట వ్యర్థాల దహనం మేలని రైతులు భావిస్తున్నారు. కొయ్యలను భూమిలో కలిపేస్తే పంటకు ఎరువుగా ఉపయోగపడతాయి. యూరియా వినియోగం తగ్గుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, రైతులు రిస్క్ తీసుకోవడం లేదు. కాగా, 'చిప్పర్లు' అనే యంత్రాలతో వరి కొయ్యలను చిన్నగా కట్ చేయొచ్చని రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి తెలిపారు. పీఏసీఎస్‌లు, ఎఫ్‌పీవోల ద్వారా వీటిని రైతులకు అందించాలని సూచిస్తున్నారు. యాసంగిలో పెసర్లు, మినుములు, పప్పు ధాన్యాలు, వేరుశనగ, నువ్వులు తదితర నూనె గింజలు సాగు చేస్తే.. వానాకాలంలో వరి సాగుకు సమయం సరిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జలపతిరావు పేర్కొంటున్నారు పంజాబ్, హరియాణాలో వానాకాలంలో వరి, యాసంగిలో గోధుమ వేస్తారని, తెలంగాణ రైతులు కూడా దీనిపై దృష్టిపెట్టాలని రాష్ట్ర రైతుసంఘం ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి వివరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

స్వీపర్‌కు 2 లక్షల జీతం!

(మొదటి పేజీ తరువాయి)

సేవలందించిన కొందరు వ్యాపారులతో కుమ్మక్కై ఏడు బోగస్ కంపెనీలను సృష్టించాడు. ఢిల్లీ నుంచి ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అవసరమైన ముడిసరుకులు కొనుగోలు చేసినట్లు ఇన్వాయిస్‌లు, అక్కడి నుంచి రవాణా చేసినట్లుగా ఈ-వేబిల్-1, 2లను సృష్టించి, జీఎస్టీ అధికారులను మేనేజ్ చేసుకుని, రీఫండ్ పేరుతో రూ.46 కోట్లను కొల్లగొట్టినట్లు సాంకేతిక ఆధారాలను సేకరించారు. జీఎస్టీ అధికారుల అండదండలు ఉండడంతో.. ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా.. రూ.46 కోట్లను రీఫండ్‌గా పొందాడు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా జీఎస్టీ అధికారులు కొందరు కమీషన్ల కక్కుర్తితో చిరాగ్ శర్మకు సహకరించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందుకోసం జీఎస్టీ అధికారులు రూ.లక్షల్లో లంచం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఎక్కడా క్షేత్రస్థాయిలో కంపెనీలను, తయారీ యూనిట్లను తనిఖీ చేయకుండా.. ఆన్‌లైన్‌లోనే పని చక్కబెట్టిన అధికారులు కూడా అందినంతా దండుకున్నారు.

నిందితులు వీరే..

చిరాగ్ శర్మ కీలక సూత్రధారిగా ఉన్న జీఎస్టీ రీఫండ్ కుంభకోణంలో మరో ఏడుగురు నిందితులున్నారు. వారిలో వేమారెడ్డి రాజారమేశ్‌రెడ్డి(వినర్త్ ఆటోమొబైల్స్) రూ.23.79కోట్లు, నీరజ్ శుక్లా(యాకో ఎలక్ట్రిక్ బైక్) రూ.8.47 కోట్లు, ఇందర్‌కుమార్(క్రాక్స్ ఎలక్ట్రిక్ బైక్) రూ.63.06లక్షలు, గిరిధర్‌రెడ్డి, వినీల్ చౌదరి(గ్రోమోర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్) రూ.2.87 కోట్లు, వీరిద్దరూ అపెక్స్ ఎలక్ట్రిక్ బైక్ పేరిట రూ.3.09 కోట్లు, సుప్రియాపాండే(సుప్రియా ఎలక్ట్రిక్స్) రూ.2.02 కోట్లు, గౌరవ్(మాగ్నమ్ ఎలక్ట్రిక్ బైక్) రూ.4.96 కోట్లు కొల్లగొట్టినట్లు సీసీఎస్ పోలీసులు నిర్ధారించారు. పోలీసులు వీరిని ఇప్పటికే అరెస్టు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

చేసిన మంచిని చెప్పుకోలేకే ఓడాం!

- కొన్ని వర్గాలకు దూరమయ్యాం
- 30 వేల ఉద్యోగాలపై రేవంత్ సొంత డబ్బా: కేటీఆర్

యాదాద్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా వాటిని సరిగా ప్రచారం చేసుకోలేకనే ఎన్నికల్లో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, ఆలేరు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కొన్ని వర్గాలకు దూరమయ్యామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధనలో బీఆర్ఎస్‌తో పాటు ఉద్యోగులూ భాగస్వాములయ్యారన్నారు. తెలంగాణ ఆవిర్భవించగానే 73శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, పీఆర్సీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించామని తెలిపారు. ఉద్యోగులకు ఇన్ని సంక్షేమ పథకాలు చేపట్టినా, ఒకటో తేదీన వేతనాలు రావడం లేదని దుష్ప్రచారం చేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ అద్భుతంగా నిర్మించారని.. కానీ, ఆ గుడి పేరు చెప్పి ఏనాడూ ఓట్లు అడగలేదని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు దేవుడి పేరుతో ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మెడికల్ కళాశాలలు, యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మించామని చెప్పారు. 30 వేల ఉద్యోగాలను కేసీఆర్ భర్తీ చేస్తే.. వాటికి అపాయింట్‌మెంట్ లెటర్లు పంచుతూ సీఎం రేవంత్‌డ్డి సొంత డబ్బా కొట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కారు మాట తప్పిందన్నారు. తెలంగాణ ఆగమైందని, రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తోందని ఆరోపించారు. 'ప్రత్యర్థి పచ్చి బ్లాక్ మెయిలర్.. సొల్లు కబుర్లు చెప్పే మోసగాడు.. ఓటర్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు. ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడుసార్లు గెలిచిందని, మరోసారి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అటకెక్కిన అటవీ స్టేషన్లు

కాగితాలకే పరిమితమైన సర్కిళ్లు

- ఆయుధాలు ఇవ్వాలన్న ప్రతిపాదన గాలికే

హైదరాబాద్ మే 19(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్ల మాదిరిగా అటవీ శాఖ పరిధిలో ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న అంశం అటకెక్కింది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 30 ఫారెస్ట్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అటవీశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆయుధాలు అందజేయాలని కోరింది. ఈ ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. అటవీ సిబ్బందిపై దాడులు జరిగినప్పుడు ఉన్నతాధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకొంటున్నారు. 2022 నవంబరు 22న కొత్తగూడెం జిల్లా ఎర్రబోడు అటవీ ప్రాంతంలో ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు దారుణ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత 30 ఫారెస్ట్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని, అధికారులకు ఆయుధాలు(గన్స్) ఇవ్వాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అటవీ శాఖ ప్రతిపాదనలు పంపింది. తొలి దశలో 30 స్టేషన్లు, ఒక్కో చోట 18మంది సిబ్బందిని నియమించాలని సూచించింది. దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదు. అటవీశాఖ సిబ్బందిపై



దాడులు జరిగినప్పుడు ఆయుధాలు ఇవ్వాలని కోరడం.. తరువాత మరుగున పడిపోవడం పరిపాటిగా మారింది.

సర్కిళ్ల ఉత్తర్వుల జారీ అయినా..

అటవీశాఖలో సర్కిళ్లను, వాటికి సంబంధించిన ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ 2023లో అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులిచ్చారు. భూపాలపల్లిలో కాళేశ్వరం సర్కిల్, నిర్మల్‌లో బాసర సర్కిల్, సిద్దిపేటలో రాజన్న సర్కిల్, వరంగల్‌లో భద్రాద్రి సర్కిల్, నల్లగొండలో యాదాద్రి సర్కిల్, హైదరాబాద్‌లో చార్మినార్ సర్కిల్, మహబూబ్‌నగర్‌లో జోగులాంబ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ప్రత్యేక సర్కిళ్లను ఏర్పాటు చేస్తామని ఉత్తర్వులిచ్చినా.. ఒక్కటీ ఏర్పాటు చేయలేదు.

సిబ్బందిపై తరచూ దాడులు

పోడు భూముల వ్యవహారంలో అటవీ అధికారులకు, గిరిజనులకు పెద్ద ఎత్తున వివాదాలు నెలకొంటున్నాయి. వన్యప్రాణులను కాపాడే క్రమంలో వేటగాళ్ల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. గత రెండేళ్లలో జరిగిన దాడులను పరిశీలిస్తే.. కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలంలో చాలా చోట్ల తరచు గొడవలు జరుగుతున్నాయి. మంచిర్యాల జిల్లా కోయపోశగూడెంలో అటవీ భూమిలో సాగును అడ్డుకున్న అధికారులపై ఆదివాసీలు తిరగబడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీపంలో, ఆళ్లపల్లి మండలం ఆళ్లపల్లి, చింతకూద, రాయిపాడు, ముత్తాపురం, బర్లగూడెం గ్రామాల పరిధిలోని పోడు భూముల్లో 10 వేలకుపైగా మొక్కలు నాటేందుకు వెళ్లిన సిబ్బందితో గిరిజనులు ఘర్షణకు దిగారు. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రాసిగుట్ట తండాల్లో పోడు భూముల సర్వేకు వెళ్లిన అధికారులు, తండావాసుల మధ్య వివాదం నెలకొంది. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని చిత్రియాల, పెద్దమూల, నల్లచెలముల బుడ్డోని తండా పరిధిలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటేందుకు ప్రయత్నించగా.. తండాలవాసులు అడ్డుకున్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేస్తున్న ఉన్నతాధికారులు.. తర్వాత పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

కోడ్ ఉల్లంఘన.. కేటీఆర్‌పై చర్యలకు ఈసీ ఆదేశం

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): తాను ఎవరికీ ఓటు వేసిందీ పరోక్షంగా వెల్లడించడం ద్వారా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కేటీఆర్‌పై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ.. జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారికి, అదనపు సీఈవో లోకేశ్‌కుమార్ ఆదివారం మెమో జారీ చేశారు. మే 13న జరిగిన పోలింగ్ సందర్భంగా.. కేటీఆర్ నిబంధనలు ఉల్లంఘించారంటూ ఏఐసీసీ సభ్యుడు, సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈసీ ఈ ఆదేశాలు జారీ చేసింది. కాగా ఈ విషయంపై ఈసీ ఇదివరకే నోటీసులు జారీ చేసిందని, కేటీఆర్ స్పందించనందునే చర్యలకు ఆదేశించిందని తెలుస్తోంది.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో పార్టీ సమన్వయకర్తలను నియమించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. వరంగల్ వెస్ట్‌కు వినోద్‌కుమార్, కె.సంజయ్, డాక్టర్ సంజయ్, పి.కౌశిక్‌రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, బాల్క సుమన్, , వరంగల్ ఈస్ట్‌కు నన్నపనేని నరేందర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వి.సతీశ్‌కుమార్, రవీందర్‌సింగ్, రామకృష్ణ, సునీల్‌రావు, పల్లారాజేశ్వర్ రెడ్డి, తోట ఆగయ్య ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు రాజయ్య, రవిశంకర్, పాలకుర్తికి ఎర్రబెల్లి దయాకర్ రావు, చలిమెడ లక్ష్మీనరసింహారావు, భూపాలపల్లికి గండ్ర వెంకట రమణారెడ్డి, పుట్టమధును నియమించారు. డోర్నకల్, ములుగు, పరకాల, నర్సంపేట, వర్ధన్నపేటకు పలువురిని సమన్వయకర్తలుగా నియమించారు.

రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

అమలు కాకపోవడం విచారకరమన్నారు. కనీస మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు క్వింటాకు రూ.200-రూ.500 వరకు నష్టపోతున్నారని తెలిపారు. సకాలంలో వడ్లను కొనుగోలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తున్నారని మండిపడ్డారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వరికి రూ.500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతులకు ఉపశమనం కలిగించే నిర్ణయాలు తీసుకుని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురుస్తున్నందున కల్లాల్లో ఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని సంజయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాహుల్ ప్రధాని కావడం కల: ఈటల

అతి తక్కువ కాలంలో ప్రజలతో ఛీ కొట్టించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. ఆయన అతితక్కువ కాలంలో అతి ఎక్కువ డబ్బులు వసూలు చేసి పదేళ్ల కరువును ఒక్కసారే తీర్చుకోవాలనుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం మాదిరిగానే డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ సొంత పనులు చేసుకుంటున్నారు తప్ప ప్రజల బాగోగులను పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఈటల మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో కమీషన్ల దుకాణం తెరిచారని.. ప్రభుత్వ ఆదాయం పెంచడం కంటే కొంతమంది అధికార పార్టీ నేతలు వారి సొంత ఆదాయం పెంచుకోవడంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం పెంపునకు భూముల రేట్లు పెంచడం సరికాదని తెలిపారు. రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయిందని, రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఉచిత బస్సు తప్ప ఏ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. రూ.లక్ష రుణమాఫీ చేయడం బీఆర్ఎస్‌కు సాధ్యం కాలేదని, రూ.2 లక్షల రుణమాఫీ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం కలేనని ఈటల అన్నారు.

లిక్కర్ స్కాంలో దోషులు తప్పించుకోలేరు: ఎన్వీఎస్ఎస్

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో దర్యాప్తు సంస్థల విచారణ పారదర్శకంగా సాగుతోందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. ఈ కేసులో దోషులెవ్వరూ తప్పించుకోలేరని, త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ దగ్గర ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని, కేసు నుంచి తప్పించుకోవాలన్న ఉద్దేశంతో ఆరోపణలు చేసేవారిని తెలంగాణ ప్రజలు నమ్మరని అన్నారు.

నియంత పాలనకు మోదీ కుట్ర

- ఏం చేశారో చెప్పుకోలేక విపక్షాలపై విమర్శలు: సీతక్క



హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో నియంత పాలనను తీసుకొచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రజలకు ఏం చేసిందో చెప్పుకోలేక విపక్షాలపై విమర్శలు గుప్పించడం సిగ్గు చేటన్నారు. ఈశాన్య ఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న కన్నయ్య కుమార్‌కు మద్దతుగా టీకాంగ్రెస్ నేతలతో కలసి అక్కడ సీతక్క ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పేద మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలనూ బీజేపీ విమర్శిస్తోందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి ఇండియా కూటమి అధికారంలోకి రావడం తథ్యమని వ్యాఖ్యానించారు. కాగా, ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారని.. రుణమాఫీ కాగానే ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లు సిద్ధంగా ఉండాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిసి.. రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై వారు పదే పదే రాద్ధాంతం చేశారని ఓ ప్రకటనలో మండిపడ్డారు.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- త్వరలో బస్సు యాత్ర: జస్టిస్ చంద్రకుమార్



పంజగుట్ట, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిచిన పంటలను, ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ బి. చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ సంఘాల ప్రతినిధులు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ విఠల్ తదితరులతో కలిసి చంద్రకుమార్ విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన పంటను, ధాన్యాన్ని దాచుకోవడానికి, మంచి ధర వచ్చినప్పుడు విక్రయించడానికి మార్కెట్లలో శీతలగిడ్డంగులు, గోదాములను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు మరింత నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికే ప్రభుత్వం రైతుబంధు ఇవ్వాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం రుణమాఫీ చేస్తుందో, చేయదో తెలయని పరిస్థితి నెలకొందని అనుమానం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, త్వరలో బస్సు యాత్ర చేపడతామని చంద్రకుమార్ తెలియజేశారు. అనంతరం పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు, గోదాములు ప్రస్తుతం దేనికీ ఉపయోగపడే పరిస్థితి లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా వసూళ్లు

- ఆవులను తరలిస్తున్న వాహనాన్ని ఆపి అర్ధరాత్రి హల్‌చల్
- రూ.4.50 లక్షలు ఇవ్వకుంటే అంతుచూస్తామని హెచ్చరిక
- రూ.2 లక్షలు ఇచ్చినప్పటికీ మిగతా సొమ్ముకూ డిమాండ్
- పోలీసులను ఆశ్రయించిన అక్రమ రవాణాదారు
- అదుపులో నలుగురు.. నల్లగొండ జిల్లాలో ఘటన

నల్లగొండ, మే 19: గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఆపి.. సోషల్ మీడియా పేరిట పాత్రికేయులుగా వ్యవహరిస్తున్న వారు అర్ధరాత్రి వేళ వసూళ్లకు దిగారు. రూ.4.50 లక్షలు డిమాండ్ చేశారు. రూ.2 లక్షలు ఇచ్చినా.. మిగతా సొమ్ము కోసం పట్టుబట్టారు. దీంతో వాహనదారు పోలీసులను ఆశ్రయించాడు. వారు రంగంలోకి దిగి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని శ్రీకాకుళం, అన్నవరం ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 32 వాహనాల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్న విషయం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని కొందరికి తెలిసింది. సాగర్- హైదరాబాద్ రాష్ట్ర రహదారిపై శనివారం అర్ధరాత్రి తర్వాత మాటువేశారు. అప్పటికే 25 వాహనాలు తరలిపోయాయి. మరో ఆరు వాహనాల డ్రైవర్లు విషయం తెలిసి కళ్లుగప్పి ఉడాయించారు. ఒక్క వాహనం డ్రైవర్ మాత్రం చింతపల్లి వైపు వెళ్లే ప్రయత్నం చేసి దొరుకుతామని భావించి లారీని వెనక్కు తిప్పాడు. కొండమల్లేపల్లి నుంచి దేవరకొండ మీదుగా వెళ్లాలని భావించాడు. అయితే, దీన్ని 'కొండమల్లేపల్లి సోషల్ మీడియా' పేరిట పాత్రికేయులుగా చెలామణీ అవుతున్నవారు, ప్రైవేట్ వ్యక్తులు సొమ్ము చేసుకోవాలని భావించారు. రూ.4.50 లక్షలు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో పెట్టి అంతు చూస్తామని బెదిరించారు. 2 లక్షలు ఇచ్చినా వినకపోవడంతో అక్రమ రవాణాదారులు కొండమల్లేపల్లి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఆదివారం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ముగ్గురు సోషల్ మీడియా పేరు చెప్పుకొంటున్న వ్యక్తులు కాగా, మరొకరు స్థానిక పశువుల సంతకు చెందిన వ్యక్తి అని తెలిసింది. వీరు ఇంకొందరి పేర్లను వెల్లడించినట్లు తెలిసింది. 12 మంది బృందంగా తయారై రోజూ రహదారిపై ఇదేవిధంగా బెదిరింపులకు పాల్పడి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.. మరోవైపు 32 వాహనాల్లో పశువులు అక్రమంగా తరలింపుపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఎస్‌ఐ రామ్మూర్తిని వివరణ కోరగా.. అక్రమ వసూళ్లకు పాల్పడిన విషయమై విచారణ అనంతరం కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేవరకొండ మండలం పడమటిపల్లి వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్నను గెలిపించండి: మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, మే 19: ఇండ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో ఆదివారం మంత్రి పొంగులేటి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్పుకోసమే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, త్వరలోనే అర్హులైన వారికి రేషన్ కార్డులు, పింఛన్లు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలేరు ప్రజల దీవెనలతోనే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని, ఇక్కడి ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రచారం చేయకుండా గెలిచేలాగా ఇక్కడి ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీశ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

డయాగ్నస్టిక్ హబ్‌లకు జబ్బు!

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకపోవడంతో.. కొందరు ఉద్యోగాలు వదిలేస్తున్నారు. వైద్యులు సైతం ఇదే బాట పడుతున్నారు. దీనికితోడు డయాగ్నస్టిక్స్ హబ్‌లలో క్వాలిటీ కంట్రోల్ కూడా సరిగా ఉండటం లేదని, రోగుల రిపోర్టులు సరిగా రావడంలేదనే ఆరోపణలున్నాయి. మెషిన్లు పాడైతే సకాలంలో మరమ్మతు కూడా చేయించడం లేదని అంటున్నారు. జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకంలో భాగంగా తెలంగాణలో డయాగ్నస్టిక్స్ హబ్‌ల సేవలు 2018 జనవరిలో ప్రారంభమయ్యాయి. తొలుత హైదరాబాద్‌కే పరిమితమైన ఈసేవలను.. ఆ తరువాత అన్ని జిల్లాలకు విస్తరించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 36 డయాగ్నస్టిక్స్ హబ్‌లు ఉన్నాయి. వీటిలో రక్త, మూత్ర పరీక్షలకు సంబంధించిన 134 రకాల టెస్టులు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. కొత్తగా ఏర్పాటైన చోట మాత్రం 57 రకాల పరీక్షలే చేస్తున్నారు. కాగా, డయాగ్నస్టిక్స్ హబ్‌లలో ల్యాబ్ టెక్నీషియన్లు (ఎల్టీ), ల్యాబ్ అటెండర్, రేడియోగ్రాఫర్‌తోపాటు ల్యాబ్ మేనేజర్ ఉంటారు. వీరితోపాటు డాక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, శానిటేషన్ సిబ్బంది కూడా ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి డిప్యుటేషన్‌పై పంపించారు. ఈ హబ్‌ల సేవలు పెరగడంతో మరికొందరిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్నారు. అలాగే 104 వాహన సేవలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విరమించుకోవడంతో.. వాటిలో పనిచేసే ఎల్టీలు, ల్యాబ్ అటెండర్లు అందరినీ డయాగ్నస్టిక్స్ హబ్‌లకు పంపించారు. ఇలా సుమారు ఐదారు వందల మంది సిబ్బంది 104 వాహన సేవల నుంచి వచ్చారు. ఈ హబ్‌లలో అవకాశం లేనివారిని ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించారు.

వేతనాలు ఇవ్వకపోవడంతో..

104 వాహన సేవల సిబ్బందికి వేతనాలను గతంలో వాటి నిర్వహణ సంస్థ ఇచ్చేది. వీరు అక్కడి నుంచి డయాగ్నస్టిక్స్ హబ్‌లకు రావడంతో అందరూ ఆయా జిల్లాల పరిధిలోని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ కిందకు వచ్చారు. ఆ ఏజెన్సీలే వీరందరికీ జీతాలిస్తున్నాయి. అయితే గత ఐదారు నెలలుగా సదరు ఏజెన్సీలు వీరికి వేతనాలివ్వడం ఆపేశాయి. దాంతో డయాగ్నస్టిక్స్ హబ్‌లలో పనిచేస్తున్న వారిలో కొందరు ఉద్యోగాలు మానేస్తున్నారు. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు జీతాలు రాలేదని, ఇలాగైతే కుటుంబం గడవడం కూడా కష్టమని ములుగు జిల్లాలో పనిచేసే ఓ రేడియోగ్రాఫర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు.. సర్కారు నుంచి రూ.కోట్ల నిధులు విడుదలైనప్పటికీ కొన్ని మ్యాన్‌పవర్ ఏజెన్సీలు ఆ డబ్బులను ఉద్యోగులకు చెల్లించడం లేదు. వచ్చిన నిధుల్ని బ్యాంకుల్లోనే డిపాజిట్లుగా ఉంచేస్తున్నారని, దాంతో వాటికి నాలుగైదు నెలకు పెద్ద మొత్తంలో బ్యాంకు వడ్డీ ఇస్తుందని, ఇటువంటి సంఘటనలు కొన్ని జిల్లాల్లో జరిగాయని ఉద్యోగులు చెబుతున్నారు. అంతేకాకుండా.. డయాగ్నస్టిక్స్ హబ్‌లలో పనిచేసే సిబ్బంది వేతనాల్లో భారీగా వ్యత్యాసం ఉంటోంది. కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన ఎల్టీలకు రూ.27 వేల వరకు వేతనం ఉంది. 104 వాహనాల నుంచి వచ్చిన ఎల్టీలకు మాత్రం కేవలం రూ.22,750 మాత్రమే ఇస్తున్నారు. ఇందులో వివిధ కటింగ్‌లు పోను.. బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది కేవలం రూ.20 వేలేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా హబ్‌లు

డయాగ్నస్టిక్స్ మాన్యువల్ ప్రకారం.. ప్రతి హబ్‌లోనూ పాథాలజీ, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజీ విభాగాలకు వైద్యులు ఉండాలి. కానీ, రాష్ట్రవ్యాప్తంగా డయాగ్నస్టిక్స్ హబ్‌లలో ఈ వైద్యులందరూ లేరన్నది బహిరంగ రహస్యం. చాలా చోట్ల పాథాలజిస్టులతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. అలాగే రేడియాలజిస్టులు కూడా చాలా తక్కువ మంది ఉంటున్నారు. దాంతో అందుకు సంబంధించిన రిపోర్టులను రేడియోగ్రాఫర్లే చూస్తున్నారు. డయాగ్నస్టిక్స్ హబ్‌లలో ఎల్టీలు మెషిన్లపై పరీక్షలు చేసిన అనంతరం.. ఆ రిపోర్టులను వైద్యులకు చూపించి వారితో ధ్రువీకరించుకోవాలి. కానీ, ప్రస్తుతం ఎక్కువ హబ్‌లలో సంబంధిత వైద్యులు లేరు. ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ) డిప్లొమా చేస్తున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం హబ్‌లకు వస్తుండటంతో వారితోనే రిపోర్టులను మమ అనిపించేస్తున్నారు. మరోవైపు.. ఉన్నవారికి సరిగా వేతనాలివ్వకపోవడంతో కొందరు మానేస్తుండగా, మరికొందరు మెడికల్ కాలేజీలు, జనరల్ ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు. డయాగ్నస్టిక్స్ హబ్‌లలో పరీక్షలు జరిపే విషయానికి వస్తే.. తొలుత క్షేత్రస్థాయిలోని పీహెచ్‌సీల్లో రోగుల రక్త, మూత్ర నమూనాలు సేకరిస్తారు. రోగి ఆధార్ కార్డు ఆధారంగా ఒక రిజిస్టర్ నంబరు జనరేట్ చేస్తారు. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా బార్‌కోడ్ తీసి శాంపిల్స్‌పై వేసి, డయాగ్నస్టిక్స్ హబ్‌లకు పంపుతారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కానీ, ప్రస్తుతం సర్వర్ డౌన్ సమస్య కారణంగా అత్యధిక పీహెచ్‌సీల్లో ఉదయం వేళ సకాలంలో బార్‌కోడ్ జనరేట్ చేయడం లేదని అంటున్నారు. సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇక హబ్‌లో క్వాలిటీ కంట్రోల్ కూడా సరిగా ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో రోగుల రిపోర్టులు సరిగా ఉండటం లేదని, బయట ప్రైవేటు ల్యాబ్‌లలో చేసే రిపోర్టులకు, డయాగ్నస్టిక్స్ హబ్ రిపోర్టులకు మధ్య వ్యత్యాసం కొన్నిసార్లు ఎక్కువగా ఉంటోందని రోగులు చెబుతున్నారు.

శ్రమ దోపిడీ చేస్తున్నారు

మమ్మల్ని 104 నుంచి డయాగ్నస్టిక్స్ హబ్‌కు పంపారు. అయితే కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాల్సి ఉండగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించారు. దాంతో గతేడాది డిసెంబరు నుంచి వేతనాలు సరిగా రావడం లేదు. సెలవులు కూడా ఇవ్వడం లేదు. శ్రమదోపిడీకి గురవుతున్నాం. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నారు. మాకు కూడా ప్రతినెలా మొదటివారంలో జీతాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఇప్పటికే తీవ్ర అప్పుల్లో కూరుకుపోయి.. కుటుంబాన్ని కూడా నడపలేని పరిస్థితికి వచ్చాం.

\- ఔట్‌సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

హరిత నిర్మాణాలకు సర్కారు ప్రోత్సాహం

- ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య పారిశ్రామిక క్లస్టర్లు
- 'గ్రీన్ ప్రాపర్టీ షో'లో భట్టివిక్రమార్క



హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేలా భవన నిర్మాణాలు చేపట్టి తెలంగాణలో జీవన విధానం మార్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా 50 శాతం నీరు, 40 శాతం విద్యుత్ ఆదా చేసే హరిత నిర్మాణాలకు సర్కారు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన గ్రీన్ ప్రాపర్టీ షో ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. సగటు మనిషి కొనుగోలు చేసేలా హరిత నిర్మాణాలు ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులకు హైదరాబాద్ స్వర్గధామం లాంటిదని అభివర్ణించారు. ఇక్కడ అనుకూల వాతావరణం, నీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, కావలసినంత భూమి, శాంతిభద్రతలు, ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఉన్నాయన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణం పూర్తయితే తెలంగాణ కొత్త రూపుదిద్దుకుంటుందన్నారు. జిల్లాలను, అక్కడి ఉత్పత్తులను హైదరాబాద్‌కు అనుసంధానం చేయడంలో ఆర్‌ఆర్‌ఆర్ తోడ్పడుతుందన్నారు. ఆర్‌ఆర్‌ఆర్, ఓఆర్‌ఆర్ మధ్య పారిశ్రామిక క్లస్టర్లు నిర్మిస్తామన్నారు. వీటి మధ్య పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నాయని, ఫలితంగా వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు, పెట్టుబడిదారులు ఈ ప్రాంతంలో నివసించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రీన్ ప్రాపర్టీ షో నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ)తో భాగస్వామ్యం కావడం ఆనందకరమన్నారు. ఐజీబీసీ 2001 నుంచి దేశంలో గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌కు నాయకత్వం వహించి, 11.67 బిలియన్ చదరపు అడుగుల నిర్మాణ లక్ష్యం సాధించడం అభినందనీయమన్నారు. మన రాష్ట్రంలో 1.46 బిలియన్ చదరపు అడుగుల మేర నిర్మాణం జరగడం, 2.50 లక్షల నివాసాలకు గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికెట్ పొందడం పెద్ద ముందడుగన్నారు. ప్రభుత్వం హైదరాబాద్‌కు గ్లోబల్ సిటీ సదుపాయాలు కల్పిస్తూ పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్రంలో రాబోయే కొద్ది రోజుల్లో 50 శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని, హైదరాబాద్‌ను విశ్వనగరంగా నిలబెట్టడానికి అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

..అయితే ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాసింది. వారినుంచి సమాధానం వస్తుందని శనివారం మధ్యాహ్నం నుంచి సీఎంతో పాటు మంత్రులు సచివాలయంలో ఎదురుచూశారు. అనుమతి రాకపోవడంతో రాత్రి 7 గంటల తర్వాత వెనుదిరిగారు. సోమవారం వరకు చూసి, స్పందన రాకుంటే మంత్రివర్గమే ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సీఈసీ అధికారులతో చర్చించడం.. షరతులతో కూడిన అనుమతి రావడంతో సస్పెన్స్ వీడింది. మరోవైపు ఈసీ షరతులను దృష్టిలో ఉంచుకుని.. ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, వానాకాలం పంటల ప్రణాళిక, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల వంటివాటిపై మంత్రివర్గం చర్చించనున్నట్లు సమాచారం. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీపై చాలా పట్టుదలగా ఉన్నారు. ఆగస్టు 15లోగా మాఫీ చేసి తీరుతామని పదేపదే చెప్పారు. ముందుగా అనుకున్న ప్రకారం.. క్యాబినెట్‌లో ఇదే కీలక అంశం అయ్యేది. కానీ, సీఈసీ షరతుతో చర్చకు అవకాశం లేదు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి, కోడ్ తొలగిపోయే నేపథ్యంలో జూన్ 4 తర్వాతనే చర్చించే వీలుంది. కాగా, రాజకీయంగా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలపై మంత్రివర్గంలో సమీక్ష జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

అన్నారం, సుందిళ్లపై ఫోకస్

- ఈ బ్యారేజీల నుంచి ఈ సీజన్‌లో నీరు పంపింగ్ చేసేందుకు నిర్ణయం!
- త్వరలో పంప్‌హౌస్‌ల పరిశీలనకు సీఎం
- మరమ్మతు పనులు వేగవంతం



హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో కాపాడుకొని, ఈ ఏడాది వీటిలో నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అన్నారం బ్యారేజీని పుణేలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్)తో, సుందిళ్లను జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్‌ఐ)తో పరీక్షలు చేయించడంతో పాటు ఆ బ్యారేజీలు కట్టిన నిర్మాణ సంస్థలతో మరమ్మతులు చేయించనున్నారు. బ్యారేజీ ఎగువ భాగం (అప్‌స్ట్రీమ్)తో పాటు దిగువ భాగం (డౌన్‌స్ట్రీమ్)లో ఉన్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) బ్లాకులు, అప్రాన్లతో పాటు రాఫ్ట్ (పునాది) కింది భాగంలో ఏర్పడిన రంధ్రాలను సిమెంట్, కాంక్రీట్ మిశ్రమంతో నింపనున్నారు. ఈ ప్రక్రియ చేపడితే మరమ్మతులు తేలిక అవుతాయి. కాళేశ్వరంలో 3 బ్యారేజీలు ఉండగా అందులో సుందిళ్ల ఒక్కటే తక్కువ సమస్యలను కలిగి ఉంది. మరో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ గత ఏడాది అక్టోబరు 21న కుంగిపోయిన విషయం విదితమే. ఈ ఏడాది వరదలకు మరింత దెబ్బతినకుండా సర్కారు చర్యలకు ఉపక్రమించింది. బ్యారేజీ గేట్లన్నీ ఎత్తడానికి చర్యలు తీసుకోనున్నారు. ఏడో బ్లాకుకు 12 గేట్లు ఉండగా అందులో ఒక గేటును ఇప్పటిదాకా లేపారు. ఇతర గేట్లను క్రమంగా ఎత్తనున్నారు. ఇక తీవ్రంగా దెబ్బతిన్న 2 పిల్లర్లకు చెందిన గేట్లను క్రేన్ల సహాయంతో లేపాల్సి ఉంటుంది. వరదల అనంతరం కాఫర్ డ్యామ్ నిర్మించి, కొత్త బ్లాకు లేదా దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో కొత్త పిల్లర్లు కట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఉపయోగంలోకి రాదని అభిప్రాయానికి సర్కారు వచ్చింది. దాంతో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసుకొని, ఆ నీళ్లను ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్లలోకి పంపింగ్ చేయనున్నారు. ఇందులో భాగంగా పంప్‌హౌస్‌లను సీఎం రేవంత్ రెడ్డితో పాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి త్వరలో సందర్శించనున్నారు. ప్రస్తుతం కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం (అన్నారం) పంప్‌హౌస్‌లు సేఫ్ జోన్‌లో లేవు. పూర్తి రిజర్వాయర్ లెవల్ కన్నా కింద ఉన్నాయి. దాంతో వీటి ప్యానల్ బోర్డులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే ఈసీజన్‌లో సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నీరు ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు చేరనుంది. సీఎం పర్యటన నేపథ్యంలో మరమ్మతులు/పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేశారు. పంప్‌హౌస్‌ల పరిశీలన అనంతరం సీఎం బ్యారేజీలపై కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు.

హెలికాప్టర్ ప్రమాదం.. ఇరాన్ అధ్యక్షుడు రైసీ గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలు, డిజ్మార్ అటవీ ప్రాంతాన్ని దాటే క్రమంలో.. జోల్ఫా గ్రామం సమీపంలో రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఆ సమయంలో జోల్ఫాతోపాటు.. ఉజి, అర్దేషిరి, బారాజిన్ గ్రామాలతోపాటు.. డిజ్మార్ అటవీ ప్రాంతాల్లో భీకర వర్షం కురుస్తోంది. ఈదురు గాలులు, దట్టమైన పొగమంచుతో వాతావరణం ప్రతికూలంగా మారింది. మరో 2 హెలికాప్టర్లు గమ్యస్థానానికి చేరుకున్నా.. రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జాడ లేకపోవడంతో.. ఆదివారం సాయంత్రం నుంచి ఇరాన్ వ్యాప్తంగా టెన్షన్ నెలకొంది. కాసేపటికి తూర్పు అజర్‌బైజాన్ గవర్నర్ మాలిక్ రహ్మతి "అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోయింది" అని ప్రకటించారు. అయితే.. ఇరాన్ అధికారిక మీడియా, అధికారులు మాత్రం.. "రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జోల్ఫా ప్రాంతంలో హార్డ్ ల్యాండింగ్ అయ్యింది" అని తెలిపారు. అధ్యక్షుడు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో విదేశాంగ మంత్రి, పైలట్, కోపైలట్, అధ్యక్షుడి భద్రతా బృందం అధిపతి, అంగరక్షకులు, అధికారులు ఉన్నట్లు వివరించారు.

ప్రతికూల వాతావరణంలో గాలింపు

హెలికాప్టర్ హార్డ్ ల్యాండింగ్ సమాచారం అందగానే.. సైన్యం, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ), రెడ్ క్రెసెంట్‌తోపాటు.. మొత్తం 20 బృందాలు గాలింపు ప్రారంభించాయి. భారీ వర్షం, ఈదురు గాలుల కారణంగా గాలింపులో ఆటంకాలు ఏర్పడుతున్నాయని, కొండ ప్రాంతాల్లో మట్టిరోడ్లు చిత్తడిగా మారిపోయి, వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు పేర్కొన్నారు. "సమాచారం అందిన వెంటనే హెలికాప్టర్ల ద్వారా గాలింపునకు ప్రయత్నించాం. అయితే.. దట్టమైన పొగమంచుతో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పదాతి దళాలు అతికష్టమ్మీద ముందుకు సాగుతున్నాయి" అని ఇరాన్ ఎమర్జెన్సీ సేవల అధికార ప్రతినిధి బాబక్ యెక్తాపరస్ట్ మీడియాకు తెలిపారు. కడపటి వార్తలందేసరికి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా.. రైసీ క్షేమంగా తిరిగి రావాలంటూ ఇరాన్ వ్యాప్తంగా ప్రజలంతా ప్రార్థనలు చేయాలంటూ అధికారులు ప్రసార మాధ్యమాల ద్వారా కోరుతున్నారు. ఇరాన్ మిత్ర దేశాలు కూడా రైసీ క్షేమ సమాచారం కోసం ప్రార్థనలు చేస్తున్నాయి. కాగా.. రైసీ హెలికాప్టర్ గల్లంతుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు వైట్‌హౌస్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఎప్పటికప్పుడు బైడెన్ ఇరాన్ అధ్యక్షుడి సమాచారాన్ని ఆరా తీస్తున్నట్లు వివరించాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇరాన్ అధ్యక్షుడు రైసీ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. అటు ఇరాన్ మద్దతున్న ఉగ్రవాద సంస్థలు-- ఇస్లామిక్ జిహాద్ పొలిటికల్ బ్యూరో నేత అలీ అబూ షాహిన్, హమాస్ సీనియర్ సభ్యుడు ఇజ్జత్ అల్-రెష్క్‌తోపాటు.. హిజ్బుల్లా, హౌతీ నేతలు కూడా రైసీ క్షేమ సమాచారం కోసం ప్రార్థనలు చేస్తున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.



గాలింపు చర్యల్లో ఇరాన్ సైన్యం


కాలం చెల్లిన హెలికాప్టరే కారణమా?

ఇరాన్ వద్ద హెలికాప్టర్లన్నీ కాలం చెల్లినవని తెలుస్తోంది. 1979 నాటి ఇస్లామిక్ రివల్యూషన్ సమయంలో ఉన్న హెలికాప్టర్లే ఇప్పటికీ సైన్యంలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఇరాన్ వాటి విడిభాగాలను కూడా దిగుమతి చేసుకోలేని పరిస్థితులున్నాయి. ఆదివారం రైసీ ప్రయాణించిన హెలికాప్టర్ కూడా కాలం చెల్లిందే కావడంతో ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేక ప్రమాదం జరిగి ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

సుప్రీంలీడర్‌కు నమ్మిన బంటు!

హెలికాప్టర్ ప్రమాదంలో గల్లంతైన రైసీ వయస్సు 63 సంవత్సరాలు. ఆయన అధ్యక్ష పదవిని చేపట్టక ముందు న్యాయశాఖకు నేతృత్వం వహించారు. 1988లో ఇరాక్-ఇరాన్ యుద్ధం సందర్భంగా చిక్కిన ఖైదీలకు సామూహికంగా మరణశిక్ష విధించి, అమలు చేశారు. వీరిలో మైనర్లు కూడా ఉండడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతూ.. రైసీపై ఆంక్షలు విధించింది. 2015 నుంచి ఇరాన్‌లో అణ్వాయుధాలకు కావాల్సిన యురేనియం(వెపన్ గ్రేడ్) తయారీలో కీలక పాత్ర పోషించారు. 2017 ఎన్నికల్లో హసన్ రౌహానీకి వ్యతిరేకంగా బరిలో ఉన్నా.. ఓటమిపాలయ్యారు. 2021 ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించారు. అయితే.. 2021లో అత్యల్పంగా ఓటింగ్ జరిగి, 2.89 కోట్ల మంది పౌరులు మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో రైసీ 62% ఓట్లను సాధించి, అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. యురేనియం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. హమాస్, హౌతీ, హిజ్బుల్లా, ఇస్లామిక్ జిహాద్ ఉగ్రసంస్థలకు అండదండలను అందజేశారనే ఆరోపణలున్నాయి. హమాస్‌కు మద్దతుగా గత నెల ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడుల్లోనూ రైసీది కీలక పాత్ర అని స్పష్టమవుతోంది.

హెలికాప్టర్ కూలిన ప్రదేశం ఇదే..



మేడిగడ్డ బ్యారేజీ అధికారుల్లో గుబులు

- నిర్లక్ష్యం వహించిన ఇంజనీర్లపై చర్యలకు ముఖ్యమంత్రి ఆదేశించడంతో కలవరం
- ఆయన పర్యటనకు ముందే చర్యలు!

మహదేవపూర్ రూరల్, మే 19: కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారుల్లో కలవరం మొదలైంది. భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు బాధ్యులపై, పనులు పూర్తికాకముందే సర్టిఫికెట్ జారీ చేసిన ఇంజనీరింగ్ అధికారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ప్రశ్నించడం చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని సీఎం సీరియస్‌గా తీసుకొని కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారని, తమపై వేటు కూడా వేసే అవకాశముందని ఇంజనీరింగ్ అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సమయంలో కుంగిన బ్లాక్-7కు బాధ్యత వహించిన ఓ కీలక ఇంజనీరింగ్ అధికారిపై ఇప్పటికే ఒకసారి విచారణ పూర్తయింది. మరోసారి ఆయనపై అంతర్గత విచారణ జరుగుతున్నట్టు ఆ శాఖలో చర్చ సాగుతోంది. బ్యారేజీలో పనులు పూర్తవకున్నా అప్పటి ఈఎన్సీ ప్రోద్బలంతోనే ఆ అధికారి పూర్తయినట్టు సర్టిఫికెట్ ఇచ్చారనే ఆరోపణలున్నాయి. బ్యారేజీ కుంగినప్పటి నుంచి తనపై ఎలాంటి రిమార్క్ రానివ్వకుండా ఆ కీలక అధికారి పలుకుబడి కలిగిన పలువురు నేతలతో పైరవీలు చేయించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయనతో పాటు సహచర ఇంజనీర్లపై చర్యలు తీసుకొనే అవకాశం లేకపోలేదనే చర్చ సాగుతోంది. మరో వారంలో సీఎం కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌లను సందర్శించనున్నారు. ఈ లోగానే సర్కారు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. మహదేవపూర్ సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే కీలక అధికారితో పాటు ఇక్కడి నుంచి రామగుండం కార్యాలయానికి బదిలీపై వెళ్లిన మరొకరిపై చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

అధికార పక్షంతో అంటకాగారు!

» ఏపీలో పోలింగ్ తర్వాతి విధ్వంసంపై పోలీసుల ఉదాసీనత

» 'సిట్' దర్యాప్తులో వెలుగులోకి..

అమరావతి/తిరుపతి-ఆంధ్రజ్యోతి, తాడిపత్రి టౌన్/నరసరావుపేట, మే 19: రాష్ట్రంలో పోలింగ్ రోజు(ఈ నెల 13న).. ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలను పోలీసు యంత్రాంగం చాలా తేలిగ్గా తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సంఘటనల తీవ్రతను బట్టి పెట్టాల్సిన సెక్షన్లు కూడా పెట్టలేదని.. కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సేకరించిన సమాచారాన్ని బట్టి తేటతెల్లమవుతోంది. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో మహిళా ఏజెంట్లపై కత్తులతో దాడులు, ప్రతిపక్ష కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పిల్లల మెడపై కత్తిపెట్టి టీడీపీ ఏజెంట్‌ను బయటకు రప్పించడం.. నరసరావుపేటలో ఏకంగా టీడీపీ అభ్యర్థి వాహనంపైనే దాడిచేసి హత్యాయత్నానికి దిగడం వంటివి పెద్ద తీవ్రమైనవిగా పోలీసులు పరిగణించలేదు. మారణాయుధాలతో దాడులకు దిగిన వ్యక్తులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయలేదు. మాచర్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌లలో సిట్ దీనిని గమనించింది. మరోవైపు.. తాడిపత్రిలోనూ పోలీసుల వైఫల్యం, ఏకపక్షంగా వ్యవహరించిన తీరు బయటపడ్డాయి. అక్కడ ఇరు వర్గాల దాడుల్లో బాలింత సైతం గాయపడినా మహిళలపై దాడులకు సంబంధించిన సెక్షన్లు నమోదు కాలేదు. ఇక తిరుపతిలో పోలీసులు మరీ ప్రేక్షక పాత్ర వహించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే వైసీపీ రౌడీలు రాడ్లు, కర్రలతో టీడీపీ అభ్యర్థిని అంతమొందించేందుకు చేసిన ప్రయత్నం వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. అక్కడ కూడా తగిన సెక్షన్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సిట్ గుర్తించినట్లు సమాచారం. నాలుగు చోట్లా పోలీసులు అధికార పార్టీలో అంటకాగినట్లు తేలింది. కొందరిని మాత్రమే అరెస్టు చేసి ఎక్కువ మంది బాధ్యులను వదిలిపెట్టడాన్ని సిట్ బృందాలు గుర్తించాయి. సిట్ ఏర్పడ్డాక అరెస్టవడం ఖాయమని తెలియడంతో.. పై నుంచి వచ్చిన సలహాల మేరకు ఆకస్మికంగా పరారైనట్లు బట్టబయలైంది. కీలకమైన కుట్రదారులు, క్రియాశీలంగా దాడులు చేసిన వారిని వైసీపీ అభ్యర్థులు డబ్బిచ్చి ఊళ్లు దాటించినట్లు.. కొందరినైతే సుదూర ప్రాంతాలకే పంపినట్లు తేలింది. వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు పోలీసు బృందాలు సిద్ధమవుతున్నాయి. అన్నిటికీ మించి.. పోలింగ్ రోజు అల్లర్లకు సంబంధించి ప్రజాప్రాతినిధ్య (ఆర్‌పీ) చట్టం సెక్షన్లు ఎందుకు పెట్టలేదన్న ప్రశ్నకు స్థానిక పోలీసుల నుంచి ఎలాంటి సమాధానం లేదు. ఈ వివరాలతోపాటు ఎక్కడెక్కడ ఏ పోలీసు అధికారి తప్పు చేశారు.. ఉద్దేశపూర్వకంగా పక్షపాతంతో పనిచేసిన వారెవరు.. మొదలైన అంశాలతో సిట్ ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఎన్నికల సంఘానికి నివేదిక పంపినట్లు తెలిసింది.

ఆ ముగ్గురు ఎస్పీలపై క్రమశిక్షణ చర్యలు

» అభియోగాల నమోదుకు సీఎస్ ఆదేశాలు

అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో పోలింగ్ నాడు, ఆ తర్వాత చెలరేగిన హింసను అరికట్టని కారణంగా సస్పెండైన పల్నాడు, తిరుపతి ఎస్పీలు బిందుమాధవ్, అమిత్ బర్దార్, తిరుపతి జిల్లా నుంచి బదిలీ అయిన ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆ ఎస్పీలు తమ వివరణ ఇచ్చేందుకు 15 రోజులు గడువిచ్చారు. 60 రోజుల్లోపు వారిపై చర్య తీసుకుని ఈసీకి తెలియజేయాల్సి ఉంది.

రాష్ట్రాన్ని గబ్బులేపిన వైఎస్ఆర్ పార్టీ

» నోరుజారిన వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి

తిరుమల, మే 19(ఆంధ్రజ్యోతి): ఈ రాష్ట్రాన్ని గబ్బులేపిన పార్టీ వైఎస్ఆర్ పార్టీ అంటూ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎంత విలువ ఉందో అందరికీ తెలుసని, ఒక శాతం కాదు కదా 0.2శాతం కూడా కడపలో ఆ పార్టీ ప్రభావం ఉండబోదన్నారు. అవినాశ్ భారీ మెజార్టీతో గెలవడంతోపాటు వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కడప బరిలో షర్మిల నిలబడినా, ఇంకెవరు నిలబడినా కాంగ్రెస్ పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసని అన్నారు.

తనిఖీల పేరుతో తాకరాని చోట తాకుతూ..

నక్సలైట్ టెస్ట్ పేరుతో అడవుల్లో పోలీసు బలగాల ఆటవిక ప్రవర్తన

» ఆధార్ లేకుంటే మహిళలకు హింసే

» మహిళలు స్నానాలు చేస్తుంటే.. డ్రోన్లతో వీడియోల చిత్రీకరణ

» రాకెట్ లాంచర్లు, డ్రోన్లతో దాడులు

» కాల్పుల్లో ఆర్నెల్ల వయసున్న చిన్నారి మృతి

» అత్యాచారాలు.. కాల్పులతో భయంభయం

» 'ఆంధ్రజ్యోతి'తో ఎంబీఎం, బీజేసీఎస్ నేత రఘు మిడియామి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): "ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసు బలగాలు ఆటవిక ప్రవర్తనతో పేట్రేగిపోతున్నాయి. నక్సలైట్ల పేరుతో మూలవాసీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆధార్ కార్డు లేకపోతే.. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలను నక్సలైట్ టెస్ట్ పేరుతో పాశవికంగా హింసిస్తున్నాయి. నక్సలైట్ టెస్ట్ అంటే.. మహిళల ఛాతీ భాగాన్ని తడుముతూ, చనుమొనలను పిసకడం. ఈ పరీక్షలో మహిళ చను మొనల్లోంచి పాలు వస్తే నక్సలైట్ కాదని, రాకుంటే నక్సలైట్ అని బలగాలు భాష్యం చెబుతున్నాయి. అడవుల్లో రెండేసి కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులను ఏర్పాటు చేసుకున్న కేంద్ర బలగాలు అరాచకాలు అన్నీఇన్నీ కావు" అని మూలవాసీ బచావో మంచ్(ఎంబీఎం), బస్తర్ జనసంఘర్ష్ సమన్వయ సమితి(బీజేసీఎస్) అధ్యక్షుడు రఘు మిడియామి వాపోయారు. ఎక్కడో మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసపై యావత్ దేశం ఎలుగెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దారుణాలకు సంఘీభావం తెలిపేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో మారణహోమం, కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో రఘు మిడియామీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సిలేంగురు స్మృతిదినం జరపనివ్వలేదు

ఆదివాసీల అక్రమ అరెస్టు, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ 2021 మే 10న మేం పోరాటాలను ప్రారంభించాం. ప్రశాంత జీవనాన్ని కోరుకున్నాం. అటవీ వనరుల ప్రైవేటీకరణను, మావోయిస్టుల పేరుతో సైనికీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. 2021 మే 10న సిలేంగురులో జరిగిన పోరాటం సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపారు. మా సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులను పొట్టనబెట్టుకున్నారు. వారి మృతికి గుర్తుగా ఏటా మే 9, 10 తేదీల్లో సిలేంగురు స్మృతిదినం జరుపుకొంటున్నాం. ఈ ఏడాది మాత్రం పోలీసులు అనుమతుల్లేవంటూ అడ్డుకున్నారు. అయితే.. జూన్ 9, 10 తేదీల్లో స్మృతిదినాన్ని నిర్వహించి తీరుతాం.

మహిళల నగ్న వీడియోల కోసమా?

ఆధార్ లేకుంటే.. మా అడవుల్లో తిరగడానికి మేం అర్హులం కాదని బలగాలు హుకుం జారీ చేశాయి. ఆధార్ లేకుంటే.. మావోయిస్టుల ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలకు నక్సలైట్ టెస్ట్‌లు పెడుతున్నారు. మహిళలు స్నానం చేస్తుంటే.. డ్రోన్ కెమెరాలతో నగ్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఆ వీడియోలను చూపుతూ.. మా వాళ్లు ఇంటి నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, కాల్పులు, రాకెట్ దాడులతో ప్రశాంత అడవులు మోతెత్తిపోతున్నాయి. అడవులే మా నివాసాలు. మావోయిస్టుల పేరుతో మమ్మల్ని అడవుల్లోంచి తరిమేస్తున్నారు. ఈ మధ్య జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించుకున్నారు. నిజానికి ఆ చనిపోయిన వారిలో ఇద్దరు మాత్రమే నిరాయుధులైన నక్సలైట్లు. మిగతావారంతా తునికాకు సేకరణకు వెళ్లినవారే.

క్యాంపులతో అరాచకాలు

గతంలో రహదారులు, సరిహద్దుల వెంబడి సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం నిర్మించిన భవనాల్లో తిష్టవేస్తున్నారు. రోడ్లపైనా ప్రతీ రెండు కిలోమీటర్లకు ఒక క్యాంపును పెట్టారు. క్యాంపుల్లో బలగాలు ఆదివాసీలపై చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. గ్రామాల్లోకి వచ్చి, బలవంతంగా డబ్బులు లాక్కెళ్తున్నారు. ఫూటుగా తాగి.. కాల్పులు జరుపుతున్నారు. ఇలా జరిపిన కాల్పుల్లో ఇటీవల ఆరు నెలల వయసున్న ఓ చిన్నారి మరణించింది. ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్న బేస్‌క్యాంపుల కోసం మొత్తం 2 లక్షలకు పైగా చెట్లను నరికేశారు.

ప్రభుత్వాలు మారినా..

ప్రభుత్వాలు మారినా.. మా తలరాతలు మారడం లేదు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్లన్నీ మూలవాసీలు, ఆదివాసీలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అడవి బిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాకు వర్తించకుండా చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను హరించినప్పుడే విప్లవం పురుడుపోసుకుంటుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు, మూలవాసీల్లో అది మొదలైంది. మా అడవుల్లో మేం బతకాలంటే.. 'రణమా..? మరణమా..??' అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో మేం ఎంబీఎం, బీజేసీఎస్‌లను స్థాపించాం. పోరాడుతున్నాం. మాపైనా కేంద్ర బలగాల బెదిరింపులు పెరిగాయి. అరెస్టులు పెరిగాయి. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా సమస్యలేమిటి? పోరాటం ఎందుకు? అనేది తెరమీదకు, జనం మధ్యకు రాకుండా కేంద్ర బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మాపైన మావోయిస్టు ముద్ర వేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయకులైన ఆదివాసీలు, మూలవాసీలను హతమారుస్తూ.. అక్కడ ఎలాంటి సమస్యల్లేవంటూ బయటి ప్రపంచానికి చెబుతున్నాయి. అందుకే మా సమస్యలేంటో చెప్పుకోవడానికి హైదరాబాద్ వచ్చాం. దయచేసి మీడియా మిత్రులు మా ప్రాంతాలను సందర్శించాలి. మా ఇబ్బందులేమిటో మీకు అర్థమవుతాయి.

సహజ వనరుల కోసమే..

ప్రభుత్వాలు ఆదివాసీలు, మూలవాసీల పట్ల బలగాలతో ఇంత క్రూరంగా దాడులు చేయించడానికి కారణం.. అడవుల్లో ఉన్న సహజ వనరులు, నిక్షేపాల కోసమే. బస్తర్, సుక్మా, కాంకేర్, దంతేవాడ, నారాయణపూర్, బీజాపూర్.. ఇలా పలు ప్రాంతాల్లో 28 రకాల నిక్షేపాలున్నాయి. మైనింగ్‌తో ఆ ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనేదే ప్రభుత్వాల ఆలోచన. ఆ ప్రయత్నాలకు మేం అడ్డుగా ఉన్నాం. మావోయిస్టులు కూడా ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. అందుకే మమ్మల్ని అడవులను ఖాళీ చేసి వెళ్లేలా చేస్తున్నారు. మా అడవుల్లో 'మురియా' వంటి అంతరించిపోతున్న గిరిజన తెగలు(పీవీటీజీ) ఉన్నాయి. గిరిజనులు.. ప్రత్యేకించి పీవీటీజీల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయి. అయినా.. ప్రభుత్వాలు ఇలాంటి మాపై కక్షకట్టడం బాధాకరం. మా సంపదను కొల్లగొట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు అడవుల్లో తిష్టవేశాయి. అయితే.. చదువుకున్న ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో ఆ కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. గడిచిన పాతికేళ్లలో 10 వేల మంది ఆదివాసీలు, మూలవాసీలను అరెస్టు చేశారు. పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, కాల్చిచంపారు.

చెరువులో ముగ్గురు మహిళల మృతదేహాలు

» ఇద్దరు మహబూబ్‌నగర్ వాసులుగా గుర్తింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: కర్నూలు మండలం గార్గేయపురం చెరువులో ఆదివారం మూడు మృతదేహాలు వెలుగుచూశాయి. దీంతో గార్గేయపురం గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. స్థానికుల సమాచారంతో తాలుకా సీఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. మృతులను మొదట హిజ్రాలుగా అనుమానించిన పోలీసులు సమీపంలోని హిజ్రాలను పిలిపించి గుర్తించేందుకు ప్రయత్నించారు. చివరకు అవి మహిళలవని నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా.. మృతుల్లో ఇద్దరిని తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించారు. కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, ఎస్పీ జి.కృష్ణకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఈ కేసు దర్యాప్తు కోసం మూడు బృందాలను నియమించారు.

నేటి నుంచి టెట్

హైదరాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 2 వరకు వివిధ తేదీల్లో జరిగే ఈ పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేపర్-1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,428మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, తాము హైదరాబాద్ కోరుకుంటే.... ఆదిలాబాద్‌లో వేశారని, ఒక పేపర్ పరీక్షను ఒక సెంటర్‌లో, మరో పేపర్ పరీక్షను మరో చోట వేశారని అభ్యర్థులు వాపోతున్నారు.

ఆ భూమి ఎవరిది?

సుచిత్రలోని భూమిపై ఎమ్మెల్యే మల్లారెడ్డి, విప్ లక్ష్మణ్ పరస్పర సవాళ్లు

పేట్‌బషీరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం సుచిత్ర ప్రాంతంలోని భూమి వివాదంపై ఆదివారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి. ఈ భూమికి సంబంధించి శ్రీనివాస్‌రెడ్డి వద్ద ఉన్నవి ఫేక్ డాక్యుమెంట్లు అని మల్లారెడ్డి ఆరోపించారు. తన వద్ద ఉన్నవి ఫోర్జరీ డాక్యుమెంట్లు అని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే ప్రభుత్వ విప్ లక్ష్మణ్ రాజీనామా చేస్తారా? అని మల్లారెడ్డి సవాల్ విసిరారు. అయితే మల్లారెడ్డికి తాము వారం రోజులు గడువు ఇస్తామని, దేశంలో ఏ సర్వేయర్‌తోనైనా సర్వే చేయించుకోవాలని, తమ తప్పు ఉంటే క్షమాపణ చెప్పి వెళ్లిపోతామని లక్ష్మణ్‌కుమార్ ప్రతి సవాల్ చేశారు. జీడిమెట్ల గ్రామంలోని సర్వే నంబర్ 82, 83లోని 2.29 ఎకరాల భూమి విషయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, శేరి శ్రీనివాస్‌రెడ్డి మధ్య శనివారం ఘర్షణ జరగడం తెలిసిందే. దీంతో పోలీసులు మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని, శ్రీనివాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. కాగా, ఆదివారం మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఏసీపీ రాములు సమక్షంలో రెవెన్యూ అధికారులు ఆ భూమిలో సర్వే చేపట్టారు. హద్దులను ఏర్పాటు చేసి.. సర్వే రిపోర్టులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

సీఎంను, మంత్రిని కలుస్తా: మల్లారెడ్డి

సుచిత్రలోని భూ వివాదంపై తాను భూమి పత్రాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, జిల్లా కలెక్టర్‌ను కలుస్తానని ఎమ్మెల్యే మల్లారెడ్డి చెప్పారు. సర్వే నంబర్ 82, 83లో తాము 14 యేళ్ల క్రితం భూమి కొనుగోలు చేశామని, తమ కాంపౌండ్ వాల్ లోపల 2.20 ఎకరాల భూమి మాత్రమే తమ పేరిట ఉందని అన్నారు. సుధామణకు చెందిన 4.24 ఎకరాలు రోడ్డుకు ఆవల ఉండేదని, అయితే ఆయన వద్ద ఉన్నవి ఫేక్ డాక్యుమెంట్లు అని, గతంలోనే ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకుందని తెలిపారు. 2015లో ప్రస్తుత ప్రభుత్వ విప్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సహా తొమ్మిది మంది 3900 పైచిలుకు చదరపు గజాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. వాళ్లు గతంలోనే భూమి విషయమై నాలుగైదుసార్లు తన వద్దకు వచ్చారని చెప్పారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని సుధామణ ఎలా విక్రయిస్తారని, ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. సర్వే అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయన్నారు.

విచారణ జరిపించాలి: లక్ష్మణ్‌కుమార్

మల్లారెడ్డి చేసిన ఆరోపణలపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించారు. కొంపల్లిలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లారెడ్డి భూములపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 82/1/ఈఈలో ఉన్న భూమిని 2015లో మదన్‌మోహన్ అనే వ్యక్తి వద్ద 4 ఎకరాలు సుధామణ కొనుగోలు చేశారని, ఆయన వద్దనుంచి సుమారు 4 వేల గజాలను తాను, మరో 8 మంది కలిసి కొనుగోలు చేశామని చెప్పారు. సుధామణ కొనుగోలు చేసిన భూమిలో కొంత మిలిటరీ కాంపౌండ్ వాల్ రోడ్డుకు పోయిందని, ఆ భూమికి ప్రభుత్వం నష్టపరిహారం కూడా చెల్లించిందని అన్నారు. ఆ భూమిని 2021లో శేరి శ్రీనివాస్‌రెడ్డికి అమ్మేశామన్నారు. తమకు 2016 నుంచి హైకోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉందన్నారు. ఈ మేరకు యజమాని శ్రీనివాస్‌రెడ్డి పొజిషన్‌కు వెళితే మల్లారెడ్డి బెదిరించి, భూమిని లాక్కొన్నాడని ధ్వజమెత్తారు. తమ డాక్యుమెంట్ ఫేక్ అంటున్న మల్లారెడ్డి కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ను ఎందుకు వెకేట్ చేయించుకోలేదని ప్రశ్నించారు. సర్వే కోసం నోటీసులు ఇప్పిస్తే.. తనకు అవసరం లేదంటూ సమాధానం పంపించారని తెలిపారు. ఈ వివాదాన్ని గతంలో అప్పటి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, మాట్లాడుకొని సెటిల్ చేసుకోవాలని ఆయన సూచించగా, 'కేటీఆర్ నాకేమైనా ఫ్రీగా చేశాడా?' అని మల్లారెడ్డి రివర్స్ మాట్లాడారని లక్ష్మణ్ దుయ్యబట్టారు. మల్లారెడ్డి తన పేరును ప్రస్తావించినందునే తాను మాట్లాడుతున్నానని చెప్పారు.

రోదసిలోకి గోపి తోటకూర

తొలి భారతీయ అంతరిక్ష యాత్రికుడిగా రికార్డు.. రాకేశ్‌శర్మ తర్వాత మళ్లీ ఇప్పుడే..

» బ్లూ ఆరిజిన్ న్యూషెపర్డ్-25 సక్సెస్

» పది నిమిషాలపాటు సాగిన యాత్ర

వాషింగ్టన్, మే 19: రోదసిలోకి వెళ్లిన తొలి భారతీయ పర్యాటకుడిగా గోపి తోటకూర రికార్డు నెలకొల్పారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ నెలకొల్పిన బ్లూ ఆరిజిన్ సంస్థ ఆదివారం నిర్వహించిన అంతరిక్షయాత్రలో గోపి పాలుపంచుకున్నారు. న్యూషెపర్డ్-25 పేరుతో బ్లూ ఆరిజిన్ ఆదివారం ఉదయం తమ 7వ మానవసహిత రోదసి యాత్రను నిర్వహించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 గంటల 37 నిమిషాలకు పశ్చిమ టెక్సాస్‌లోని ప్రయోగకేంద్రం నుంచి స్పేస్ క్యాప్సూల్ రోదసిలోకి దూసుకెళ్లి పది నిమిషాల్లో భూమి మీదకు సురక్షితంగా తిరిగి వచ్చింది. ధ్వని వేగానికి మూడింతల వేగంతో స్పేస్ క్యాప్సూల్ ప్రయాణించింది. భూమికి 105 కి.మీ.ల ఎత్తు వరకు వెళ్లింది. దాంట్లో ఉన్న ఆరుగురు ప్రయాణికులు కొద్దిసేపు భారరహిత స్థితిని అనుభవించారు. అంతరిక్షం నుంచి భూమిని వీక్షించారు. ఈ రోదసియాత్రలో మొత్తం ఆరుగురు ప్రయాణికులు పాల్గొన్నారు. వీరిలో గోపి తోటకూర ఒకరు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోపి.. ఎంబ్రీ రిడిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చేశారు. పైలట్‌గా, ఏవియేటర్‌గా పని చేస్తున్నారు. విమానాలతోపాటు సీప్లేన్‌లను, గ్లైడర్లను, హాట్ ఎయిర్ బెలూన్లను కూడా ఆయన నడిపిస్తారు. 1984లో భారత సైన్యానికి చెందిన వింగ్ కమాండర్ రాకేశ్‌శర్మ రోదసిలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర నమోదు చేశారు. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా గోపి తోటకూర రికార్డు నెలకొల్పారు. బ్లూ ఆరిజిన్ అంతరిక్షయాత్రలో పాల్గొన్న ఆరుగురిలో.. అమెరికాకు చెందిన తొలి నల్లజాతి వ్యోమగామి, 90 ఏళ్ల వయసున్న ఎడ్ డ్వైట్ కూడా ఉండటం విశేషం. డ్వైట్‌ను 1963లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ నాసా వ్యోమగాముల బృందంలో ఒకరిగా ప్రకటించినప్పటికీ.. తుది బృందంలో ఆయన ఎంపిక కాలేదు. తర్వాత కాలంలో పలువురు నల్లజాతీయులు రోదసికి వెళ్లారు కానీ డ్వైట్‌కు అవకాశం రాలేదు. ఇన్నేళ్ల తర్వాత బ్లూ ఆరిజిన్ ద్వారా ఆయన రోదసిలోకి వెళ్లొచ్చారు. తద్వారా, అంతరిక్ష యాత్ర చేసిన అత్యధిక వయస్కుడిగా నిలిచారు. అంతరిక్ష యాత్రకు గాను ఒక్కొక్కరి నుంచి బ్లూ ఆరిజిన్ ఎంత టికెట్ మొత్తం వసూలు చేసిందన్నది వెల్లడి కాలేదు. డ్వైట్ టికెట్‌ను మాత్రం కొన్ని సంస్థలు స్పాన్సర్ చేసినట్లు సమాచారం.



అంతరిక్ష యాత్రకు వెళ్లిన బృందంలో గోపి (ఎడమ నుంచి మొదటి వ్యక్తి)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.